# పద్యశిల్పం

సహస్రవసంతాల
— సాహితీ వారసత్వం



నండూరి రామకృష్ణమాచార్య

# తెలుగు

# పద్య శిల్పం

## సహస్ర సంవత్సరాల సాహితీ వారసత్వం

కర్త

**నందూరి రామ కృష్ణమాచార్య**

[అధ్యక్షుడు : ఆంధ్ర పద్య కవితా సదస్సు]

కారయిత

**సహజకవి – అభినవ వేమన**

**శ్రీ సాహిణి వేంకట లక్ష్మీపతిరావు**

Name of the Author : Dr. Nandury V. Rama Krishnamacharya
M.A.Ph.D.,
1-8-76 Prender Ghast Road 35 Jawahar Nagar,
Secunderabad - 500 003. Phone : 816 537

Name of the Book : "TELUGU PADYA SILPAM"
The Sculptural Beauty and symmetry of Telugu metrical verse.

Language : Telugu

Nature of the book : Literary Criticism

Copy Rights : Reserved by the Author

Year of Publication : 1995

Price : Rs. 80

Copies are available for Sale with the Following

(i) **Author – 1-8-76** Prender Ghast Road - 35 Jawahar Nagar,
**Secunderabad** - 500 003.

(ii) **M/s. Visalandhra** Publishers, Eluru Road, Vijayawada

(iii) Sri S. Venkat Rao – Secretary General
ANDHRA PADYA KAVITA SADAS
Gandhi Nagar, Yellamanchili - 531 055.

Number of the copies : 3000, Coverpage : GANGADHAR

Press : Chary & Company, 9-4-9 Charles Street, Secunderabad - 500 003.
Phones : 802970, 803850

## రచయితకు కవితా నీరాజనము

ధైర్యము రొమ్ము విచ్చినది, ధర్మము త్రాసున తూగె; అంచితౌ
దార్యము వ్రేళ్ల పాతుకొనె; దక్షత పీఠము వైచి నిల్చె; సత్
కార్య వినిర్వహమ్ము ఇలు గట్టి వసించెను - రామ కృష్ణమా
చార్యుల గుండె లోతుల ప్రసన్నతలో - మధురానుభూతిలో.

అష్టావధాని, శ్రీ గాడేపల్లి కుక్కుటేశ్వరరావు

అమృత హృదయునకు, సంయమి
సమ సహృదయునకు, ఉదారచరితునకు, మహో
త్తమ గుణ భరితునకు, క్రియా
కమనీయ దయామయునకు, కావ్యమయునకున్.

నయమార్గ సుప్రసిద్ధా
న్వయ శ్రీ నండూరి వంశ నామార్యునకున్
జయ మార్గ సుప్రసిద్ధా
హ్వయ వేంకట రామ కృష్ణమాచార్యునకున్

అంకిత పద్యాలు - డాక్టరు ఆచార్య కొర్లపాటి శ్రీ రామమూర్తి

కానిమ్మోయి కవీంద్ర! నీ అతిథి సత్కారమ్ము నీ యింటిలో
వాణీ శారద గలంగల న్మధుర నిక్వాణమ్ములో ఇందిరా
పాణిప్రస్ఫుట పద్మ గర్భ మధు సంపాతమ్ములో, నిత్య క
ల్యాణమ్ముల్ మరి పచ్చ తోరణముగా ఆచార్య మిత్రా! ఇకన్.

తారాతోరణము నుండి - శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

**క్రొత్త పాతల మేలి కలయిక**

నండూరి రామ కృష్ణమాచార్య - శైలి యందును - శబ్దజాలము నందు క్రొత్త పాతల మేలి కలయిక కన్పట్టుచున్నది.

- తారాతోరణ పీఠిక - శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి

*Extract from "Contemporary Indian Literature"*
*Published by the*
SAHITYA AKADEMI – NEW DELHI IN 1955

## THE NEO – CLASSICISTS

Within recent years, one notices the beginning of a new movement, the return to classicism. If the Leftists and Surrealists rebelled against the romanticism of the earlier decades of this century, the neo-classicists like NANDURI KRISHNAMACHARYULU, Jandhyala Papayya Sastry and G. Joshua are questioning the value of the Surrealism of the years from 1935 to 1960. Harmony, instead of strife, is their ideal. In the post-war world an equilibrium has to be achieved between matter and spirit, between idealism and realism. The Neo-classicists are anxious to regain for poetry, its dignity as the symbol of all that is beautiful and true.

***Prof. G.J. SOMAYAJI***

Dr. Krishnamacharya – is a Future Tense amongst the modern poets. Telugu Literature will reserve a coveted place for him amongst the galaxy of the illustrious poets of Andhra.

From – Preface to PRAGATI GEETA

# మున్నుడి

నండూరి రామకృష్ణమాచార్య

"గుడి కూలును – నుయి పూడును
వడి నీళ్లకు చెరువు తెగును – వనమును ఖిలమౌ;
చెడనిది పద్యం బొకటియె,
కుడి యెడమల కీర్తి గన్న – గువ్వల చెన్నా".

"దేశ భాషలందు తెలుగు లెస్స" – అన్న శ్రీకృష్ణదేవరాయలు
"సప్త సంతానములలో ప్రశస్తి గాంచి
ఖిలము గాకుండునది ధాత్రి – కృతియ" అని ప్రకటించాడు.

తెలుగు వారికి – సహస్ర సంవత్సరాల పద్య సాహితీ వారసత్వం ఉంది. ఈ వారసత్వాన్ని కాపాడుకొని పెంపొందించుకోటం తెలుగు వారి పవిత్ర కర్తవ్యం.

ఈ గ్రంథం "తెలుగు పద్య శిల్పము" – ఆదర్శం ఇదే. ఈ గ్రంథంలో వేయేండ్లలో తెలుగులో అవతరించిన కావ్యాలలోని పద్యాలలోని శిల్ప సౌష్ఠవం ప్రస్తరింపబడింది.

ఒక ప్రాచీన తెలుగు కవిని గూర్చి – ఒక కమ్మని కట్టు కథ – జనశ్రుతిలో ప్రచారంలో ఉంది. ఆ కవి – తాను వ్రాసిన పద్యాలు తాటాకులపై వ్రాసి – వరద వెల్లువలో ఉన్న కృష్ణానదిలో విసిరివేసాడట. ఆ తాటాకులలో కొన్ని ఏటి వరద నీటికి ఎదురీది వచ్చాయట. ఆ కవి ఆ పద్యాలనే చేర్చి శతకం వ్రాశాడట. ఇది కేవలం కల్పనా కథ కావచ్చు. అయితే ఇందలి అంతరార్థంలో నిత్య సత్యం స్వయంవ్యక్తమై సాక్షాత్కరిస్తుంది. "కొన్ని పద్యాలు మాత్రమే కాల మహా వాహినికి ఎదురీది సహృదయుల నాలుకలపై నర్తించగలవు", ఇందలి సాహితీ శిల్ప రహస్యం ఏమిటి? ఈ సమాధానం కోసం అన్వేషించటమే ఈ గ్రంథ రచన.

తెలుగు పద్య రచన - విలుచు - కంఠస్థమై
అతికిపోయి మనసు అరల లోన;
మనుజ గాత్ర ధర్మ మర్మ చైతన్యమ్ము
చిందు లాడు తెలుగు ఛంద మందు.

శ్రీ చక్రవర్తుల రాఘవాచార్య - విశాలాంధ్ర సంపాదకులు - ప్రసంగ ధోరణిలో ఒకసారి అన్నారు - "తెలుగు పద్య శిల్పానికి - మానవ కంఠ యంత్ర నిర్మాణానికి ఏదో అవినాభావ సంబంధం ఉన్నట్లుంది. తెలుగు పద్యం సులువుగా కంఠస్థం అవుతుంది".

నేడు - ఈ బహుళాంధ్రోక్తిమయ ప్రపంచంలో వందలు వేలు పద్యాలు అప్పచెప్పగలవారు ఉన్నారు. అట్టి వారిలో - వసు చరిత్ర - ఆమూలచూడంగా గద్యభాగాలతో పాటు అనర్గళంగా అప్పచెప్పగల శ్రీ కట్టి నాగార్జునశ్రీ వంటివారు పేర్కొనదగినవారు. తెలుగు పద్యం చిరంజీవి.

"తెలుగు పద్య శిల్పము" నకు - డాక్టరు ప్రసాదరాయ కులపతి సమకాలీన సాహితీ జగత్తులో ఆశుకవితావధారణ సార్వభౌముడుగా సుగృహీత నామధేయుడు - సతీర్థ్యుడు "పద్మాసనం" అనే శీర్షికతో పీఠిక అనుగ్రహించాడు. సంతోషం. తెలుగు పద్య శిల్పంలోని స్వారస్యం "పద్మాసనం" అనే పద గుంఫనంలో అంతరాంతరాలలో నిక్షిప్తమై ఉంది. సాహిత్య శిల్ప సమీక్ష ఆసహస్రారము వేయి పడగలు విప్పి విజృంభించే ఒక గొప్ప హఠ యోగ విద్య. పీఠిక కైచేసిన అట్టి సాహితీ హఠ యోగ పద్య విద్యాధరస్వామికి - నా ధన్యవాదాలు, అభినందనలు.

కులపతి అనినంత - తెలుగులో సజీవ
కవన దివ్య వజ్ర ఖనియె సుమ్ము;
శారదాంబ - ఆడు - ఛందస్జతులలోడ
ఆశు లాస్య గతుల - అతని నోట.

ఇక్కడ ఒక మాట ఎలుగెత్తి చాటాలి. ఈ గ్రంథం - పద్య రచనను ఉగ్గడించుచున్నది. అయితే రచయితకు - వచన కవితపై - గేయ వాఙ్మయంపై ఎనలేని గౌరవ భక్తి ప్రపత్తులు ఉన్నాయని - మనవి. రాజశేఖరుడు కావ్యామీమాంసలో ప్రతిభ = భావయిత్రి + సమాధి + కారయిత్రిగా పేర్కొన్నాడు.

"గురువు లఘువు చేసి కుంచించి కుంచించి,
　　లఘువు గురువు చేసి - లాగి లాగి,
కవిత చెప్పునట్టి - కవి గులామును బట్టి
　　ముక్కు కోయ వలయు త్రొక్కిపట్టి" అనే తెలుగు పద్యం ఉంది.

పద్యాలు వ్రాసిన వారు అందరూ కవులు కారు. కవులు అందరూ పద్యాలు వ్రాయనక్కరలేదు. "గద్యం కవీనాం నికషం వదంతి"అన్నారు విద్వాంసులు. నా దృష్టిలో గేయ కవిత తెలుగు తల్లికి మొట్ట మొదట పుట్టిన ఆడుపడుచు. పెద్ద ముత్తైదువ. అక్కగారు. పద్యం ఆ గేయకవిత అనే అక్కగారికి తమ్ముడు. వచన కవితకు - అన్నగారు పద్య కవిత - అక్కగారు గేయ కవిత. బిడ్డలు కలహించటం కన్నతల్లి భరించటం కష్టం. వచన కవిత - అనే దుడ్డుకట్టెతో పద్యం నడుము విరుగగొట్టగలననే ప్రతిజ్ఞ చేయవచ్చు ఎవరైనా. దుడ్డు కట్టెలు విరుగవచ్చు. పద్యం నడుము విరుగక పోవచ్చు.

జనశ్రుతిలో ఒక కట్టుకథ ఉంది. ఒక యువకుడు - ప్రేయసి కోరగా కన్న తల్లిని చంపి ఆమె గుండెకాయ పళ్లెంలో పెట్టి - ప్రేయసికి కానుకగా తీసుకొని వెళ్లుచున్నాడట. అప్పుడు అతని తల ద్వారానికి కొట్టుకొని దెబ్బతిన్నదట. ఆ మాతృ హృదయం అన్నదట "నాన్నా - నీ తల బొప్పి కట్టిందా?" అని.

"తెలుగు తల్లి - కడుపు చలువ పంటలు - సుమ్ము
　　వచన - గేయ - పద్య రచన లెల్ల;
ఎదిగి - కన్నబిడ్డ లెదిరించినను గూడ
　　విడువ లేదు - తల్లి - కడుపు తీపి".

తెలుగులో పద్య కవి శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారికి గేయ కవి శ్రీ సి. నారాయణరెడ్డిగారికి జ్ఞానపీఠ బహుమతులు లభించాయి. ఈసారి వచన కవికి లభిస్తే సంతోషం.

ఏదైనా మంచి పనికి స్థూలంగా ఒక వ్యక్తి కర్తగా - కనుపించవచ్చు. సూక్ష్మ దృష్టిలో చూస్తే కర్త - కారయిత - ప్రేరకుడు - ఆమోదకుడు నలుగురు సమ భాగినులు అని ఒక సంస్కృత సుభాషితం.

కర్తా కారయితాశ్చైవ ప్రేరకశ్చానుమోదకః
సుకృతే దుష్కృతేపి వా చత్వారః సమభాగినః

ఈ గ్రంథకర్తను నేను; కాని - కారకుడు శిష్యమిత్రుడు పద్య కవితా సిద్ధ హస్తుడు - సహజకవి - అభినవ వేమన శ్రీ సాహిణి వేంకట లక్ష్మీపతిరావుగారు. 1993లో ఢిల్లీ నుండి నన్ను - అనవద్య హృద్యపద్య కవితాసదస్సు వార్షికోత్స వములో సత్కరించాడు. ఈ పుస్తక రచనకు ఆయన కల్పించిన దోహదం - మరువరానిది.

శ్రీ శిష్టా వేంకట్రావుగారు - ఆంధ్ర పద్య కవితా సదస్సు ప్రధాన కార్యదర్శి.

పద్య కవిత - గొప్ప ఉద్యమ స్ఫూర్తిలో
యావదాంధ్రమందు - అలరునట్లు
చేసె - కార్యదర్శి - శిష్ట వేంకట్రావు;
తెలుగు తల్లి యెడద పులకరింప.

నేటికి - ఆకాశవాణి ఇచ్చిన సమస్యను పూరించే కవులు జ్ఞాన పరాయణులు - వందలు వేలు తెలుగుసీమలో పట్టణాలలో మారుమూల పల్లెలలో నేటికి బ్రదికి యున్నారు. "తెలుగు పద్య కవితా - వర్ధతా మభివర్ధతామ్".

గుంటూరు - శ్రీనాథ కవితా పీఠాధిపతి - ఈ 'తెలుగు పద్య శిల్ప పీఠిక' "పద్మాసన" - రచయిత శ్రీ కులపతి ప్రేరకులలో ప్రధానుడు.

తెలుగు సారస్వత చరిత్రలో ప్రత్యేక ప్రాముఖ్యం సంతరించుకున్న సహృదయ చక్రవర్తులు "కృతికర్తలు", తెలుగు కవులకు ప్రపంచ చరిత్రలో జరిగిన సమ్మాన సత్కృతులు – మరియే ఇతర భాషా కవులకు జరుగలేదు. రాజరాజునకు నన్నయ అనురక్తుడు. మనుమ సిద్ధికి – తిక్కన మహాకవి – మంత్రి. ఎఱ్ఱన – వేమారెడ్డి ఆస్థానకవి. సేనాని మల్లారెడ్డికి ప్రాణమిత్రుడు. శ్రీనాథునకు ముత్యాల శాలలో కనకాభిషేకం జరిగింది. పెద్దనను కృతిపతి శ్రీ కృష్ణదేవరాయలు – "ఎదురైనచో మదకరీంద్రము డిగ్గి కేలొత యొసగి ఎక్కించుకొన్నాడు, మను చరిత్ర అంకితం పుచ్చుకున్నాడు. ఊరేగింపు పల్లకి తన చేత ఎత్తినాడు. తెలుగు కృతి పతులు – కవులను కనక రత్నాభరణాలతో కస్తూరీ కర్పూర హారతులతో – హేమ పాత్రాన్నాలతో సత్కరించారు.

ఈ గ్రంథం – "తెలుగు పద్య శిల్పం" – కృతిపతి శ్రీ వై.యస్.పి. రెడ్డి గారు "అభినవ కృష్ణదేవరాయ" బిరుదాంకితుడు – తెలుగు కృతిపతుల వంగడము నకు సజీవ ప్రతీక.

శ్రీ వై.యస్.పి. రెడ్డిగారు – నంద్యాలలో ఈ మధ్య గండ్లూరి దత్తాత్రేయ శర్మ శతావధానం ఏర్పాటు చేసి భూమి విరాళ మిచ్చారు.

ఆయన ఆస్థాన కవిని గని – "కవి" శ్రీ కలుగొట్ల విజయాత్రేయను – ప్రతి నెల సత్కరించుచున్నారు. శ్రీ వై.యస్.పి. రెడ్డిగారి సాహితీ సహృదయకు హృదయపూర్వక ధన్యవాదాలు.

ధనము కూడబెట్టి – తన జేబిలో నుండి
        త్యాగ యోగి వేగ దాన మిచ్చు;
పరహితార్థి – దాత – ప్రత్యక్ష దైవమే
దాత – కన్న మిన్న ధరణి లేడు

ఇక – ఆమోదక వర్గంలో చేరే అమృత హృదయులు కొందరినైనా పేర్కొనటం నా కర్తవ్యంగా భావించుచున్నాను.

గుంటూరు డాక్టరు. కె. సదాశివరావుగారు - సంఘసేవా పరాయణుడూ, హృదయాళు లైన మేధావి. ఆయన చేసిన సాయం ప్రోత్సాహం మరువరానిది.

ఒకనాడు నా శిష్యుడట. విశాఖపట్నం శ్రీ సి. యస్.యన్. రాజుగారు అందించిన అవ్యాజ సహాయం పేర్కొనదగినది. రాబడీ పన్ను అధికారి గుంటూరు డాక్టరు రఘుగారు ఒక సహృదయ సమ్రాట్టు.

కోరి - వెన్నెల గుడి - గుండెలో రఘుగారు
కట్టుకొనెను - లలిత కళల కొరకు;
దిద్దుకొనెను - సంస్కృతి ప్రతీకగ చేర్చి
స్వీయ వర్తనమ్ము - జీవితమ్ము.

డాక్టరు జె. బాపురెడ్డి కవి ఐ.పి.యస్ గారికి జోహారులు. ముఖచిత్ర నిర్మాత శ్రీ గంగాధర్ గారికి వందనములు.

అచ్చుకొరకు కలిసి వచ్చె ద్రవ్యము నాకు
కదల కుండ - ఇల్లు వదల కుండ;
తెలుగు పద్య శిల్ప రీతితుల్ - వర్ధిల్లి
వెల్లి విరియు గాక - విశ్వ మెల్ల.

ఈ గ్రంథ రచనకు చిరస్మరణీయమైన దోహదం - కలిగించిన సుగృహీత నామధేయుడు - సహజకవి - అభినవ వేమన బిరుదాంకుడు శ్రీ ఎమ్.ఎస్. రెడ్డి (శ్రీ మల్లెమాల సుందర రామిరెడ్డి) గారికి నా హృదయపూర్వక ధన్య వాదములు. శారీరకంగానే గాక సాహిత్యం లోను ఆజానుబాహువైన శ్రీ ఎమ్.ఎస్. రెడ్డిగారు - విఖ్యాత కవి - పద్య కవితా ప్రియుడు, సుప్రసిద్ధ వక్త.

"యతియు గతియు లేని అతివాగు డంతయు
కవన మనుట కంచు కనక మనుటె"

అని ఎలుగెత్తి చాటిన పద్య కవితా విక్రమాదిత్యుడు. ఆ పద్యకవితోద్యమ ప్రవక్తకు నా జేజేలు.

# అవతారిక

**సహజకవి అభినవ వేమన**

**సాహిణి వేంకట లక్ష్మీపతిరావు, BE, FIV, FIV, FICA, FUWAI**

ఏ భాషకు కూడా లేని ఛందోబద్ధమైన కవిత్వము తెలుగుభాషను వరించిన ప్రత్యేకమణిభూషణము. చిత్ర విచిత్రమైన పద్యములను మన పూర్వకవులు వ్రాసి మన భాషకు అఖండమైన వన్నె తెచ్చినారు. ఒక పద్యము నాలుగర్థములు వచ్చి నటుల వ్రాయగల్గినారు. నలయాదవ రాఘవ పాండవీయము, దీనికొక మచ్చు తునక. సమస్యాపూరణములు, అష్టావధానములు, శతావధానములు, సహస్రావధానములు చేసి, రాజాస్థానములలో కంచుఢక్కలు పగులగొట్టి, గండపెండేరములు తొడిగించుకొనినారు. గంట కాసువుగా 500 పద్యములను చెప్పగలిగారు.

కవిత అంటే ఛందస్సు మాత్రమే గాదు. పద్య శిల్ప సౌష్ఠవ రేఖలు ఎన్నో ఉన్నాయి. ఏ విషయాన్ని పద్యంలో చెప్పాలి, దేనిని గద్యంలో చెప్పాలి, ఏ విషయానికే పద్యం వాడాలి, అవే శిల్ప రహస్యాన్ని పూర్వ రచయితలు బొహిసన పట్టేరు.

నాట్యమున కాహార్య మవసరము. దైవమును సర్వాంగ సుందరముగా నలంకరిస్తారు. వివిధ రకముల పుష్పముల నొక పద్ధతిలో కడితేనే చక్కని మాలౌతుంది. అటులనే భావ సమీకరణ కూర్పు అందమౌ గుబాళించు పూదండ వలె నుండగా ప్రకటనా విధానము 'మయూర నాట్యమువలె ఉండాలి.

పద్య కృతుల నుండి ప్రభవించి నట్టివే
వచన కవన గేయ రచన లెల్ల;
జనని లేని యెడల - సంతాన మెటు కల్గు?
గౌరవింపదగును - కన్న తల్లి.

అర్ధ శతాబ్దికి పైచిలుకు తన జీవితమును ఆంధ్ర సారస్వతమునకు అంకితం చేసుకొన్న ఆచార్య డా. నండూరి రామకృష్ణమాచార్య - తన బ్రతుకు మలిసంజ

కెంజాయలో ప్రౌఢ నిర్భరవయః పరిపాకంలో వ్రాసిన గ్రంథము. "తెలుగు పద్య శిల్పము".

ఆదికవి నన్నయభట్టునుండి నేటివరకు సుమారు పది శతాబ్దుల పైబడి తెలుగు కవులు చేసిన సాహితీ తపస్సు సాధించిన పద్య విజయ పరంపర - ఈ గ్రంథం ప్రతిష్ఠింపజేస్తుంది.

ఈ గ్రంథం - తెలుగు పద్యశిల్ప సాత్త్విక సమీక్షగా - పద్యకవులకు - విద్యార్థులకు సహృదయులకు ప్రమాణిక పరిశోధక విమర్శగా - మూడులగా ఉపక రింపగలదు. ప్రాచ్యప్రతీచీ సాహిత్యవేత్తల అభిప్రాయాలు ఇందు సాంగోపాంగంగా సమీక్షింపబడ్డాయి.

పద్యమునకు రెండు పట్టాలు - ఛందస్సు,
తారు రోడ్డు మేలు - కారు నడువ;
కడలి అవసరమ్ము గాదె - ఓడల కెల్ల
గాన మేది? తాళగతులు లేక?

ఋషితుల్యులయిన మన పూర్వకవులు నన్నయాదుల వాఙ్మయ తపః ఫలముచే తెలుగు పద్యకవిత ఎంత మహోన్నత స్థితికి చేరగలదో అంత ఉన్నత స్థితిని పొందగల్గినది. తెలుగు పద్య ప్రక్రియ - సంగీత సాహిత్యములకు నిలయమై, పవిత్ర ఛందోనియమ శోభితమై, మనోజ్ఞ మృదు మధుర శబ్దా లంకృతమై పదివందల ఏండ్లు అవిచ్ఛిన్న జీవద్వాణిగ తెలుగు హృద్య పద్య కవిత సాగుచు వచ్చినది. ఆంధ్రజాతికి యుగయుగాలుగా సంక్రమించిన సాహితీ వారసత్వం "తెలుగు పద్యం". తెలుగు వారు ఈ అమూల్య వారసత్వాన్ని వదలుకో రాదు.

సాహితీ పవిత్ర సత్ర యాగము - రండు!
సంస్కృతి ప్రియులకు స్వాగతమ్ము;
వేయి వత్సరాల తెలుగు వర్ధిలు గాత
తెలుగు పద్య శిల్ప కళకు - జయము.

# పద్మాసనం

డాక్టరు. ప్రసాదరాయ కులపతి

శ్రీ నండూరి రామకృష్ణమాచార్యులవారు నాకొక ఆంతరంగిక లేఖ వ్రాసి వారి "తెలుగు పద్య శిల్పము"నకు చిన్న పీఠిక రచన చేయమనినప్పుడు నేనొక చిత్రమైన సందిగ్ధ స్థితిలో పడవలసి వచ్చింది. ఆచార్యులవారి వంటి సుప్రతిష్ఠిత విద్వత్కవి గ్రంథానికి పీఠిక లెందుకు? ప్రాచీన మహాకవుల కావ్యాలకు వేటూరి ప్రభాకర శాస్త్రిగారు, పింగళి లక్ష్మీకాంతంగారు, మానవల్లి రామకృష్ణకవిగారు, తంజ నగరం తేవప్పెరుమాళ్ళయ్యగారు, వేంకటరాయశాస్త్రిగారు, బండారు తమ్మయ్య గారు మొదలైన దిగ్గజాలవంటి పండితులు పీఠికలు వ్యాఖ్యానాలు వ్రాసి చిర స్థాయియైన కీర్తిని గడించారు. ఆ ప్రక్రియ, ఆ ప్రణాళిక వేరు.

శ్రీ రామకృష్ణమాచార్యులవారు తెలుగు పద్య శిల్పాన్ని గురించి సమీక్ష చేస్తున్న గ్రంథ మిది. ఆ సమీక్షకు సమీక్ష చేయడ మేమిటి? నిజానికి ఆ అవసరం లేదు. వారి రచన నిశితము క్లుప్తము సుందరము. దానికి విమర్శ-వివరిస్తే ఎక్కువైతుంది. కొద్దిలో చెప్పాలంటే వారే అత్యంత క్లుప్తంగా పలికినప్పుడు అంతకంటె తక్కువలో చెప్పటానికి వీలులేదు. ఏదో లాంఛనప్రాయంగా విమర్శ చేయాలి. అది న్యాయమా!! ఆ సంగతి వారికి తెలియదా! తెలుసు. అయితే నా మీది ప్రేమచేత నా మాటలు నాలుగు వారి గ్రంథంలో ఉండాలన్న అభిమానం తప్ప వేరేమీ లేదు.

బహుకార్యవ్యగ్రుడనై విశ్రాంతి రహితస్థితిలో ఉన్న నేను ఈ అవ్యాజాభిమాన ప్రియవచస్సుకు వశుడనై ఏదో వ్రాయాలన్న ఆలోచనలో పడినాను. "ఏమి చెప్పుదు గురునాథా" ! అనే స్థితి వచ్చింది. పుస్తకం చదువుతున్నాను. సులభంగా సుబోధకంగా సూక్తి సుందరంగా సుమనోమనోహరంగా ఉన్న రచన చూచి ముగ్ధుడనైనాను. తెలుగు శిల్పంలోని తెలుగుదనం సన్నెంతో ఆకట్టుకొంది. ఒక

భావాన్ని వ్యక్తీకరించటంలో వారి శైలిలో ఒక ప్రత్యేకత ఉంది. వయసు పైనబడుతూ ముసలితనం ఆక్రమించిన వేళ అనాలనుకొండి. "బ్రదుకు మలిసంజ కెంజాయలో ఉన్నాను" అంటారు వారు. జీవిత చరమ సంధ్యావేళ అనటంకంటె అచ్చ తెలుగు పలుకుబడి ఉపయోగించటంవారి కెంతో ఇష్టం. ఉభయ కావ్య ప్రౌఢి పాటించు శిల్పమున పారగుడైన తిక్కన తీరును బహుకాలము అధ్యయనము చేసిన ఆచార్యుల వారి వాక్కునకు తెనుగు మడికారపు పెంపు సొంపులు లావణ్య లాలిత్యములు కూర్చినవి.

తెలుగు పద్యం శాశ్వతమైనదని స్థిరమైనదని వారి విశ్వాసము. పూర్వం రామాయణాన్ని గురించి చెపుతూ

శ్లో. యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే

తావద్రామాయణ కథాలోకేషు ప్రచరిష్యతి - అన్నారు. దానిని మనసులో పెట్టుకొని వారి యీ పద్యం చదవండి !

ఆ.వె. చదల యందు సూర్యచంద్రు లుండెడిదాక
ఉర్విమీద కొండ లుండు వరకు;
జగతి - వరలు దాక - శబ్దార్థ సంక్రాంతి
బ్రదికియుండు - తెలుగు పద్య కవిత.

'యావచ్చంద్ర దివాకరం' తెలుగు పద్యం, జీవించి ఉంటుందన్న దృఢమైన నమ్మకం ఈ పద్యం రూపాన్ని ధరించింది. వారికీ, నాకూ గురువర్యులైన ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు తెలుగు పద్యంలోని సొగసులు, ఛందస్సౌందర్యం వివరిస్తుంటే విని నేర్చుకొన్న నాటి విశేషాలు ఈ గ్రంథం చదువుతుంటే మరో రూపంలో స్ఫురిత స్ఫురణములై పూర్వస్మృతులుగా మనోయవనిక పైన నాట్య మాడినవి.

ఈ గ్రంథంలో మరొక గొప్ప విషయం రచయిత చెప్పారు. లోకంలో సామాన్యంగా పద్యమంటే ప్రాచీన పండితులు వ్రాసేది. అదేదో ప్రబంధాల పురాణాల భాష, విషయం కూడా అటువంటిదే - అనే అపప్రథను తార్కికంగా సోదాహరణంగా ఖండించారు. అటువంటి పరిస్థితి కొంత ఏర్పడి ఉన్న మాట నిజమే. పద్యకవులు ఏ ప్రాచీన విషయాన్నో తీసుకొని ఛందస్సులో చదవటం దీనిని ప్రజలు ఆదరించకపోవటం జరుగుతున్నది. అందులో రెండు లోపాలు- ఒకటి అప్పటికప్పుడు వర్తిస్తున్న సామజిక విషయాలు తీసుకోకపోవడం, రెండు - భాష సులభంగా సరళంగ లేకపోవటం.

నండూరివారు ఇటీవల విజయవాడలో జరిగిన "పద్య కవితా" సదస్సులో సమకాలీన ప్రజా సమస్యల పట్ల పద్యం ఏ విధంగా స్పందించగలదో నిరూపించారు. సామ్యవాద ప్రవక్త మార్క్సు పైన, కమ్యూనిస్టు మేనిఫెస్టో పైన ఉదయించిన చక్కని పద్యాలను వారుదాహరించారు. సంప్రదాయ వ్యతిరేకులైన శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరి, శ్రీ కొండవీటి వేంకట కవి వంటివారు పద్య కవులే అనే విషయం గమనించదగినది.

కనుక చివరకు చెప్పేది పద్య మనేది ఒక శక్తిమంతమైన భావవాహిక. దానిని ఎవరి ధోరణిలో వారు రచించవచ్చు. ఎవరి మార్గంలోవారు నిర్మించవచ్చు. వెయ్యేండ్ల చరిత్ర గలిగిన తెలుగు పద్యం చావదు - శాశ్వతంగా ఉంటుంది. ఈ విషయాన్ని బహువిధాల నిరూపించటానికి ప్రయత్నించి సఫలీకృతులైనారు శ్రీ రామకృష్ణమాచార్యులవారు.

ఇక ముగింపుగా ఒక మాట. పెద్దన మహాకవి మాలిక తరువాత కవిత్వాన్ని గురించి చెప్పిన మాలికలలో నాకు నచ్చింది కరుణశ్రీ గారి మాలిక. ఇప్పుడు నండూరి వారి మాలిక. మూడు ఉత్పల మాలలు కావటమే విశేషము. తిరుపతి వేంకట కవులు ఒక ఉత్పలమాల చెప్పారు గాని దాని లక్షణము పరిధి వేరు.

అందమైన కవిత్వాన్ని సృష్టించటం మాత్రమేకాక ఆ అందం ఎలా ఉంటుదో చూపించిన, నిర్వచించిన సాహిత్యశిల్పి శ్రీ రామకృష్ణమాచార్యులవారు, వారికి హృదయ పూర్వకంగా అయిదు పది చేస్తున్నాను.

# అంకితం

## సుజల – నంది పైపుల పరిశ్రమాధినేత

### యస్. పి. వై. రెడ్డి = శ్రీ వన్నపురెడ్డి పెద ఎరుకల రెడ్డి B.E గారికి

సర్వ మంగళ "పార్వతి" సతిగ కొలువ
సుజల 'అరవింద రాణి' దిగ్విజయ లతలు
సుతలు – వాశా వియత్తరి శోభిలంగ
వెలుగు నెరుకల రెడ్డి – మంగళ మహాస్తు.

నంది పైపుల దొర – రసానంద మధుర
మృదుల మందార చారు పరిమళాత్త
లలిత కలధౌత కీర్తి విరాజమాన
వీర శృంగార సాహిత్య విజయ సోమ.

అభినవ కృష్ణరాయ బిరుదమ్మది కమ్మగ మమ్మనన్ యశో
విభవ తరంగ డోలికల – వేమరు, తూగిన ఆంధ్ర సాహితీ
ప్రభ, వినువీథి కెత్తబడి రంగుల హంగు కురంగరించె – సౌ
రభములు చిమ్మి – నవ్య రస రాజ్య రమా హృదయాంగణమ్మునన్.

'తెలుగు పద్య శిల్ప' కవితా విలసనములు
తెలుగు పద్య శిల్ప మహల్ కల రవములు
తెలుగు పద్య శిల్ప కళావతీ రుతములు
తెలుగు పద్య శిల్ప నవతా ప్రదీప్త శిఖలు

శారదా కచ్ఛపీ శుభ స్పందనమున
కళలు చిలికించి హాయలంత నొలుక బోసి
మిమ్ము పరవశమ్మున ముంచి మిసిమి మీరి
కమ్మ దనములు జగతిపై జిమ్ము గాక !

"తెలుగు పద్య శిల్ప" ఘనతా కలిత లలిత
క్రమ కవితా విలాసిని కళల సొగసు
మిము వరించెను - పతిగ, భావనల మురిసి
కొండు - నేరుకొండిక ప్రేమ - గుండె గుడిని.

విరుల పరిమళాల రస వీచుల రోచులు - మీ సుగంధ సుం
దర మకరంద బంధుర సుధా హిమచందన వాగ్విభూతి మం
జరులు, నిమ్ము, కొమ్ము - సరసాంధ్ర కవిత్వ సుశిల్ప రాజ్ఞి - వో
ఎరుకల రెడ్డి రాణ్మణి - జయీభవ - మీ విమల ప్రశస్తికిన్.

పెద్ద ఎరుకల రెడ్డి గంభీరతలును
సిరుల ఝరులును కీర్తిపందిరుల పొగవు
త్యాగ విస్తార భోగ నిస్తంద్ర రుచులు
ఆయు రైశ్వర్య రాగ సౌఖ్యములు వెలిగి
పరిఢవిలు గాక కకుబంత పరిధి దాక.

ఆ మహోదారు హృదయ సౌహార్దతలకు
అంజలి ఘటించు గాక నవ్యాంధ్ర జగతి;
ఆ మహోదాత యౌదార్య హైమ శిఖర
ముఖరిత మగుత కవితా ప్రమోద భేరి.

నంది మండల శ్రీ మహానంది శివుడు,
త్రిపుర సుందరి - కరుణా మరీచి వీచి;
రెడ్డిగారి కుటుంబమ్ము, రెడ్డిగారి,
వాంతరంగికులను, బ్రోతు రభయ ముద్ర.

రాజిత శైలరాజ శిఖరాంచల చంచల హేమ రత్న వి
భ్రాజిత వేదికోపరి విలాస విలక్షణ లాస్యరక్తి నీ
రాజిత పాద పంకజ విరాజిత శాంకరి రెడ్డి రాట్సము
త్తేజము బ్రోచుగాక - నలుదిక్కుల భేరులు మారుమ్రోయగన్.

తరళ మురళీ స్వరాళి సంధ్యా సరాగ
ముగ్ధ బృందావనీ కళా స్నిగ్ధ మధుర
లలిత సికతా విహార విరాజ మాన
చారు శృంగార రాధా సుధాధరమ్ము
గ్రోలు - వెమలీక అయ్యా, తా బ్రోచు గాక.

## కృతి ప్రశంస

కవి : కలుగోట్ల విజయాత్రేయ

తెలుగు రసార్ణవమ్ము చిటి తేనెల నింపిన, "పద్య శిల్ప" మం
గళ మధుమాస లక్ష్మి మణి కంకణ ఝూంకృతి - హేమ నూపు రో
చ్ఛల కలనాద మాధురి - ప్రసన్న మనోహర పారిజాత కో
మల వన సౌరభమ్ము, ఉపమానము లేనివి - ముజ్జగమ్ములన్.

# గురుదక్షిణ

శ్రీ శనగన నరసింహస్వామి

ఘననందూర్యన్వయఖని
మణి వేంకట రామ కృష్ణమాచార్యు యశో
ధని తారాతోరణకృతి
వినిబంధనచణుని గొల్తు - విద్యాగురువున్.

ఎవ్వాని నామంబు హృది తళ్కుమనినంత
కందోయి మోదవాకణము లురలు-
ఎవ్వాని విగ్రహం బెదుట నిల్చిన యంత
నిలువెల్ల నీపమై పులకరించు-
ఎవ్వాని చిఱునవ్వు నీక్షించినంతనే
చింతాపయోదాళి చెదిరిపోవు
ఎవ్వాని వాగ్రసంబెసగి క్రోలిన యంత
విమలామృతంబును వెగటుగొలుపు-

అమ్మ విధాన మమ్ము మధురాదర వైఖరి జూచు మా సుభ
ద్రమ్మను సంతతాతిథి సమర్చన కాశిక అన్నపూర్ణనే
పొమ్మన జాలు సాధ్విని - ప్రభూతపుభక్తి నమస్కరింతు డెం
దమ్మున దేశికాంగనను వందురి వంశ వధూజనోత్తమన్.

పాయక మీ పదాబ్జముల పాంసువులన్ తల దాల్చుకొంచు నే
హాయిగ తొల్లి భీమవర మందు పఠించిన నాలుగేండ్లు - నా
కాయము నాటుకొన్న పులకంబులు మాటికి సాటి లేని పా
థేయము లౌచు - నా బ్రదుకు దీర్చెడి నేడును దేశికాగ్రణీ!

నటులో పాటకులో కవిత్వపటులో నాట్యజ్ఞులో సాహితీ
వటులో శిష్యులో విందులై బహుకళాపారమ్యలీలాసము
త్కటగోష్ఠీగతి వెళ్లబుత్తు రెపుడున్ కాలమ్ము నీ యింట నీ
వెటనుందో యట శారదా చరణమంజీరైకశింజాగతుల్.

సవినయమూర్తులై కవులు ఛాత్రులు వెంబడి నేగుదేరగా
నివుటులు గప్పునిప్పన – తృణీకృత బ్రహ్మపురందరుండవై
నవనవమైన ఠీవిని చనంగని – పౌరులు పెద్దనాది స
త్కవులు తలంపులన్ నిలువగా పులకించుట నే నెఱుంగుదున్.

సాగుచున్నదె నిత్యసాహితీసత్రమ్ము
కమ్మగా ప్రత్యవాయమ్ము లేక?
వచ్చుచున్నారె మీ వసథాంగణమునకు
దినదినమ్మును కళాతిథులు నేడు?

వెలగన్ బూర్వము పింగళీంద్రుడగు లక్ష్మీకాంత మాచార్యుచే
తెలుగుంబీఠిక పూర్వ గర్వసుయశోదీప్తిచ్ఛటల్ మీద – నీ
వలనన్ మీరె ప్రతిష్ఠనైకరచనావ్యాసంగి! నిక్కమ్ము నీ
పలుకుల్ సాక్షులు వేనవేలు గల రే ప్రాంతమ్ములో జూచినన్.

ఆ.
మౌళి పై కేలుదోయిని గీలుకొలిపి
దలతు నందూరి వంశసుధాపయోధి
పార్వణేందుని దేశికపాదు రామ
కృష్ణమాచార్యు నిస్తులకీర్తిధుర్యు.

# "కవిత – ఉత్పల మాలిక"

క్రొన్నన లావి – తెమ్మెరలకున్ గిలిగింతలు పెట్టి నట్లు; లే
వెన్నెల నింగి గంగ పృథివిన్ పడి నట్టులు; యుద్ధభూమిలో
వెన్నుని గీత బోధ – వినిపించిన యట్టులు; గండు కోకిలల్
గున్న రసాల మెక్కి కుహూ కూ రవముల్ పచరించినట్లు; పూ
గిన్నెల తేనె సోన – పులకించిన తుమ్మెద – గ్రోలినట్లుగన్
చిన్ని గులాబి లేవలపు చెక్కిలి – బాల మరీచి మాలి కన్
సన్నల రక్తితో – తొలి ఉషస్సుల స్వాగత మిచ్చి నట్లు; ప్రా
పన్నుడు భక్తితో పరమ భాగవతోత్తము డాసినట్లుగన్;
ప్రన్నని సన్న సామెత ప్రపంచ ప్రదక్షిణ చేసి, పేర్మిమై
అన్నన గుండె అందనుభవాకృతి తాల్చిన యట్లు; తమ్మిపూల్
కన్నెలు, ఏటి గట్ల జలకమ్ములు తేలిన యట్లు; ప్రేయసీ
సన్నిధి – గుండె – తాండవము సల్పిన యట్టులు; జాజి మొగ్గ వాల్
గన్నుల సిగ్గు దొంతరలు క్రాలి – సుగంధము చిమ్మినట్లుగన్
పున్నమరేయి చందురుడు పొంగులు వారెడు పాలవెల్లిపై
వెన్నెల ఆరబోసినటు; వేణు గసుమ్మ స్రవించినట్లుగన్;
ఉన్నత మానసాంబు చల దూర్ముల హంసలు ఈదినట్లుగన్,
పన్నగ భామినీ మణులు కింపురుషుల్ – హిమ పన్నగంబుపై
మిన్నులు పడ్డ చోటులు గమించి – విహారము సల్పినట్లు; తా
కన్న కుమారు తల్లి బిగి కౌగిలికిన్ కయిసేసి – ప్రేమతో
చన్నులు చేపినట్టులు; ప్రసన్న జగత్ ప్రతిబింబ దర్శినీ
సన్నిభ దర్పణంబుల సాహితి పెంపెసలార; అభ్ర వి
ద్యున్నిభ భావవీచికలతో రుచిరంబుగ పాల్చి వాల్కపై
వెన్న కరంగునట్టుల – కవిత్వము చెప్ప – మనోహరంబుగన్.

# కవితా ప్రభాస

అరయ - కవిత వలన - యశము - కాంచగ వచ్చు
పదవి - ధనము గూడ పడయ వచ్చు;
వెల్లివిరియ వచ్చు - విశ్వ కల్యాణమ్ము;
అభ్యుదయము లెన్నొ అమర వచ్చు.

క్షణములోన పొంది - సర్వః పర నివృత్తి
బొందె తోడ - ముక్తి పొంద వచ్చు
అంతరంగ మందు - అమృతమ్ము కురిపించి
పొనగ వచ్చు - కవిత - రస సమాధి.

ముసలితనము రాక ముందె - పెద్దరికమ్ము
పడయవచ్చు - కవిత వలన - జనులు;
బధిర సంఘమునకు - బహిరంతరాత్మలై
కదల గలరు - కవులు - మెరల గలరు.

అరయ మానవుండు - ఆలోచనా శీలి
మెదడు హృదయ మున్న మేటి జీవి;
మానవతకు - కవిత - మరి పరాకాష్ఠయే;
కవిత - రాచరికమ్ము కన్న - మిన్న.

నరుని పరిధి దాటి - పరిణామ సృష్టిలో
ఎడద - మెదడు కలిపి - ఎదుగు గాత!
అధిగమించి - నరుడు - అధిమానవుడుగా
అందుకొనుత - క్రొత్త ఆకసములు.

కాంతి చిలికి - కవిత - అంతర స్నానమ్ము
కూర్చగలదు - మనుజు గుండె లోన;
అమృత మొలికి - భావితాంతఃకరణ గూర్చి;
చేయు - కవిత - మానసిక చికిత్స.

నిజము – కవిత – నిభృత నిశ్శబ్ద సంగీతి;
మాట పరిధి దాటు; మధురిమమ్ము
చిత్తమందు రేగు – క్షీరాబ్ధి మథనమ్ము
దిశలు దాటి పోవు దివ్యదృష్టి.

మనసుతోడ చేయు పని మాత్రమే గదా!
కవిత – మేటి – లలిత కళల యందు
కోర దులిని గాని – కుంచె రంగులు గాని
గాత్ర జంత్ర వాద్య ఘటన గాని.

మేలి ముసుగు – కాంత – మేని సౌందర్యమ్ము
వెల్లడించు దాచివేయకుండ;
ఛంద మందు – కవిత – అందాలు చందాలు
కానుపించుచుండు – కప్పబడక.

పాల-నీళ్ల కలువ – పలుచనై రుచి తగ్గు
మీగడయగు మించి కాగి; కాగి;
మట్టసముగ – కవిత – మదియించి కుదియించి
శిల్ప సుందరముగ చెక్కవలెను.

అడ్డ వలలు – గీత లాటలందున ఉండు
నేర్పు పెరుగు – నియమ నిష్ఠతోడ
యతులు ప్రాసగతులు – ప్రతిబంధకములు గావు
ప్రతిభ యున్న పద్య రచన యందు.

మేటి మాట కూర్పు – మిరుమిట్లు వెదచల్లి
విశ్వ మెల్ల తావి వెల్లి గొలిపి;
గ్రుచ్చుకొనును – కవిత – గుండెలో మూటిగా
తెమ్మెరపాది పూవుటమ్ము వోలె.

# శీర్ణమేఖల

నండూరి రామ కృష్ణమాచార్య

ఈ నడి రేయిలో – ఇభపురేశ్వరు అంతిపురాన, హర్మ్య సో
పాన పరంపరాగ్రముల పైన కెకాయెకి ఎక్కు ఎవ్వ డీ
మానిసి? రాణి భానుమతి మందిర రత్న కవాట కాంతిలో
అవనసీమ వెల్గెడిని! అంగధరేశుడు సూతసూనుడే !!

అనుగు సఖుని దుర్యోధను నరయు కొరకు
పవలు రే అనక అతడు వచ్చుచుండు;
కంటికిని కూర్కు లేకుండ కాచుచున్న
ద్వారపాలకు లెవ రాప నేర రతని.

అంత కవాటముఁ దెరచి ఆతడు లోనికి ఏగినంత, ఏ
కాంత వినోద కేళి, చెలికత్తెను గూడి, సుయోధన క్ష్మా
కాంతుని కాంత, హైమ మణి కల్పిత సుందర తల్ప మందు, అ
త్యంత వివేశ నిష్ఠ – చదరంగము నాడుచు నుండె సమ్మొయిఁ.

వెలుగు నీడల గళ్లలో వెలసి; మణి మ
యోభయ తురగ గజ భట వ్యూహరచన;
రత్న దీపాంకురప్రభా రాగ పంక్తి
మెరయుచుండె – కన్నుల మిరుమిట్లు గొలిపి.

అంగధరాతలేశ్వరుని ఆగమనమ్మును గాంచి, వారలున్
చెంగున తల్పసీమ డిగి చెంతను నిల్చిరి; సూతసూనుఁడున్
బంగరు పీఠిపై వాడలు వ్రాలిచి మెల్లగ విశ్రమించె; ఆ
అంగనలున్ తమిన్ తిరిగి ఆటకు చేరిరి తోడు తోడుఁ తన్.

"ఎచ్చట కేగినాడు ధరణీశ్వరు" డంచు వతండు దేవిఁ కే
నెచ్చెలి కోసమై అడిగె, నెమ్మదిగా మరుబల్కె నామెం యున్;
"చెచ్చెర వత్తు నంచు చనె శీఘ్రముగా నెటొ, పొదచా రియై;
వచ్చుచునుండు నంచు మది భావన చేసెద నే ప్రతీక్షమై."

"పోయెద నంచు" పల్కి చనబోయెను పీఠము నుండిఁ లేచి రా
ధేయుడు; దేవి భానుమతి తెల్పెను "వచ్చెడి వేళ యయ్యె, ఈ
రేయి భవత్సఖుండు నిదురింపరు మీ గమనమ్ము విన్నచో
పోయిన దేమి? ఆగుడు ప్రభుం డిదె వచ్చుచునుండు వ్రేల్మిడిన్."

అని బదులాడి దేవి చదరంగము నాడుట కుద్యమించి వే
ర్పున చెలి ఆట కట్టుటకు పూనిన యంతట కర్ణు, డల్లి వ
ల్లిన సఖి వైపు చేరి- పదిలంబుగ రాజును గాచి - దేవి ఆ
టనె కదిలించివైచెను హుటాహుటి వారణవారణమ్మునన్.

కర్ణు డంతట ఆ చెలికత్తె స్థాన
మాక్రమించి తల్పమ్ము పై నధివసించె;
ఊడిగంపు చెలియ - ప్రక్క కొదిగి నిలువ
ఎత్తు పై ఎత్తు ఆట - సాగించి రంత.

ఎంతటి మాట! హస్తినగరేశ్వరు పట్టపు రాణి యట్టు లే
కాంత గృహమ్ములోన - నిజకాంతుడు లేని నిశీధి, ఏక శ
య్యాంతరవర్తియై తమిని అన్యునితో చదరంగ మాడు నా
వింతను తొంగిచూచె వినువీథిని తారలు ఫుల్కరించుచున్.

కౌరవ చక్రవర్తి తన కర్ణుడు ప్రాణ సమాను డంచు శృం
గార గృహమ్ములో చనువుగా ప్రియమార ప్రవేశ మిచ్చి ఇం
పారగ గౌరవింప మరియాద గణింపక - రాజరాజు దే
వేరిని గూడి ఆడు నృపవేశ్మము నందున సాహసమ్ముతో!

అది - చదరంగ మందు గల అద్భుత తన్మయశక్తి - ఎప్పుడున్
మెదడు తదేక నిష్ఠమెయి నిల్పగజేయును; హస్తి యుగ్మమున్
కదిపి హుటాహుటిన్ మెరసి - కౌరవ రాజ్ఞి బలమ్ము చీల్చి - అ
భ్యుదయము చెంది గర్వభరితోక్తుల నెమ్మది సంభ్రమింపగన్.

"త్రోసిరాజా! లే కుయ్యాల త్రోసిరాజా!!
కోరుకొను మం"చు కర్ణుడు - గ్రుచ్చి గ్రుచ్చి
పౌరవేశ్వరు రాణిని ప్రశ్న వేయు
చుండ, మెల్లెక్కుచుండె - దుర్యోధనుండు.

ద్వారము వెన్కనుండి; మద వారణ యాన మనోజ్ఞ మంద గం
భీర విధాన, మేడ పయి మెట్లను ఎక్కుచు వచ్చుచున్న - ఆ
కౌరవనాథు భానుమతి గాంచి, తటాలున ఆట వీడి, బం
గారపు పట్టు పాన్పు దిగ - కర్ణుడు కొంగును బట్టె నిల్పగన్.

క్వణదణు కింకిణీ కలిత కాంచన మేఖలయై, ఝళంఝళ
న్మణిమయ - శింజినీ ధ్వనుల మార్మొగమై విదలించె ఆమె కొం
గును; అపరంజి కాంచి తెగి కూలెను కర్ణుని హస్త వేగ చా .
రణమున, హేమ రత్న మణీ రంజిత కోమల కుట్టిమమ్మునన్.

కట్టెదుటను నున్న కౌరవాధీశుని
ప్రాణమిత్రుని మోము నరయ లేక !
హైమ కాంచిని వీడి అందందు పడిపోయి
చెదిరిన మణు లేర చేయి రాక!
స్తంభించి నిలిచిన సతి - కురు పట్టమ
హిషి అవస్థ మది నూహింప లేక!
ఏమి యెరుగకయె ఇంతలు సలిపిన
తన్ను గూర్చి తన కర్థమ్ము గాక!

కనక తల్పము జారిన - కర్ణ హృదయ
మందు - విద్యుల్లతారోచి - అశనిపాత
మగ్ని పర్వతజృంభణ - మబ్ధిఘోష
ధరణి కంపమ్ము - లేకమై తాండవించె.

మంద మనోజ్ఞ హాస సుషమా మృదు భావ మరీచి వీచికల్
కందుద లందు వెల్లిగొన కౌరవనాథుడు ఆత్మదేవికిన్ -
చిందిన మేఖలా మణుల చెచ్చెర నేరి యొసంగి "ఆగ్రహం
బందిరొ! రాణివారు! క్షమ కర్హుడు నా ప్రియమిత్రు డిమ్మెయిన్.

ఎరిగి చేసిన తప్పు గా దెంత వారి
కైన క్రమ్మును చదరంగ మందు మత్తు!
ఎప్పటి యటుల కర్ణు మన్నింపు" మనుచు
ప్రార్థనలు సలిపె ఛలోక్తి పరిభవింప.

అనునయ మొంది రాణి అధరాంచల మందలి లేత నవ్వు వె
ల్గను మృదులాంగుళీగ్రసిత కోమల పక్ష్మము లం దణంచి యూ
ర్చెను; కురుచక్రవర్తి తన స్నేహితు జేకొని మేడ మీదికిన్
జనె; నును సోగ వెన్నెలల చల్వలు గ్రమ్మె ధరాతలమ్మునన్.

వెన్నెలల కంటె చల్లని వెలుగు వెల్లి
విరియు సుకుమార హృదయ పవిత్ర మైత్రి.
ఎల్ల లోకాలలో - ప్రసరింపసాగె
అమృత రోచు లాచంద్ర తారార్క మౌచు.

# తెలుగు పద్య శిల్ప సౌష్ఠవం

తెలుగు పద్యం - సద్యోయౌవనంతో, సాహితీ కవచ కుండలాలు అనదగిన యతిప్రాసలతో - వేయి సంవత్సరాల ముందు అవతరించింది. ఆదికవి నన్నయ కాలంనాటికే స్థిరరూపం ధరించింది. అంతకు ముందే కన్నడభాషలో తెలుగు వాడైన పంపకవి భారతం వ్రాశాడు. కన్నడ భాషలో పద్యకవితకు "ప్రాస" నియతి ఉన్నది గాని 'యతి' నియతి లేదు. "కన్నడమునకు యతిలేదు, కోణంగికి మతి లేదు" అనే సామెత సుప్రసిద్ధం. ప్రాచీన తమిళ వాఙ్మయంలో యతి ప్రాసలు ఆధునిక కవులు ఉజ్జగించారు. కందం సీసం ఉత్పలమాల మున్నగు పద్యాలు ప్రాచీన కన్నడ సారస్వతంలో ఉన్నాయిగాని నేటి కవులు ఆ ఛందస్సులను విడనాడారు. సంస్కృత శ్లోకాలలో 'యతి ప్రాసలు' లేవు. సంస్కృతంలో యతి-విరతి-విశ్రాంతి మాత్రమే. వర్ణ సాజాత్య పూర్వకమైన 'తెలుగు యతి' దేశ భాషలలో విలక్షణమైనది. నేటికీ తెలుగు కవులు యతి ప్రాసలతో కూడిన ఉత్పలమాలాది వృత్తాలు కందం-సీసం - ఆటవెలది మొదలైన పద్యాలు వ్రాస్తున్నారు గదా. తెలుగు పద్యానికి వేయేండ్లు పైబడిన గొప్ప పునాది ఉంది. సంస్కృతంలో గాని - హిందీలో గాని - మరి యే ఇతర దేశభాషలలో గాని-ఆ మాటకు వస్తే యావత్ ప్రపంచంలో - ఏ భాషలోగాని ఛందస్సులో తెలుగుపద్యంలోని తూగు ఊపులో సరిపోల్చ తగిన శిల్పసౌష్ఠవం లేదు.

యతులు - ప్రాసగతులు - యమకమ్ము గమకమ్ము
అల్లిక జిగి బిగులు - వెల్లివిరియ;
మధుర కవనమునకు - మార్దంగ లయ - గూర్చు
నాదబిందుకళలు నాట్యమాడ.

ప్రపంచ భాషలలో - సర్వత్ర - ఛందోబద్ధమైన కవితలు ఉన్నాయి గాని అన్నింటినీ మించి తెలుగు పద్యం సులువుగా కంఠస్థమౌతుంది.

తాళబద్ధమైన - లాలిత్య గతిగల్గి,
నడక సొంపులొలుకు - నాట్యమౌను;
శ్రవణ సుభగమైన - ఛందోనియతి గల్గి,
పలుకు బడుల కూర్పు పద్య మగును.

నన్నయ మహాకవి - పరిభాషలో "అక్షర రమ్యత" - తెలుగు పద్య శిల్ప సౌష్ఠవంలో అంతర్వాహిని. నాద ప్రతీక అయిన అక్షర రమ్యత - అర్థానికి అతీతం. గంగానది - మహిళా రూపం ధరించినట్లుగా నన్నయ చేసిన వర్ణన ఉదాహరణీయం -

గంగ నిజాంగ దీప్తు లెసగం జనుదించి - లతాంగి - సంగతో
త్తుంగ పయోధర ద్వితయ తోయరు హానన - చారునేత్ర - ది
వ్యాంగనయై - ప్రతీప వసుధాధిపు శాల విశాల దక్షిణో
త్సంగమునందు - మన్మథ వశంబున నుండె - కరంబు లీలతో.

అనుశీలించవచ్చు ఈ పద్యంలోని బిందుపూర్వక గకార ప్రాస ప్రయోగ పౌనఃపున్యం. యతులు అక్షర రమ్యత. మాటలలో చెప్పలేని భావాన్ని మాటలలో చెప్పటమే కవితా కళలోని విచిత్ర విరోధాభాసం ! ఆ అనిర్వచనీయ సుకుమార సుందర కర్తవ్యం నిర్వహించే శక్తి యుక్తులు తెలుగు ఛందస్సుకు - యతిప్రాసలకు నైసర్గికం. తెలుగు పద్య కవితలలో తరచు యతి ప్రాసలకు "అనుప్రాసలు" తోడు పడడం కద్దు - అగ్నికి వాయువు సాయమైనట్లు ! ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టంలో నన్నయ భీముని నోట పలికించిన పద్యం

కురువృద్ధుల్ గురువృద్ధ బాంధవు లనేకుల్ సూచుచుండన్ మదో
ద్ధురుడై ద్రౌపది నిట్లు చేసిన ఖలున్ దుశ్శాసనున్ లోక భీ
కర లీలన్ వధియించి తద్విపుల వక్షశ్శైల రక్తౌఘ ని
ర్ఝర ముర్వీపతి చూచుచుండ అని నాస్వాదింతు ఉగ్రాకృతిన్.

ఈ పద్యంలోని యతి ప్రాసలతోపాటు - ద్విరుక్తధకార ప్రయోగ పౌనః పున్యం దంత్యాక్షర విన్యాసం - అలనాటి సభలో భీముని రౌద్రాకృతిని మాత్రమే గాక ఆతని ఆమ్రేడిత గదా దండ ప్రహరణాలు - ఆతని దంతాల పటపటలు స్వయం వ్యక్తం చేస్తున్నవి. నన్నయ నాటి నుండి నేటి వరకు తెలుగు కవులు ఈ నాదబిందు కళోపాసన చేస్తూనే ఉన్నారు.

"పోతన మహాకవి ఘంటంలో తెలుగు పద్య సౌష్ఠవం చిందులు త్రొక్కింది. ఉదాహరణకు - బలి చక్రవర్తికి అందించిన ఆశీర్వచన పద్యం.

స్వస్తి జగత్త్రయీ భువన శాసన కర్తకు - హాసమాత్ర వి
ధ్వస్త నిలింప భర్తకు - ఉదారపద వ్యవహర్తకున్ - మునీం
ద్రస్తుత మంగళాధ్వర విధాన విహర్తకు - నిర్జరీ గళ
న్యస్త సువర్ణసూత్ర పరిహర్తకు - దానవలోక భర్తకున్.

- అల్లసాని పెద్దన - హిమవత్ పర్వత వర్ణన ఇంకో ఉదాహరణ.

అటఁజని కాంచె భూమిసురు డంబర చుంబి శిరస్సరజ్ఝరీ
పటలముహుర్ముహుర్లుట దభంగ తరంగ మృదంగ నిస్స్వన
స్ఫుట నటనానుకూల పరిపుల్లకలాపకలాపి జాలమున్
కటక చరత్ కరేణు కరకంపిత సాలము శీత శైలమున్.

ప్రాచీన కవులు మాత్రమేగాక అర్వాచీన కవులు - వేమన వంటివారు తెలుగు పద్య శిల్ప సౌష్ఠవమునకు దోహదం కల్పించారు. వేమన యతిప్రాసలతో పాటు - వర్ణ సాజాత్యనాద విన్యాసంలో పాటు - సంస్కృత యతిని గూడ పాటించాడు. వేమన యతిలో వర్ణసాజాత్యంలో విశ్రాంతి సంగమించింది. తరచు గణములు గూడ పృథక్పృథక్కరణ విశిష్టాలు. కంచు మ్రోగునట్లు - కనకంబు మ్రోగునా? వంటివి.

తెలుగు పద్య సౌష్ఠవానికి - ఆధునికులు కల్పించిన ఉద్దీపన ఉగ్గడింప దగినట్టిది. తిరుపతి వేంకటేశ్వరులు, పింగళి కాటూరులు విశ్వనాథ - భావకవులు - అష్టావధాన శతావధానులు తెలుగు యతిప్రాసలు దిగ్దిగంతాలలో మారు మ్రోగేటట్లు చేశారు. జాషువా - దువ్వూరి రామిరెడ్డి ప్రభృతులే గాక సంస్కార ప్రియులైన వీరేశలింగం గారూ త్రిపురనేని రామస్వామి గారూ యతిప్రాసలతో గూడిన తెలుగు పద్య సౌష్ఠవాన్ని ఆరాధించినవారే.

జొన్న చేని కాడ - చిన్నదానిని చూడ
నిన్న టేలనుండి నిదుర లేదు;
దాని నన్ను గూర్చి దయసేయు మాధవా !
పొన్నపూల నిన్ను పూజ సేతు.

అన్న అజ్ఞాత కవి - ఎవ్వరోగాని-ఆ పద్యంలోని శిల్ప సౌష్ఠవం సుస్పష్టం. సరే కావ్యములలో రసస్థాయిని అందుకోవాలనుకున్న పద్యం మాట అటుంచి ఆటయాదృచ్ఛిక ఝటితి స్ఫూర్తి వెలార్చే పద్యం ఉదాహరణీయం

టీ జనితేన్స్పిరేషను పటిష్ఠ మహీయ గవాయి గాన వి
ద్యాజిత పీరుసాబు - నయనాంచిత గోల్డెను స్పెక్టికల్ ద్వయీ
భ్రాజిత డాబు - బూతుం షరాబు - కవిత్వ ఖరాబు - నాట్యపుం
బోజులలో నవాబు - సొగపూతల మింటి గిలాబు - బాబయా.

ఈ పద్యంలోని యతిప్రాసలు - అనుప్రాసలలో వేయేండ్ల తెలుగు పద్య శిల్పవారసత్వ పరిణామ రమణీయత నిక్షిప్తమై ఉంది.

వ్రాయకున్న - కంద పద్యమ్ము - కవి కాడు,
ఆంధ్రజాతి సొత్తు - ఆట వెలది;
వృత్త రచన - కవుల సత్తాకు నికషమ్ము,
ఛందమునకు - జీవశక్తి - కలదు.

ఆంధ్రదేశంలో ప్రజల హృదయాలను ఉఱ్ఱూతలూగించే రంగస్థల నాటక పద్యాలకు ఆశక్తి - ఛందస్సుయతిప్రాసలు ప్రసాదించినట్టిదే. చదువురానివారు గూడ - మారుమూల పల్లెటూళ్లలో గూడ రంగస్థల నాటకపద్యాలు పాడేవారు కోకొల్లలు.

ఇక - కవిత్వానికి యతిప్రాసలు అనవసరం - ఛందస్సు అసలే అనవసరం అనేవారు ఉన్నారు. 'కావ్యాలాపాంశ్చ వర్జయేత్' అనేవారు కూడా ఉన్నారు. అది విషయాంతరం.

"ఛందోహీనో న శబ్దోఽస్తి - నచ్ఛందశ్శబ్ద వర్జితమ్"

ఛందస్సులేని శబ్దం లేదు. శబ్ద వర్జితమైన ఛందస్సు లేదు అని భరతముని ప్రవచనం. సామెతలలో ప్రౌఢ నిర్భర భావ విస్ఫూర్తిలో ఏ భాషలో అయినా అనియత యతి ప్రాసలు నైసర్గికంగా ఉంటాయి. ఉదాహరణకు తెలుగు సామెతలు. సామెతలకు భాష ఒక రెక్క. భావం రెండవ రెక్క. ప్రాణం అనుభూతి.

"అండ ఉంటే కొండ దాటవచ్చు" - "అందితే సిగ అందకపోతే కాళ్ళు? అద్దాలలో బిడ్డలు గాని గడ్డాలు మీసాలు మొలిచాక బిడ్డలా? మా తాతలు నేతులు త్రాగారు మా మూతులు వాసన చూడండి" - యతిప్రాసలు లేని సామెత ఏ భాషలోనూ ఉండదు. యతిప్రాసలు లేని సూక్తులు గొంగళీ పురుగులు. యతిప్రాసలు ఉన్న సామెతలు సీతాకోక చిలుకలు.

రస గుళికలు - జాతి రత్నాలు - భాషలో
యతులు గలిగి - ప్రాస గతులు గలిగి
సామెతలను పేర - జనుల గుండెల దూరు;
అనుభవమ్ము - వాని ప్రాణ నాడి.

సామెతలలో అంతర్లీనంగా మేలిముసుగులో కన్పించే యతిప్రాసలు - నియతాలై నిర్ణీత గణబద్ధములై ఛందోబద్ధ పద్యశిల్పంగా పరిణామం చెందటం వేత్తలకు అవారూఢ విషయం కాదు.

వచన కవితలలో గూడ ఎన్నో చోట్ల అనియత యతిప్రాసలు తామర తంపరగా కన్పిస్తాయి.

అరయవచ్చు - సహజ యతులు ప్రాసలు పెక్కు
వచన కవులయందు - వక్తలందు;
ధ్యాస - కానుపించు - తరచనుప్రాసపై
జయము జయము తెలుగు ఛందమునకు !

ఏ కవిత్వం అయినా పానకం అయితే - ఇక తెలుగు పద్య కవిత - పంచదార. అణురూప మధుర స్ఫటికా విన్యాస విశిష్టం.

నిరతిశయ శిల్పసౌష్ఠవ నిబిడమైన తెలుగు పద్యం అజరామరం, చిరంజీవి.

చదల మీద సూర్య చంద్రు లుండెడిదాక,
ఉర్వీమీద - కొండ లుండు వరకు;
జగతి వరలు వరకు - శబ్దార్థ సంక్రాంతి
బ్రదికి యుండు - తెలుగు పద్య కవిత.

## "పద్య కవిత – సామాజిక స్పృహ

ఆధునిక విమర్శకులు తెలుగు పద్య కవితపై మోపే నీలాపనింద ఒకటి ఉంది. "తెలుగు పద్య కవితకు సామాజిక స్పృహ లేదు" అని. పద్యకవులు "ఆకుల్ రాలని పూలు వాడని వసంతారామమధ్యమ్ములో – రాకాచంద్ర సహస్రముల్ వెలుగు హర్మ్యాగ్రాలలో" నివసిస్తారు అని – రాజులకూ ప్రభువులకూ వారు బానిసలయ్యారనీ అధిక్షేపణ. ప్రాచీనాంధ్ర కవులందరూ తాము "జగద్ధితమ్ముగా" రచన చేస్తున్నామనే వ్రాశారు. 'విశ్వశ్రేయః కావ్యమ్' అని ఉద్ఘోషించారు. నన్నయ – సంస్కృత భాషలో పుట్టి పెరిగినట్టివాడు పంచమ వేదమైన మహాభారతాన్ని తెలుగులో వ్రాయటానికి ఉద్యమించటమే ఒక ప్రగతి వాఙ్మయ యజ్ఞం. అభ్యుదయ సారస్వత సత్ర యాగం. తిక్కన – హరిహరనాథోపాసన జగద్ధిత సంకల్పమే. ఎఱ్ఱన – సమకాలీన స్వాతంత్ర్యోద్యమ ప్రవర్తకుడు. విద్యారణ్య మహర్షికి పూర్వరంగ ప్రవర్తకుడు. దేశ భక్తుడు. శ్రీనాథమహాకవి చేసిన రాజనిగర్హణ విమర్శకులు విస్మరించమన్నారు. లక్ష్మీకటాక్షవిలాససీధు మధమున మనము లోపల నున్న కానని" భూపతి లేడట !!

"ఇమ్మనుజేశ్వరాధములకు" కృతి ఇవ్వనని ప్రతిజ్ఞ చేశాడు పోతన. మంచెన కవి

బాల రసాల సాల నవపల్లవ కోమల కావ్యకన్యకన్
కూళల కిచ్చి అప్పడుపు కూడు భుజించుట కన్న సత్కవుల్
హాలికు లైన నేమి? గహనాంతర సీమల కందమూల కౌ
ద్దాలికు లైన నేమి? నిజ దార సుతోదర పోషణార్థమై అన్నాడు ఎలుగెత్తి.

సంకుసాల నృసింహ కవి – ప్రభువుల అందరిపై దుమ్మెత్తి పోశాడు. శ్రీ కృష్ణదేవరాయలకు ఆశ్రితుడయిన అల్లసానిపెద్దన కూడ మనుచరిత్రలో బాహాటంగా రాజుల బహుభార్యాత్వమును నిరసించాడు. స్వరోచి ముగ్గురు రాణులలో విహరించే సందర్భంలో హంసతో లేడి

కావున దాసీ నికరము
కైవసమై సంచరించు క్రమమున విద్యా
ప్రావీణ్య వైభవోన్నతి
చే వచ్చిన వారి వీరి చెప్పకు మింకనో అని వెక్కిరించింది.

ధూర్జటి మహాకవి చేసిన రాజనిగర్హణ విస్మరింపరానిది

రాజుల్ మత్తులు వారి సేవ నరకప్రాయంబు – వారిచ్చు అం
భోజాక్షీ చతురంతయాన తురగీభూషాదు లాత్మవ్యధా బీజంబుల్

వేమన కవిత్వం అంతా సమకాలీన సామాజిక స్పృహతో నిండి ఉంది. వేమన యథాక్షరంగా–దిగంబరకవి. అక్షరాలా అభ్యుదయకవి. అసలు కవిత్వంఅంటే ఏమిటి?

ఆమె పేరు కవిత – అతిలోక సుకుమారి,
సవతి తల్లి – జగతి – చావగొట్టు;
కారు కంటినీరు – మారు ముత్యాయిగా
కోరి ఏరుకొనని వార లెవరు?

కాంతాసమ్మితంగా – కవి – కర్తవ్య బోధ చేయాలని ఆలంకారిక నిర్దేశం.

వేడి కాదు – కవిత – విరబూచు వెన్నెలే
కవిత – వాడి పదును కత్తి కాదు.

– కర్తవ్య ప్రబోధం – కవితకు జీవనాడి

ప్రతి కవీశ్వరుండు – పైగంబరుడు సదా
ధర – నిరుక్త వక్త – ద్రష్ట – స్రష్ట;
బధిర సంఘమునకు – బహిరంతరాత్మలై
కదల గలరు – కవులు – మెదలగలరు.

ఆధునిక యుగంలో కందుకూరి వీరేశలింగంగారు తమకలాన్ని సంఘ సంస్కరణకు పదునైన కత్తిగా ప్రయోగించారు. అవినీతిపరుడైన ఒక న్యాయాధిపతి ఆయన ధాటికి తట్టుకోలేక – ఆత్మహత్య చేసుకున్నాడు !

చిలకమర్తి లక్ష్మీనరసింహ కవి వ్రాసిన ఒక తేటగీతి పద్యం – సమకాలీన స్వాతంత్ర్యోద్యమమునకు దోహదం కల్పిచింది.

"భరత ఖండమ్ము చక్కని పాడి ఆవు;
హిందువులు లేగ దూడలై యేడ్చుచుండ;
తెల్లవారను టక్కరి గొల్లవారు
పితుకుచున్నారు - మూతులు బిగియ గట్టి"

గాంధీ యుగంలో ఎందరెందరో కవులు జైళ్లకు వెళ్లారు. పలువురు పద్య కవితలు వ్రాశారు. భావకవులలో పలువురు కవుల పద్య రచనలకు "దేశభక్తి" అంతరాత్మగా భాసించింది. రాయప్రోలు సుబ్బారావుగారి రచన

ఏ దేశమేగినా ఎందు కాలిడిన - ఎవ్వ రేమనిన
పొగడరా నీ తల్లి భూమి భారతిని" ఆధునిక కవితకే పల్లవి యైనది.

గరికపాటి మల్లావధాని వంటి దేశభక్తులు కొందరు చెఱసాలలో కూడ అష్టావధానాలు చేశారు.

పురుషుల మాటకేమి పువుబోడులు సైతము అమ్మవారి జా
తరయని పోలు ఉద్యమ రథంబును లాగుట కగ్రయానలై
చెరలకు ఏగి-క్రూరతర శిక్షలకున్ గురియై మహాత్మ నా
దరమున మన్ననన్ గొనిరి - తల్లి - భవత్కృప - భారతాంబికా.

ప్రాచీన సంప్రదాయాలపై దండెత్తిన త్రిపురనేని రామస్వామి - సంప్రదాయ పద్యశిల్పంపై అధిక్షేపణకు దిగలేదు. ఆయన వ్రాసిన కవిత - తెలుగు పద్య శిల్పసౌష్ఠవ దీధితులతో - వెలుగొందుచున్నది.

మలమల మాడు పొట్ట తెగమాసిన బట్ట కలంత వెట్టగా
విలవిల యేడ్చుచున్న నిరుపేదకు -. జాలిని చూపకుండ - ఉ
త్తలపడిపోయి - జీవరహితుండగు బొమ్మకు ఇండ్లు వాకిళుల్
పొలములు పాత్ర ఇచ్చెడి - ప్రబుద్ధుల - దాతల-నిచ్చమెచ్చెదన్.

తుమ్మల సీతారామమూర్తిగారు గాంధీ మహాత్ముని ఆత్మకథ పద్యకావ్యంగా వ్రాశారు. వేదుల సత్యనారాయణ శాస్త్రిగారు

"వెలిగించు కాగడా వెలిగింపవోయి - అర్థమత్తుల కధికార దృప్తులకు
భోగదాసిగ నున్న భూదేవి కొరకు" అని వ్రాశారు. ఒక పువ్వు అనుకొంటుంది -

పేదల రక్తమాంసముల పెంపు వహించి దయా సుధా రసా
స్వాద దరిద్రులైన ధనవంతుల పెద్దరికమ్ముకై - మతో
న్మాదము పెంచు దేవునకు మారుగ నిల్చిన రాతి బొమ్మలం
దూదరవోవు పాడు బ్రదు కొక్క నిమేషము సైప నా హృదిన్.

నీచపు దాస్య వృత్తి మన నేరని శూరత - మాతృదేశ సే
వాచరణమ్మునం దసువు లర్పణ చేసిన వారి పార్థివ
శ్రీ చెలువారు చోట తదసృగ్రుచులన్ వికసించి వాసనల్
వీచుచు వాడిపోవగ వలెన్ తదురాత్త సమాధి మృత్తికన్.

దేశభక్తుల సమాధి మట్టిలో కలిసిపోవటమే ఆ పువ్వు జీవితాశయం !

సమకాలీన సమాజంలోని లోపాలను నిశితంగా విమర్శించటమే అభ్యుదయ కవిత్వం అయితే - పద్యకవితలు గూడ ఆ కోవకు చేరేవి ఎన్నో ఉన్నాయి.

"జిత్తుల మారి నక్కలును చిల్లర దైవము లడ్డగాడిదల్
నెత్తురు ద్రావు బెబ్బులులు నేతలుగా రధికార దుర్మదో
న్మత్త పిశాచ జన్ము లభిమాన దరిద్రులు లంచగొండులున్
చిత్తుగ ఓడుటెన్నడు? నశించుట ఎన్నడు భారతాంబికా" !

పద్యకవులు అందరూ సనాతన సంప్రదాయ పరాయణులైన 'శ్రోత్రియులు అనుకోరాదు. "హేతువాద నిత్య చైతన్య జగతిలో శ్రోత్రియత్వము నకు చోటు లేదు"

అని వ్రాసిన పద్య కవులు ఉన్నారు. సామ్యవాద ప్రవక్త మార్క్సు పై పద్య కవితలు వెల్లివిరిసాయి.

"మనిషి శ్రమకు - రత్నమాణిక్యముల కంటె
విలువ తెచ్చినావు విశ్వమందు !
కాలపురుష గుండె గడియారమును దిద్ది
మార్క్సు ఋషి వరేణ్య ! మార్చినావు !

కమ్యూనిష్టు మేనిఫెస్టో తెలుగు పద్యంలో అవతరించింది.

"కార్మికులు రండు - అంద రేకమ్ము గండు
ఎల్ల లెల్ల మరచి - చేరి - యేక మగుడు;
భూమిపై మీకు పోయెడి దేమి కలదు?
తుప్పు పట్టిన సంకెళ్లు తప్ప - లెండు !

ఎంతమంది చెమట - ఎందరి నెత్తురు
పిండకుండ ఎవడు పేర్చె ధనము !!
దొరలు చేసినట్టి - దోపిడీయే ఆస్తి
అంతరించవలయు ఆస్తి హక్కు - ఈ ఆట వెలది పద్యం సామ్యవాద సారసంగ్రహం.

జాషువా కవి వ్రాసిన గబ్బిలం కావ్యంలో పద్యాలలో సామాజిక స్పృహ - అగ్నిపర్వత విస్ఫులింగాలు - భూకంప ప్రకంపనాలు చిమ్ముతున్నది.

కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి కవితలలో సహస్ర సంవత్సరాల తెలుగు పద్య శిల్ప సౌష్ఠవం పరాకాష్ఠ చెందింది.

"ప్రేయసి కన్నుదోయి కనిపించెడి తీయని స్వర్గ మొక్కటే
ధ్యేయము కాదు - హీను లతి దీనులు మ్లానతనుల్ - దరిద్ర నా
రాయణు లేడ్చుచుండిరి తదశ్రువులన్ తుడువంగ బొమ్ము....

కరుణశ్రీ - సహృదయ హృదయాలను దున్ని క్రొత్త విలువలు పండించారు. పాకీపిల్లలో జగన్మాతృ స్వరూపం చూడగలిగాడు.

కుక్షిస్తంభగు కుళ్లెరుంగడు కృశాంగుం డీడ్వలేకీడ్వగా
రిక్షాపై జనుచున్న ఆ పశువు దారిన్ త్రొళ్లిపోవంచు - ని
న్నాక్షేపించును పండుకోతివలె మోమంతా కనుల్ చేసి - ఏ
మో క్షోభించును కొంప మున్గినటు లబ్బో ఎంత చిబ్బొకమో !!

దాశరథి కృష్ణమచార్య (తదుపరి ఆస్థాన కవి) చెఱసాలలో ఉన్నప్పుడు వ్రాసిన పద్యం

ప్రాణము లొడ్డి - ఘోర గహనాటవులన్ పడగొట్టి మంచి మా
గాణములన్ సృజించి - యెముకల్ మసిచేసి పొలాలు దున్ని - భో
షాణములన్ సవాబునకు స్వర్ణము నింపిన రైతుదే తెలం
గాణము రైతుదే - ముసలి నక్కకు రాచరికంబు దక్కునే.

ఈ పద్యానికి ప్రాణనాడి సామాజిక చైతన్యమే గద. సంఘానికి సాహిత్యానికి బింబప్రతిబింబ భావం ఏర్పడటం సహజం. గాంధీయుగంలోని స్వాతంత్ర్యసమరం సమకాలీన సారస్వతంలో ప్రతిఫలించింది. అల్లూరి సీతారామరాజుపై ఎన్నో కవితలు అవతరించాయి. మచ్చుకు జంధ్యాల పాపయ్యశాస్త్రి పద్యం ఒకటి

కళవళ మందె నీ మిరపకాయ టపాకు ప్రభుత్వ మిల్టరీ
దళములు నీ విజృంభణకు తల్లడిలెన్ పశు శక్తి; సర్వదా
తళతళ లాడు నీదు సుచరితమ్ములు - భారతభారతీ మహో
జ్వల మకుటాగ్ర మందు విలసద్యుతి రంజిత రత్న పుంజముల్.

ఆంధ్ర రాష్ట్రం అవతరించటానికి చాలా ఆలస్యమైంది. ఆ సందర్భంలో ఆ కవి వ్రాసినదే ఒక పద్యం.

ముంగల కానుపించి పది మూరల దూరము పోయి, అంతలో
చెంగట కేగుదెంచి చెయి చిక్కి విచిత్రముగా అదృశ్యమై
'బంగరు లేడి' వోలె కనుపట్టుచునున్నది రాష్ట్రసిద్ధి - త్రై
లింగ మహారథమ్ము కదలించుడు భారత రాజవీథులన్.

నేటి కవి ఒకరు -

"గంగ నీరు తెచ్చి కావేటిలో కల్పి
వరద బాధ తగ్గు - కరువు తగ్గు;
కలియుగాక వచ్చి కన్యాకుమారిలో
పొంగిపొరలి - బ్రహ్మపుత్ర కాల్వ"

అని జగద్ధితా కాంక్షతో వ్రాస్తే - పద్యం కాబట్టి - యతిప్రాసలున్నాయి కాబట్టి అది పాతచింతకాయపచ్చడే అవుతుందా? పాతక్రొత్తల గుర్చి కాళిదాస మహాకవి ఆవేదన సుప్రసిద్ధం.

"పాత దైన దెల్లి బంగారమా - కాదు
కొత్త దైన దెల్లి - చెత్త - కాదు
మంచి ఎచట నున్న - పొంచి గైకోవచ్చు
ప్రాజ్ఞు డైన యెడల - పండితుండు.

నవయుగ వైతాళికుడుగా అభ్యుదయవాదులు కీర్తించే గురజాడ అప్పారావు గారు కోరుకొనినది -

"కొత్తపాతల మేలి కలయిక"

వచనకవులలో కనిపించే జలపాత సదృశమైన భావయిత్రి, పద్యకవులలో కనిపించే మానస సరోవర గభీర తుల్యమైన కారయిత్రి కలుస్తే ఎంత బాగుంటుంది !

వచన కవనమునకు వ్యతిరేకమా ? కాదు,
పద్య కవిత - శిల్ప పరిధి వేరు,
నలుపదగును - కవులు - సహజీవనము - మైత్రి
పద్య గేయ వచన పథములందు.

తెలుగు పద్య కవితకు ఉజ్వల భవిష్యత్తు ఉంది. ప్రగతిశీలులై తెలుగులో నేటి పద్య కవులు ఇతోధికమైన సామాజిక స్పృహ వెల్లివిరియచేస్తున్నారు. శుభమస్తు.

కవిత - ఆంతరంగిక స్వగతం కాదు
కవిత - జగత్ కల్యాణకోసం జరిగే సారస్వత సత్రయాగం
దేశభక్తి - భౌగోళికమైన విగ్రహారాధన కాదు.
భవిష్యదాంధ్ర కవి ధ్యేయం ఏమిటి ?

ప్రపంచంలోని కవులందరి ధ్యేయం - ఒకటే. అది జగద్ధితాకాంక్ష.

"మెదడులోన మార్క్స్ - హృదిలోన బుద్ధుడై
విప్లవమ్ము - కరుణ - వింగడించి,
పుట్టుగాక - "సుకవి" - భువనైక పారుడై;
ప్రగతి కొరకు - నూత్న జగతి కొరకు."

❀❀❀

"కవులకంటె - తుహిన కర్పూర నిభకీర్తి
తెచ్చి రెవరు నీకు తెలుగు తల్లి!
సాహితీ తరంగ సంగీత రసధుని!
దేశ భాషలందు - తెలుగు లెస్స."

## కవితా నిర్వచనం

ప్రాచ్యప్రాతీచీసాహితీజగత్తులలో కావ్య మీమాంస సల్పిన పలువురు ఆలంకారికులు కావ్యతత్వాన్ని పలురీతులుగా ఉల్లేఖించారు.

కావ్య నిర్వచనాలు

కవిర్మనీషీ పరిభూః స్వయంభూః - వేదము
కవయః క్రాంత దర్శనః - సంస్కృత లోకోక్తి
నా నృషిః కురుతే కావ్యం - సనాతన సంస్కృత సూక్తి
శబ్దార్థౌ సహితౌ కావ్యం - భామహుడు
ఇష్టార్థ పదావ్యచ్ఛిన్నా వళీ కావ్యం - దండి
రీతి రాత్మా కావ్యస్య - వామనుడు
వక్రోక్తిః కావ్య జీవితం - కుంతకుడు
ధ్వనిః కావ్య జీవితం - ఆనంద వర్ధనుడు
ఔచిత్యం కావ్యస్య జీవితం - క్షేమేంద్రుడు
లోకోత్తర వర్ణనా నిపుణ కవి కర్మ కావ్యం - మమ్మటుడు
వాక్యం రసాత్మకం కావ్యం - విశ్వనాథుడు
రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం - పండితరాయలు
విశ్వశ్రేయః కావ్యం - ఆంధ్ర శబ్ద చింతామణి

వేదంలో ప్రప్రథమంగా - "కవిర్మనీషా పరిభూః స్వయంభూః"

అని కవిశబ్దం బ్రహ్మకు పర్యాయ పదంగా కనిపిస్తుంది.

పిదప - స్రష్టను దర్శించిన స్రష్టగ, ఋషిపరంగా కవి శబ్దం కనిపిస్తోంది. "నా నృషిః కురుతే కావ్యం = ఋషికానివాడు కవి కాడు. కవయః క్రాంతదర్శినః కవులు

క్రాంతదర్శులు. తెలుగులో "రవిగాంచనిచో కవి గాంచును" అనే సామెత ఉంది. ఆదిలో ఋషియైన - వాల్మీకి -వర్ణనలు చేసి రామాయణం వ్రాసిన కవి కాగలిగాడు.

ప్రాచీనాలంకారికులలో ప్రాతఃస్మరణీయుడైన భరతముని తన నాట్య శాస్త్రంలో ప్రత్యేకించి కావ్యనిర్వచనం చేయకపోయినప్పటికి - ఆ మహర్షి దృష్టిలో "కావ్యాత్మ" రసము అనే నిర్వచింపవచ్చు. "రసం" అనగా సౌందర్య దర్శనం వలన కలిగే ఆనంద తన్మయత్వం. అది వర్ణనాతీతమైన అనుభూతి.

" A thing o f beaut y i s a joy for ever."

సౌందర్యసందర్శనం సంతతానంద సంధాయకం - అన్నాడు కీట్సు కవి. కాళిదాస మహాకవి - "రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్ పర్యుత్సుకీ భవతి" అని సౌందర్య సందర్శనములతోపాటు మధురశబ్దశ్రవణంగూడ ఆనంద సంధాయకం అన్నాడు.

సుందరతన్ కనుంగొనినచో మధు రావము నాలకించినన్
డెందము కొండ వాగయి వడిన్ ప్రవహించును పొంగు లెత్తి ఆ
నందము మేలు కొల్పును మనఃకుహరాంతర సుప్త వాసనా
బృందము - కందళించు వచియింపగ రాని పురానుభూతులున్

- తారాతోరణం

మానవ శరీరాన్ని ప్రస్తరిస్తే - మూడు ముఖ్య విభాగాలు కన్పిస్తాయి.

(i) శరీరం :- (పొట్ట - చేతులు - కాళ్ళు - మొదలైన అవయవాలు గల మొండెం) పొట్టపోసుకునేందుకు సాధనలు కమ్మరం - కుమ్మరం. ఇతర శారీరక కృషి - ఇవి వ్యావహారిక కళలు

(ii) మెదడు :- గణితం - భౌతిక రసాయనిక శాస్త్ర విద్యలు. ఇవి విజ్ఞాన కళలు.

(iii) హృదయం :- సంగీతం-చిత్రలేఖనం-శిల్పం-కవిత్వం . ఇవి లలిత కళలు.

పొట్ట కూటికై పనికి వచ్చే శారీరక కృషి కంటె మానవ వికాసమునకు తోడ్పడే విజ్ఞాన కళలు మేల్తరములు. వాటి కంటే శ్రేష్ఠాలు - హృదయ వికాసం కలిగించే లలిత కళలు.

కళ – ప్రకృతికి అనుసరణ అని పాశ్చాత్య ఆలంకారికుల మతం. భారతీయ ప్రాచీనాలంకారికుల దృష్టిలో కళ – కేవలం అనుసరణ కాదు. కళ పునః సృష్టి. "విశ్వ శిల్పమందు వెలితి కలదు". ఆ లోటును పూరించగలిగినట్టిదే కళ. "ప్రాయేణ సామగ్ర్య విధౌ గుణానాం పరాఙ్ముఖీ విశ్వసృజఃప్రవృత్తిః (పరిపూర్ణతను సృష్టించ టంలో విశ్వశిల్పం విముఖం కాబోలు) అన్నాడు కాళిదాసు. వాస్తవ జగత్తులోని అసమగ్రత కళా జగత్తులో ఉండదు. వాస్తవసృష్టిలో మెరపు తీగలు చంచలాలు. కావ్యజగత్తులో స్థిరవిద్యుల్లతలు – ఆకుల్ రాలని పూలు వాడని వసంతారామాలు ఉండవచ్చు.

"అపారే కావ్య సంసారే కవి రేవ ప్రజాపతిః
యధాస్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే"

కవి – అపర సృష్టికర్త మాత్రమే కాదు. ఆలంకారికుల దృష్టిలో సర్వతంత్ర స్వతంత్రుడు. సృష్టి కంటె ఒక మెట్టు పైకెక్కువాడు .

పింగళి సూరన కళాపూర్ణోదయంలో వ్రాసిన 'లయవిభాతి' పద్యంలో లోకోత్తర పరిపూర్ణత కావ్య జగత్తులో స్వయంవ్యక్తం కాగలదని అభివర్ణించాడు.

చలువ గల వెన్నెలల చెలువునకు సౌరభము
కలిగినను – సౌరభము చెలువయు తలిర్పం
పొలుపెసగు కప్పురపు పలుకులకు కోమలత
నెలకొనిన సౌరభము చలువ ఘనయుం కో
మలతయును గలిగి జనముల మిగుల పెంపెసగు
పవనంపు కొదమలకు మధురత్వం
బలవడిన ఊడు మఱి కలదనగవచ్చు కడు
వెలయ గల ఈ సుకవి పలుకులకు ఎందున్.

వాస్తవ జగత్తులోని లోపాలు అన్నీ కళా జగత్తులో తేలిపోతాయి.

వెన్నెలల చెలువునకు చలువ ఉంటుంది ! సౌరభం కూడా ఉంటే! చలువ+ సౌరభం కప్పురమునకు కలవు. కోమలత్వం కూడా ఉంటే? సౌరభం + చలువ + కోమలత మలయానిలానికి కలవు. ఇక మలయానిలానికి మధురత్వం అబ్బితే అప్పుడు అది కవితా జగత్తులో చేరవచ్చు.

అలంకారచరిత్రలో భరతముని తరువాత కొత్త వెలుగు బాట వేసినవాడు ఆనందవర్ధనుడు. అతని గ్రంథం "ధ్వన్యాలోకం" అలంకార శాస్త్రచర్చలో విప్లవం తెచ్చింది. అతని దృష్టిలో "ధ్వని" కావ్యానికి ఆత్మ.

ధ్వనిని అతడు వస్తుధ్వని-అలంకార ధ్వని-రసధ్వని అని ఉత్తరోత్తమములుగా విభజించాడు.

కావ్యాత్మ - రసమే - అని అందరూ అంగీకరించారు. "ఔచిత్యమే కావ్యాత్మ" అని ప్రతిపాదించిన వాడు క్షేమేంద్రుడు. కంఠము నందు మేఖల, నితంబంపై హారం, చేతులందు నూపురం, పాదాలపై కేయూరాలు, ప్రణతుడైన శత్రువుపై పౌరుషం లోకంలో కూడా" సౌందర్యాపహాలుకావు - అపహాస్య హేతువులే.

"వాక్యం రసాత్మకం కావ్యమ్" - "రసో వైసః".

## కవిత్వం - ఛందస్సు

జాన్ స్టూ ఆర్టుమిల్ : "What is Poetry but the thought and words in which emotion spontaneously expresses itself".

కవిత్వం భావావేశం తనంత తాను ధరించే సహజ శబ్దస్వరూపం గాక మరేమిటి? అన్నాడు.

ఆంగ్ల నిఘంటు కర్త జాన్సన్ - నిర్వచనం - "Poetry is metrical composition. It is the art of uniting truth with pleasure by calling forth imagination to the help of reason".

కవిత్వం ఛందోబద్ధమౌ రచన. ఇది బుద్ధిభావనలు సాధనాలుగా ఆనంద సత్యాల ఐక్యం సంఘటించే కళ అన్నాడు.

జాన్సన్ నిర్వచనంలోని మూడు ముఖ్యాంశాలు

(i) కవిత్వం ఛందోబద్ధమైన రచన

(ii) ఆనంద సత్యాల ఐక్య సంధానం

(iii) బుద్ధి భావనల సహకారం

సంస్కృతంలో - "గద్యం కవీనాం నికషం వదంతి" గద్యమే కవిత విలువగట్టే గీటురాయి అన్నారు.

"ఉత్తమోత్తమకవిత ఛందోరహితముగనే వెల్లివిరియవచ్చు" అని కోల్‌రిడ్జ్ అభిభాషణం.

ఛందస్సు కవితకు అవసరమా? అనే ప్రశ్న ఉదయించింది. విశ్వ వాఙ్మయ ములలో కవిత బహుళంగా ఛందోబద్ధమైన రచనే. సర్ ఫిలిప్ సిడ్నీ - అన్న మాట-

'The greatest part of poets have apparelled their poetical inventions on that numerous kind of writing called verse. Indeed verse is an apparel only being but an ornament and no cause to poetry since there have been most excellent poets that have never versified and now swarm many versifiers that need never answer to the name of the poets.'

కవులలో అధిక సంఖ్యాకులు తమ రచనలకు పద్యం అనబడే గణాత్మక మైన ఆచ్ఛాదనం తొడిగారు. అది ఆచ్ఛాదనము మాత్రమే. అది కవితకు ఒక బహిరలంకారం - కాని మూల కారణం కాదు. పద్యములో వ్రాయని మహాకవు లెందరో ఉన్నారు. ఇటీవల కవి నామార్హత లేని పద్య రచయితలు చాలా మంది మూగుచున్నారు.

ఈ వివాదానికి పరిష్కార రూపకమైనట్టిది ఆదికవి వాల్మీకి ప్రాచీన గాథ; కవిత్వావిర్భావ చరిత్రగ ఎన్నదగిన రామాయణ పీఠికలో ఉన్న కథ.

మహోల్లాసశృంగార పరవశత్వంలో మునిగియున్న క్రౌంచమిథునంలోని మగ పక్షిని బోయవాడు బాణంతో కొట్టగా ఆ సన్నివేశం చూచి శోకసంతప్తుడైన వాల్మీకి నోటినుంచి శ్లోకం శాపరూపంలో వెలువడింది.

"మానిషాద ప్రతిష్ఠాం త్వమగమ శ్శాశ్వతీస్సమాః
యత్ క్రౌంచమిథునా దేక మవధీః కామమోహితమ్"

తదనంతరం - వాల్మీకి మహర్షికే ఆ శ్లోకావిర్భావం ఆశ్చర్యం కలిగించింది.

పాదబద్ధో౽క్షర సమః తంత్రీ లయ సమన్వితః
శోకార్తస్య ప్రవృత్తో మే శ్లోకో భవతు నాన్యథా.

ఈ వింతను గూర్చి – వాల్మీకి శిష్యుడైన భారద్వాజుడు సహపాఠకులతో అన్న వాక్యాలు ఉదాహరించదగినవి.

సమాక్షరై శ్చతుర్భిర్యః పాదైర్గీతో మహర్షిణా
సోఽను వ్యాహరణా త్తస్య శోకః శ్లోకత్వమాగతః

మహర్షి పొందిన శోకం, వెంటనే నోట వెలువడి సమాక్షరాలు గల నాలుగు పాదాలతో శ్లోకంగా రూపొందింది.

కావ్య మీమాంసలలో వాల్మీకి గాథలో స్వయం వ్యక్తమయ్యే ముఖ్య విషయం – ఛందస్సుకు కవిత్వానికి గల అవినాభావ సంబంధం.

"తస్య శోకః శ్లోకత్వమాగతః" కవిత అనిన వేడి కన్నీరు మాత్రమే.

'Poetry is the sister of sorrow.
Every man that suffers and weeps is a poet.
Every tear is a verse. And every heart a poet.'

దుఃఖపరవశులై కష్టానుభూతితో విలపించు శోక సంతప్తులు అందరూ కవులే... ప్రతి భాష్పబిందువు ఒక పద్యమే. శోక సంతప్తమౌ ప్రతి హృదయము ఒక మహా కావ్యమే అన్నాడు ఆంద్రేమనీషి..

షెల్లీ కవి అన్నాడు – "Poets teach in verse what they learn from suffering."
"కవితలలో కవులు ఉపదేశించేది వారు శోకసంతప్తులై లోకములో నేర్చుకున్న పాఠాలే."

ఆమె పేరు కవిత – అతిలోక సుకుమారి
సవతి తల్లి – జగతి చావగొట్టు
కారు కంటి నీరు మారు – ముత్యాలుగా
కోరి ఏరుకొనని వారలెవరు?

ముత్యాలుగా వెలుగొందే కవితలు – కన్నీరుకు మారు రూపాలే.

అయితే - మాథ్యూ ఆర్నాల్డ్ - కవితకు - ఛందస్సుకు అవినాభావ సంబంధం ఉంది అని వాక్కి వక్కాణించాడు.

"The rhythm and measure of poetry elevated to a regularity, certainity of force, very different from that of rhythm and measure which can pervade prose are also a part of its perfection.'

"గద్యం లోని శ్రుతి లయల కంటే భిన్నమై పద్యంలో లేని నియతత్వం నిశ్చితత్వం శక్తి మహత్వం సంపాదించుకొని ఉత్కర్ష నందిన శ్రుతిలయలు ఆ కళా పరిపూర్ణతలో ఒక అంగం."

లే హంట్ (Leigh Hunt) ఛందస్సు లేనిదే కవితయే లేదని నిష్కర్షగా చెప్పాడు.

This opinion is a prosaic mistake. Fitnees or unfitness for song or metrical excitement makes all the difference between a poetical and a prosaic subject and the reason why verse is necessary to the form of poetry is that the perfection of poetical spirit demands it, that the circle of its enthusiasm, beauty and force is incomplete without it.'

"ఈ అభిప్రాయం ఒక నీరస దుర్వాదం.

ఛందో౽ర్హతానర్హతలే రసవద్ వస్తువునకు - నీరస వస్తువుకూ ప్రధాన భేదం. కవిత - ఛందోరూపంలోనే ఎందుకు అవతరించాలి? అని ప్రశ్న వేస్తే - కవిఆత్మ - స్వసిద్ధికై ఆ రూపాన్నే అపేక్షిస్తుంది కాబట్టి అనే సమాధానం చెప్పవలె. ఆవేశం - సౌందర్యం తేజస్సూ మొదలగు కవితా గుణ మండలి ఛందస్సు లేకుండా సమగ్రం కాజాలవు.

"ఈ సమస్య - సాహితీవ్రతులుగాక మనోధర్మ శాస్త్రవేత్తలు తీర్చదగినట్టిది" అని ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి నిర్దేశం. జాన్ స్టూఆర్ట్ మిల్ అనే సుప్రసిద్ధ మనోధర్మవేత్త చెప్పిన తీర్పు గమనించదగినట్టిది.

'Ever since man has been born, all deep and sustained feeling has tended to express itself in rhythmical language, and the deeper the feeling the more characteristic and decided is the rhythm.'

"నిశితం-నిర్భరం అయిన భావం ఎల్లప్పుడూ అయాన్వితమైన భాషలోనే స్వయంవ్యక్తమౌతుంది. ఆ భావం ఎంత నిశితం అయిఉంటే ఆ అయాత్మకత అంత వైలక్షణ్యం ధరిస్తుంది. ఇది ఈ విశ్వంలో మానవుడు ఉదయించి నప్పటి నుండి జరుగుతూనే ఉంది".

## సారస్వత సమాధి

"నిరుపహతి స్థలమ్ము, రమణీప్రియదూతిక తెచ్చి యిచ్చు క
ప్పుర విడె మాత్మ కింపయిన భోజన మూయెల మంచ మొప్పు త
ప్పరయు రసజ్ఞు లూహ తెలియం గల లేఖక పాఠకోత్తముల్
దొరకిన గాక – ఊరక కృతుల్ రచియింపు మటన్న శక్యమే".

శ్రీ కృష్ణదేవరాయలతో అల్లసాని పెద్దన చెప్పినట్లుగా బహుళ ప్రచారంలో ఉన్న ఈ ఆట పద్యంలో కవితా హేతువులుగా పేర్కొనబడిన సదుపాయాలు కవులు అందరకూ సులువుగా లభ్యమయ్యేవి కావు. నిజానికి ఇవి కవితా హేతువులు కావు. ఇవి ఏవీ లేకపోయినా, ఉదాత్త కవితలు చెప్పిన మహాకవులు విశ్వసాహితీ జగత్తులో వేనకువేలు ఉన్నారు. ఇది సద్యః స్ఫూర్తితో రాయల ఆస్థానకవి చమత్కార గర్భితంగా చెప్పిన పద్యమే గాని – కవిహృదయం కాదు.

పోతన – భాగవత రచనకు పై సదుపాయాలు ఏవీ లేవు. అంతే గాక ఆ మహాకవి ఎలు గెత్తి చాటిన పద్యం సుప్రసిద్ధం.

"పలికెడిది భాగవత మట!
పలికించెడు వాడు రామభద్రుండట ! నే
పలికిన భవహర మగు నట !
పలికెద వేరొండు గాథ – పలుకగ నేలా?"

జర్మను వాఙ్మయంలో మహాకవిగ సుప్రసిద్ధుడైన 'గెతే' అన్న మాట.

"It is not true that I made my poems. In fact my poems have made me.

"నిజానికి నేను వ్రాసిన పద్యాలు నావి కావు. నేను వాటిని నిర్మింప లేదు.

యథార్థం ఏమిటంటే నా పద్యాలే నన్ను నిర్మించాయి." అన్నాడు. సనాతనులు - వేద మంత్రాలు అపౌరుషేయాలు అని అంటారు. అర్థవాద రూపంలో అనుశీలిస్తే - ప్రతి కవిత - అపౌరుషేయమే. కవితా సరస్వతితో ఒక కవి చేసిన ఏకాంత సంభాషణ -

"నీ యెల నవ్వు వెల్గుల కనీనికలన్ కవితా సుధా రసా
మ్నాయ పవిత్ర కోమల నినాద పరంపరలన్ మనఃశ్రవః
పేయముగా పఠించి వినిపించి, రచింపగ ఆజ్ఞ నిచ్చినన్
వ్రాయగ పూనినాడ - గరువారిన గుండె - అపౌరుషేయముల్ -
- తారాతోరణం.

ఏదో - అతిలోక శక్తి - తమ్ము ఆవహించటం పలువురు కవులు గుర్తించ గలిగారు. ఒక కవి ఆ భవ్య కవితావేశాన్ని -హరిహరనాథునకు అంటగట్టవచ్చు. ఒకరు రామభద్రుని పేర్కొనవచ్చు. ఒకరు రమణీప్రియదూతిక తెచ్చి ఇచ్చే కర్పూర తాంబూలంగా అభివర్ణించవచ్చు. కవితా శక్తి - సర్వదా - లోకోత్తరం.

ఆలంకారికులు కవితాహేతువులుగా పేర్కొనినవి - ప్రతిభ - వ్యుత్పత్తి - అభ్యాసములు.

"ప్రతిభా నవ నవోన్మేషశాలినీ ప్రజ్ఞా" అని భామహ నిర్వచనం. మమ్మటుడు చెప్పిన లోకోత్తర వర్ణనా నిపుణత ప్రతిభకు పర్యాయపదం. అది కవి చేతిలోని పరసువేది.

రమ్యం జుగుప్సిత ముదార మథాऽపి నీచ
ముగ్రం ప్రసాది గహనం వికృతం చ వస్తు
యద్వాऽవ్యవస్తు కవిభావుక భావ్యమానం
తన్నాస్తి యన్న రసభావ ము పైతి లోకే.

"రమ్యం కావచ్చు - రోత గొలిపేది కావచ్చు. ఉత్తమమైనది కావచ్చు. భయంకరమైనది కావచ్చు. ప్రసన్నం కావచ్చు. గంభీరం కావచ్చు. వికృతం కావచ్చు. వస్తువు కావచ్చు. అవస్తువే కావచ్చు. లోకంలో కవిచే భావ్యమానమై రసం కలిగింపనది లేదు.

షెల్లీ కవి "Poetry turns everything to loveliness. It exaults the beauty of that which is beautiful and it adds beauty to that which is deformed" 'కవిత్వం

అన్ని వస్తువుల్ని అందంగా తీర్చిదిద్దుతుంది. సుందర వస్తువుల్ని సుందరతరం చేస్తుంది. వైరూప్యాలను గూడ సుందరంగా మార్చగలదు" అని అన్నాడు.

పద్మం ఒక పూవుగా మాత్రమే సామాన్యులకు కనిపిస్తుంది. కవి ఆ పువ్వును చూచి

"ప్రత్యూష పవనాల - పద్మిని పులకించి
చిందెను చిన్నారి చిలిపి నవ్వు" - తారాతోరణం

అని వర్ణిస్తాడు. కవి జడప్రకృతికి ప్రాణప్రతిష్ఠ చేయగలడు. మాధవీలతా తన్వి రసాల పురుషుని కౌగిలించుకొన్నది అంటాడు కవి. అతనికి అట్టి క్రాంత నేత్రం ఉంటుంది.

వ్యుత్పత్తి - అనే శబ్దంలో లోకజ్ఞాన సర్వస్వం - భాషాపాటవం మున్నగు ప్రజ్ఞా విశేషాలు ఇమిడిఉన్నాయి. వ్యుత్పత్తి - ప్రతిభకు మెరుగు పెట్టగలదు. ఇక ఆ రెండు ప్రజ్ఞలతో పాటు - ఆలంకారికులు "అభ్యాసము"నకు ప్రక్క పీట వేశారు. శక్తి సామర్థ్యాలకు సంతత సాధన - తపస్సు - అవసరం. ఇది సృష్టిలోని ఒక అద్భుత రహస్యం. ఇంతవరకు ప్రాచ్య ప్రతీచీ సాహితీవేత్తలు అందరు అంగీకరించిన అంశాలే.

ఇక విశేషం ఏమిటంటే రాజశేఖరుడు కావ్యమీమాంసలో ప్రతిభను - భావయిత్రి - కారయిత్రిగా వింగడించి మధ్యలో 'సమాధి'ని చేర్చాడు అంటే ప్రతిభ = భావయిత్రి + సమాధి + కారయిత్రి అన్నమాట. విమర్శకులు పలువురు విస్మరించిన విశేషం సారస్వత సమాధి. భావయిత్రి - కవికి ఉండాలి. అంతేగాక భావయిత్రి లలితకళోపాసకులు అందరికీ సమానధర్మమే.

రస్కిన్ మహాశయుడు లోతులు మధించి, సమస్త కళలకు సౌందర్యారాధనయే పరమార్థం అనీ కళాత్మ - రసానందమే అని ప్రవచించాడు.

"It is shallow criticism that would define poetry as confined to literary productions in rhyme and metre. The written poem is only poetry talking, and the statue, the picture and the musical composition are poetry acting. Milton and Goethe at their desks were not more truly poets than Phidias with his chisel, Raphael at his easel or deaf Beathoven bending over his piano, inventing and producing strains which he himself could never hope to hear".

లయాన్వితమై ఛందోబద్ధమైన రచన కవిత్వం అని నిర్వచించటం అవ్యాప్తి దోషభూయిష్ఠం. కావ్యనిబద్ధరచన మాటలలో కూర్చిన శ్రవ్యకావ్యం. శిల్ప విగ్రహం,

చిత్రలేఖనం, నాదబింబప్రస్తారం కవితాభినయ విన్యాసాలే. యథార్థంగా వ్యాసపీఠం ముందు కూర్చున్న మిల్టన్, గెతే మహాకవులే. వారితో పాటు లోకోత్తర విగ్రహం చెక్కిన ఫిడియాస్ శిల్పిగాని, కుంచెపట్టుకొని చిత్రలేఖనం సృష్టించిన రాఫెల్ గాని – తాను వినటానికి నోచుకోని నాదబిందు కృతులు పియానా వాదిత్రంపై ఒదిగి సృష్టించిన బధిరుడు బీథోవెన్ గాని మహాకవులే సుమా".

కాబట్టి కళలు అన్నిటికీ సౌందర్యారాధనలో అభివ్యక్తం అయ్యే ఆనందమే పరమావధి అని భరతముని వలె ప్రతిపాదించినవారు లేకపోలేదు. పాశ్చాత్య సాహితీ వేత్తలలో ఆదిమాలంకారికులు – అరిస్టాటిల్ వంటివారు ప్రవచించిన Cathorsis of emotions – భావితాంతః కరణ ప్రక్షాళనం – రసానుభూతిలో అంతర్భాగమే.

అయితే కవితాసృష్టికి – ప్రతిభలో అంతర్భాగమైన – "సారస్వత సమాధి" – ఆవశ్యకతను గుర్తించిన పాశ్చాత్య సాహితీవేత్తలు ఉన్నారు. వర్డ్స్‌వర్తు కవి "Poetry is emotion recollected in tranquillity" అనుభవించిన భావోద్వేగాన్ని–సాహితీ సమాధిలో నిక్షేపించి – తదుపరి నెమరు వేసుకుంటూ చేసే పునఃసృష్టియే కవిత అని అన్నాడు. అత్యద్భుతమైన భావయిత్రి ఉండవచ్చు. ఉజ్జ్వలమైన కారయిత్రి కూడ ఉండవచ్చు. లోకోత్తరమైన వ్యుత్పత్తి ఉండవచ్చు. అయితే "సమాధి" లోపిస్తే – కవితా సృష్టిలో పరిపూర్ణత ఉండదు.

ఇచ్చట – కవిత్వంలో లలిత కళలను అన్నిటిని చేర్చవచ్చు. గొంగళి పురుగు – గూడు కట్టుకుని యోగ నిద్రాప్రాయమైన నిర్వికల్ప సమాధిలో కొంతకాలం ఉన్న పిదప – సీతాకోకచిలుక కాగలుగుతుంది. ఏమాత్రమైనా ఆ సమాధికి భంగం కలుగుతే రెక్కలు రాని సీతకోక చిలుకలు బయటికి వస్తాయి. కొన్ని కవితలు రెక్కలు సవ్యంగా రాని సీతకోక చిలుకలు.

గూడు కట్టుకొనిన – గొంగళీ పురుగు లై<br>
చేయ గలరు కవులు – చిర తపస్సు;<br>
చివర – సీత కోక చిలుకలై – సొగసుగా<br>
గగన వీధు లందు – ఎగుర గలరు.

జగత్ స్రష్ట కూడ – పునఃసృష్టికి పూర్వం – కొంత కాలం యోగనిద్రా ముద్రితుడై ఉంటాడని పురాణ కథనం.

విషయ విస్తరమున - సుషమా నిదిధ్యాస
క్రాంత దర్శనమ్ము కవికి కూర్చు;
స్నిగ్ధ యోగ నిద్ర - సృష్టి కర్తకు బోలె
కలికి సీత కోక చిలుక - కవిత.

పాశ్చాత్య సాహిత్యవేత్తలు దిఙ్మాత్రంగా సూచించిన "సారస్వత సమాధి"ని సుస్పష్టంగా గుర్తించి నిర్వచించినవాడు. సంస్కృతాలంకారికుడు కావ్య మీమాంసా కర్త రాజశేఖరుడు.

"Between the moment of inspiration and the finished work of art, there is room for many a slip. Feeble or defective emotion is at best only one explanation of an unsatisfactory form. But we cannot be sure that because the forms are wrong the state of mind of the artist in the beginning is also wrong. Right forms imply right feelings, but wrong forms do not necessary imply wrong feelings. The latter may be due to lack of concentrating his energies'. – Clive Bell.

"కవికి, భావావిష్టత కల్గినది మొదలు కావ్య నిర్మాణం పూర్తి అయ్యేలోపల పెక్కు భంగాలు కలిగే అవకాశం ఉంది. కావ్య రసహీనతకు - నీరసమైనట్టి గాని దోష భూయిష్ఠమైనట్టిదిగాని కవి యొక్క భావనయే కారణమని మనం తలపోయవచ్చు .కాని కావ్య నిర్మాణం బాగా ఉండకపోవటానికి ఆదిలో కవియొక్క చిత్తస్థితి బాగా లేక "పోవటమే ఏకైక కారణం కాదు. రసవంతమైన కావ్యం - కవి సాహితీ ప్రియం భావుకతకు నిదర్శనమే గాని, రసహీనమైన "కావ్యం విధిగా అతని భావుకతా లోపం అని చెప్పలేము. ఈ రెండవది సమాధిలోపం మూలాన సంభవింపవచ్చు." అని క్లైవు బెల్ ప్రవచనం.

గొంగళీ పురుగు-సీతాకోకచిలుకగా మారటానికి ముందు గూడు కట్టుకొని నిర్వికల్పసమాధిలో ఉంటుంది. ఉత్తమ కవితకు - "సమాధి" అవసరం.

కవితను ఆలంకారికులు ప్రతిభ-వ్యుత్పత్తిగా వింగడించారు. అయితే అలంకారికులు పలువురు 'ప్రతిభయే గరీయసి" ప్రతిభయే గొప్ప అన్నారు. రాజశేఖరుడు ప్రతిభను భావయిత్రి - కారయిత్రిగా వింగడించి, మధ్య 'సమాధి'ని చేర్చాడు.

## శ్లేష

పలు భాషలలో ఒక శబ్దం – రెండు మూడు అర్థాలు ఇచ్చేది ఉండవచ్చు. ఇతర భాషలలో, సంస్కృతంలో గూడ అర్థాంతర స్ఫూర్తి కల్పించే "శ్లేష" అక్కడక్కడ సమ్యక్ పతితం. ఆంగ్లంలో సమీకృత షేక్స్పియర్ నాటకాలలో శ్లేష, శబ్ద మాత్రంగా కనిపిస్తుంది. ఆ శ్లేషలకే శ్రోతలు మురిసిపోయేవారట. తెలుగులో శ్లేషమయమైన పద్యాలు కోకొల్లలు.

శ్లేషలు రెండు రకాలు – అభంగశ్లేష – సభంగ శ్లేష. సభానంతరం "వేడి తేనీరు" – అని ప్రకటన. వేడి + తేనీరు వాచ్యార్థం. "వేడితే – నీరు". సభంగ శ్లేష.

తెలుగులో శ్లేష కవితా చక్రవర్తి – రామరాజ భూషణుడు. వసుచరిత్ర శ్లేష మయం. హరిశ్చంద్ర నలోపాఖ్యానం "ద్వ్యర్థి" కావ్యం. పింగళి సూరన – రాఘవ పాండవీయం – ద్వ్యర్థి కావ్యం.

పోతన కవి వ్రాసిన పద్యం – శ్లేష గర్భితమైనది ఉదాహరించవచ్చు.

లలిత స్కంధము కృష్ణ మూలము శుకాలాపాభిరమ్యంబు మం
జు లతా శోభితమున్ సువర్ణ సుమనస్సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వల వృత్తంబు మహాఫలంబు విమల వ్యాసాలవాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వుర్విన్ సద్విజ శ్రేయమై.

శ్లేష కవితా పద్యం – గర్భిణీ సతి వలె రెండు ప్రాణాలతో ప్రతిపదం రెండర్థాలలో – రెండు ఊపిరులతో మంద గంభీర మధుర గమనంతో కనిపిస్తుంది. ఆది కవి నన్నయ ప్రయోగించిన శ్లేష – ఎన్న దగినట్టిది.

కద్రూ వినతలు సముద్రాన్ని చూస్తారు.

"ఉద్యాన వనంబునుం బోలె – బహు విద్రుమ లతాలంకృతం
బైన దాని – నాటక ప్రయోగంబునుం బోలె ఘన రస పాత్ర
శోభిత రంగ రమ్యం బైన దాని, దివంబునుం బోలె
నహిమకర భరితం బైన దాని". –

ఇందు ఉపమేయమైన సముద్రమునకు ఉపమానములు కలవు. 1. ఉద్యానవనం 2. నాటక ప్రయోగం 3. దివం ఈ ఉపమాలాంకారంలో సమాన ధర్మం శ్లేష వలన సిద్ధించటం గమనించవలసిన విశేషం. అహి + మకరము సముద్ర పక్షంగా అ + హిమకర, దివం పక్షంగా సభంగ శ్లేష.

రామరాజ భూషణుని వసుచరితలోని పద్యాలు బహుళంగా శ్లేష గుంఫితాలే.

చతురాస్యుల్ పురుషోత్తముల్ బుధగురుల్ సర్వజ్ఞ మూర్తుల్ మహా
శతమన్యుల్ శుచిధర్మ పుణ్య జనతా శ్లాఘ్యుల్ ప్రచేతుల్ సదా
గతు లక్షీణ నవార్థ కల్పులు కళాకాంతుల్ జగద్బంధు లా
క్షితిదేవుల్ పురి దేవతా మహిమలం జెన్నొందుటల్ చిత్రమే.

నగరంలోని బ్రాహ్మణుల గూర్చిన వర్ణన ఇది. ఈ పద గుంఫనాలు అటు సురులకు ఇటు భూసురులకు మృదు మధురంగా అన్వయిస్తాయి.

రామరాజభూషణుడు చేసిన పూర్వకవిస్తుతి పద్యం - ప్రౌఢశ్లేషకు - ఉదాహరణము.

మహి మున్ వాగనుశాసనుండు సృజియింపన్ కుండలీంద్రుండు త
న్మహనీయ స్థితి మూలమై నిలువ శ్రీనాథుండు ప్రోవన్ - మహా
మహులై సోముడు భాస్కరుండు వెలయింపన్, సొంపు వాటించు ఈ
బహుళాంధ్రోక్తి మయ ప్రపంచమును తత్ ప్రాగల్భ్య మూహించెదన్.

ఈ పద్యంలో సుప్రసిద్ధ కవులు వాఙ్మయ ప్రపంచం తీర్చిదిద్దినారు. అర్థాంతరము ఎందరో దివ్యమూర్తులు ప్రపంచమును తీర్చిదిద్దువారలు.

వాగనుశాసనుడు నన్నయ - బ్రహ్మ, కుండలీంద్రుడు (సోమయాజి ఆదిశేషువు) శ్రీనాథుడు (శ్రీనాథ కవి - విష్ణువు) సోముడు (నాచన సోముడు - చంద్రుడు) భాస్కరుడు (భాస్కర కవి - సూర్యుడు).

అచ్చటచ్చట శ్లేషలు ప్రయోగించడమేగాక యావద్ పద్యం, శ్లేషానుప్రాణితం చేయటమేగాక తెలుగు కవులు ద్వ్యర్థికావ్యాలు రాఘవ పాండవీయం వంటివి - అటు

రామాయణ కథ - ఇటు భారత కథ ఒకే పద్యంలో వచ్చేటట్లు ఎన్నో వ్రాశారు. భట్టుమూర్తి వ్రాసిన - హరిశ్చంద్రనలోపాఖ్యానం పేర్కొనదగిన ద్వర్థి కావ్యం. ద్వర్థి కావ్యసృష్టి - తెలుగులో, సంస్కృతంలో తప్ప - ప్రపంచంలో ఏ సారస్వతంలోనూ కన్పించదు. ఉదాహరణకు పింగళి సూరన రాఘవ పాండవీయం లోని ఒక పద్యం.

శశ్వద్విస్ఫురిత స్వబాహుబల భీష్మప్రౌఢ చాపక్రియన్
విశ్వామిత్ర వితాన విఘ్న భయ విశ్లేషం బొనర్పన్ జగ
ద్విశ్వాస స్థితి చాలియున్కి నటులన్ వీరార్యకుల్ గాంచి ర
త్యైశ్వర్యాహమికా విశృంఖల విహారారంభ విస్రంభముల్.

రెండర్థాలు శోభిల్లేటట్లు పద్యం కూర్చటం, ఇటు కవి సామర్థ్యం అటు తెలుగు భాష గొప్పదనం వెల్లడిస్తుంది. అయ్యలరాజు రామభద్రుడు, తరువాతి కవులు పింగళి సూరన - రామరాజభూషణుడు మున్నగువారికి మార్గదర్శకుడయ్యాడు. అతడు తెలుగులో "ద్వర్థి" కావ్యనిర్వహణమునకు పూర్వరంగ ప్రవర్తకుడు.

"ధారాశుద్ధి ప్రసిద్ధి గాంచి ఘన శబ్ద స్ఫూర్తి వర్తిల్లగా
తోరం బైన రసస్థితిన్ తరళ విద్యున్మాలికా లక్షణో
దారంబై, కవి సేవ్యమై వనమయూరారూఢి ప్రాపించి, వ
ర్షారంభంబు ప్రబంధ మట్లఖిల పద్యాక్రాంత మయ్యెం దగన్".

ఇది రామాభ్యుదయ కావ్యంలో సుగ్రీవ పట్టాభిషేకానంతరం వర్షాకాల వర్ణన. వర్షారంభము ప్రబంధము వలె ఉన్నది - అని కవి వర్ణన. ధారాశుద్ధి - ఘనశబ్ద స్ఫూర్తి - రసస్థితి - తరళవిద్యున్మాలికా లక్షణోదారంబై కవిసేవ్యమై వనమయూరారూఢి - పద్యాక్రాంతము రెండర్థాలు గల ప్రయోగాలు.

చరిత్ర సృష్టించిన తెలుగు పద్యాలలో హృద్యమైన శ్లేష విద్య కన్పిస్తుంది. శ్రీనాథుడు వ్రాసిన ఒక చిరు కంద పద్యం

"సర్వజ్ఞ నామధేయము
శర్వునకే రావు సింగ భూపాలునకే
ఉర్విం జెల్లును తక్కొరు
సర్వజ్ఞు డనుట కుక్క సామజ మనుటే" గూర్చి ఒక కమ్మని కథ ఉంది.

ఈ పద్యం రాచకొండ ప్రభువైన సర్వజ్ఞ సింగభూపాలుని కొలువు కూటంలో శ్రీనాథ మహాకవి చెప్పింది. రెడ్డిరాజుల ఆస్థానకవియైన శ్రీనాథుడు, వెలమ ప్రభువు కొలువు కూటానికి ఎందుకు వెళ్లినట్లు? ఆశ్రయం కోసం కాదు. ఆనాడు రెడ్డిరాజులకు వెలమ ప్రభువులకు గల వైరం చారిత్రక ప్రసిద్ధికెక్కింది.

దేవరకొండ ప్రభువైన లింగమనీడు కొండవీడుపై దండెత్తి, విజయం సాధించి, రెడ్డి రాజన్యులు పూజించే బాకు - నందికాంత పోతురాజు కటారి - తీసుకొని పోయాడట. కిరీటంకంటె ఎక్కువ గౌరవ ప్రపత్తులతో చూసే ఈ కటారిని తీసుకు రమ్మని రెడ్డిరాజులు అర్థించగా శ్రీనాథుడు వెళ్లినట్లు కథ. అది యుద్ధము చేసి సంపాదించదగిన వస్తువు కాదు. అదృష్ట చిహ్నముగా పౌరుష లాంఛనముగా తాము భావించే ఆ కటారి శత్రువుల చేతిలో ఉండటం రెడ్డిరాజులకు ఇష్టం లేదు. అందుచే ఆస్థాన కవిని రాయబారిగా శత్రురాజుల కొలువు కూటానికి పంపారు.

అప్పుడు వెలమప్రభువు సర్వజ్ఞసింగభూపాలుడు - అభ్యాగతుడుగా వచ్చిన కవి సార్వభౌమునకు మేళ తాళాలతో ఎదురేగి స్వాగతం చెప్పి "నందికాంత పోతరాజు కటారి"ని ఉడుగరగా సమర్పించాడని జనశ్రుతి లోని కథ. పై పద్యం శ్రీనాథుడు ఆ సందర్భంలో చెప్పినట్టిది.

సర్వజ్ఞ శబ్దానికి రెండర్థాలు ఉన్నాయి. ఒకటి - సర్వం తెలిసినవాడు - రెండవ అర్థం - "శివుడు". సింగభూపాలుడు - సర్వం తెలిసినవాడు మరియు పరమేశ్వరుడు గూడ అని కవి ప్రశంస.

శ్రీనాథుడు తిరిగి రెడ్డిరాజుల కడకు రాగా కొందరు వేళాకోళం చేశారట శత్రురాజును అంతగా కీర్తించినందుకు. శ్రీనాథకవి, సమాధానంగా ఆ పద్యాన్నే, కాకువు మార్చి సభంగ శ్లేషగా చదివి వినిపించాడు.

సర్వజ్ఞ నామధేయము  
శర్వునకే - రావు సింగ భూపాలునకు - ఏ  
ఉర్విం జెల్లును? తక్కొరు  
సర్వజ్ఞుఁ డనుట - కుక్క సామజ మనుటే.

ఈ పాఠాంతర పఠనంలో - సింగభూపాలుడు - కుక్కతో సమానం అనే రహస్య నింద దాగి ఉంది.

చిరు విరుపుతో - ఒక పద గుంఫనం - భూకంప ప్రకంపనం సృష్టించగల సహజశక్తి తెలుగు భాషకు ఉంది. తెలుగు భారతంలో నన్నయ వ్రాసిన చివరి పద్యం - శరత్కాల వర్ణన.

శారద రాత్రు లుజ్జ్వల లసత్తర తారక హార పంక్తులన్
చారు తరంబు లయ్యె విలసన్నవ కైరవ గంధ బంధురో
దార సమీర సౌరభము దాల్చి సుధాంశు వికీర్యమాణ క
ర్పూర పరాగ పాండు రుచి పూరము లంబర పూరితంబులై.

ఈ పద్యంలోని చివరి పదగుంఫనం - ప్రకరణానుబద్ధంగా పాండు రుచి పూరములు + అంబరపూరితంబులై. అదిగాక - పాండు రుచిపూరములన్ + పర పూరితంబులై అనగా తన భారత రచన - ఇకమీద పరపూరితమ్ములౌనని బుద్ధిపూర్వకంగానే నన్నయ ఈ పద్యము పొందుపరచాడని కొందరు విద్వాంసుల వాదం.

విశ్వసాహితీజగత్తులో రెండర్థాల జోడు గుఱ్ఱాల స్వారీ మాదిరిగా కవిత కూర్చటంలో తెలుగు భాషదే అగ్ర తాంబూలం. తెలుగు సారస్వతంలో శ్లేష కవి సార్వభౌముడు రామరాజభూషణుడు. ఇతరులకు శ్లేష ప్రయత్న సాధ్యం. రామరాజభూషణునకు సహజసిద్ధం. వసుచరిత్రలో నదీ వర్ణన పద్యం -

జీవన మెల్ల సత్కవి నిషేవిత మాశయ మెల్ల అచ్ఛతా
పావనతా గభీరతల పట్టు - ప్రచారము లెల్ల విశ్వ ధా
త్రీ వలయ త్రికాల ఫలదేశికముల్ - నవకంబు లెల్ల ము
క్తావళి విభ్రమాస్పదము లానది పెంపు నుతింప శక్యమే.

జీవనము = బ్రదుకు;నీరు. సత్కవి = మంచికవులు, నీటి పక్షులు, ఆశయము = మానసము; నీటి మడుగు, గభీరత = లోతు, అగాధత్వము, ప్రచారము = ప్రవర్తన = జలప్రవాహము; త్రికాల ఫల దేశికములు = ముక్కారు పంటలు - త్రికాలజ్ఞతలు నవకంబులు = నవ + కంబులు. కొత్త శంఖములు, లాలిత్యములు; ముక్తావళి = యోగీశ్వర బృందము; ముత్యాల వరుసలు = ముత్యాల దండలు.

## యుగళ కళ

"వాగర్థా వివ సంపృక్తౌ - వాగర్థ ప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ".

కాళిదాస మహాకవి - రఘువంశ మహాకావ్యంలో వ్రాసిన ప్రథమ శ్లోకం, స్థూల దృష్టికి కృత్యాది ప్రార్థనగా గోచరించవచ్చు. కాని యీప్రార్థనాశ్లోకంలో ఆ మహాకవి, కవితాతత్త్వ కళారహస్యం పొందుపరిచినట్లు సాహితీ ప్రియంభావుకులైన సహృదయుల సూక్ష్మదృష్టికి స్వయంవ్యక్తం కాగలదు. గాంధీ మహాత్ముడు - "ఆకలి గొన్నవానికి, భగవంతుడు ఆహారరూపంలో తప్ప సాక్షాత్కరించుటకు సాహసింపడు" అన్నాడు. అవును - క్షుధార్తునకు ఆహారమే భగవత్ స్వరూపం. సంగీత కళోపాసకుడైన త్యాగ రాజునకు పరబ్రహ్మ సాక్షాత్కారం "నాదబిందు కళా స్వరూపం" లోనే లభించింది.

ఆజన్మకవికి పరమేశ్వర సాక్షాత్కారం అర్ధనారీశ్వర రూపంలో అవగతం కావటం సహజమే. జగదేక కవి-కాళిదాసు పార్వతీ పరమేశ్వరుల అవినాభావ దాంపత్యమును వాగర్థాల కలయిక గానే దర్శించాడు. వాగర్థముల దాంపత్యం - వర్ణనా తీతం. వాగర్థాలు, భాష-భావం పార్థక్య ప్రతిపత్తి గల్గినట్టివే గాని వాని సంయోగమే సాహిత్యం. ఆ విధంగా సాహిత్యం సార్థకం. కవిత్వం యుగళ కళ. భాషా భావాల సంయోగం. ఆ యుగళకళలో భాషకా భావానికా ప్రాధాన్య వివక్ష? కవితా రథానికి ఇవి జోడు గుఱ్ఱాలు. ఇవి ఏ ఒడుదుడుకులు లేకుండా సమగతిలో సమాన వేగంతో పరుగెత్త వలె. గిట్టల చప్పుడులో గూడ అపశ్రుతి వినిపింపగూడదు. కాని ప్రపంచ సాహిత్యాలను అనుశీలిస్తే ఈ జోడు గుఱ్ఱాల పందెపు పరుగులో సర్వదా సమవేగం సాధించగలిగిన సారస్వత సారథులు వ్రేళ్ళ మీద లెక్కింప దగినవారే.

పరాసు దేశీయుడైన ఒక సుప్రసిద్ధ చిత్రకారుడు కవితలు అల్లటం మొదలు పెట్టాడు. చిత్రకారుడు కాబట్టి అతనికి భావయిత్రి పుష్కలంగా ఉంది. అతని కవితలకు ఆదరణ లభించలేదు. అతడు ఒక ఆంతరంగిక మిత్రునితో తన ఆవేదన వ్యక్తం చేశాడు. సాహిత్యవేత్తయైన ఆ మిత్రుడు చెప్పిన సమాధానం ఇది - "కవిత్వం కలంతో వ్రాయాలి. కుంచెతో కాదు. కవిత్వం శబ్దాలతో కూర్చాలి. రంగులతో కాదు గదా. భావాలను భాషలో వెల్లడించాలి. నీకు భాష మీద అధికారం లేదు". కవిత్వం యుగళకళ.

భాషాభావాల సముచిత సమ్మేళనం. కవితకు ప్రతిభతోపాటు వ్యుత్పత్తి ఉండాలి. వ్యుత్పత్తిలో సకల శాస్త్రజ్ఞాన సర్వస్వం ఇమిడి ఉంది. కవితా కళలో- బాహ్యానికి కనిపించేది భాషయే. ఆహార్యప్రాయమైన భాషా ప్రాగల్భ్యం ఒకసారి కన్నులకు మిరుమిట్లు కల్పించి భ్రాంతిని చేకూర్చవచ్చు. రంగస్థలం మీద - కన్నులకు మిరుమిట్లు గొలిపే ఆహార్యం ధరించి కన్పించినప్పుడు ప్రతాపరుద్రునివలె పేరిగాడు భాసించవచ్చు. అంతేగాక-సుందరాంగులుకూడ అందమైన ఆహార్యం వేసుకోవాలని తహతహ లాడుతారు. ప్రతిభావంతులైన కవులు కూడ భాషాప్రకర్షపై మోజు చూపవచ్చు. శ్రీనాథమహాకవి-తాను చిన్నప్పుడే కవిత రాశానని చెప్పటానికి -

"చిన్నారి పొన్నారి చిరుత కూకటినాడు మరుత్తరాట్ చరిత్ర" నుడివినానని, వయసు వచ్చినప్పుడు వ్రాశానని చెప్పటానికి - "నూనూగు మీసాల నూత్న యౌవనమున" అని చక్కని చిక్కని పద గుంఫనాలు ప్రయోగించాడు. ప్రబంధ కవులలో పలువురు భాషాప్రగల్భత చూపించారు. పెద్దన - చంద్రుడు అని చెప్పటానికి ఒక పెద్ద సీస పద్యం దిగ్దిగంతరాలు మారుమ్రోగేటట్లు చెప్పాడు.

"కలశ పాథోరాశి గర్భ వీచి మతల్లి
కడుపార ఎవ్వాని కన్న తల్లి".

శ్రీనాథ మహాకవితో ప్రారంభమైన భాషాప్రాగల్భ్య ప్రకర్ష ప్రబంధయుగంలో శాఖోపశాఖలతో విస్తరించిన వటవృక్షప్రాయమైనది. "రీతి రాత్మా కావ్యస్య" అన్న ఆలంకారికులు ఉన్నారు. రీతిసుభగమైన గంభీర శయ్యలో శ్రీనాథుని సీసాలలో ఒక ఉయ్యాల ఊపు హృదయాలను ఆలరిస్తుంది.

అంకితం పద్యాలలో రసస్ఫూర్తి కేవలం భావోన్మేషంతో కలిగించటం కష్టం. శ్రీనాథ మహాకవి అన్న మంత్రి కీర్తిని ఉగ్గడిస్తూ ఒక చక్కని చిక్కని సీసపద్యం భాషాప్రకర్ష చూపిస్తూ వ్రాశాడు.

ముక్కంటి దరహాసమున కనుప్రాసంబు;
మిన్నేటి నీటికి మిక్కుటంబు;
శారద జ్యోత్స్నా ప్రసారంబునకు వీప్స;
నలువ శుద్ధాంతమున కనుభాష;
కల్పకారామ రేఖకు ప్రతిచ్ఛందమ్ము;
త్రిదశేంద్ర కరటి కామ్రేడితమ్ము;

పుండరీకారణ్యమునకు అధ్యాహార
　　మమృతాంబునిధి కబిరాధాతరమ్ము;
గంధసార తుషార పాణింధమమ్ము;
　　దానవిద్యా విలాస విద్యాధరుండు
మంత్రి అన్నయ్య దేవయ్య మహిత యశము
　　నిఖిల దిక్తట మంతయు నిండి యుండు.

ఈ పద్యంలోని అనుప్రాస - వీప్స - అనుభాష - ప్రతిచ్ఛందము. ఆమ్రేడితము - అధ్యాహారము అవిధాంతరము సమానార్థకాలే.

కాంచీ కంకణ తార హార కటక గ్రైవేయ భూషావళుల్
అంచం బిత్తురు దూతికా తతికి లీలన్ బెండపూ డన్ననిన్
పంచాస్త్రోపము, తారు .తార, కవయన్ ప్రార్థించి లోలోపలన్
పంచారామము అందు పల్లెల పురిన్ - ప్రౌఢేందుబింబాసలల్.

శ్రీనాథుడు వ్రాసిన ఈ పద్యంలోని భాష, బిందుపూర్వక చకారప్రాస, యతులు - సహృదయులను ఆకర్షిస్తాయి ఇందులోని భావం మాట అటుంచి. లోకంలో గూడ భాషాప్రకర్షా ప్రలోభం చాలమందిలో కనిపిస్తుంది. "సంతోషించాను" అనటానికి బదులుగా, "ఆమందానంద కందళిత హృదయారవిందుడనైనాను" అని గొప్పగా చాటుకునేవారు ఉన్నారు.

అయితే భాషా ప్రకర్ష - తరచు - జానెడు పిలకకు మూరెడు పూల జడ వేసినట్లే ఉంటుంది.

రీతి సుభగమైన సుకుమార సుందర శయ్యాపాక పరిపక్వత, వసుచరిత్ర పద్యాలలో పరాకాష్ఠ చెందింది. వసుచరిత్రలోని ప్రతి పద్యం - స్థిర విద్యుద్రో చిస్సులు మిరుమిట్లు గొలిపే అక్షర శిల్ప హర్మ్యములే.

లలనా జనాపాంగ వలనా వసదనంగ
　　తులనాధికా భంగ దోః ప్రసంగ
మలసానిల విలోల దళసాసవ రసాల
　　ఫలసాదర శుకాలపన విశాల

మ లినీ గమదనీక మలినీకృత ధునీక
మలినీ సుఖిత కోకకుల వధూక
మతి కాంతసంతాంత లతికాంతర నితాంత
రతి కాంత రణ తాంత సుతను కాంత
మకృత కామోద కురవకావికల వకుల
ముకుల సకల వనాంత ప్రమోద చలిత
కలిత కలకంఠ కులకంఠ కాకలీ వి
భాసురము వొల్చు మధుమాస వాసరము.

శతసహస్ర వసంతాలు ఒక్క తెలుగు పద్యశిల్పంలో వెల్లివిరిసాయి ఒక్క సారిగా. కవిత - భాషలోనే అభివ్యక్తం కావాలి కాబట్టి "అల్లిక జిగి బిగి" - "ముద్దు పలుకు" "పదగుంఫనాలు" అవసరమే. అయితే పట్టుపుట్టాలతో బంగారు ఆభరణాలతో అలంకరించిన ఆడు కోతి కంటె, నార చీరలు ధరించిన శకుంతలయే అందకత్తె అనిపించుకుంటుంది. కాని - ఆహార్యప్రీతి - మానవు లందరి డెందాలలో లోతుగా నాటుకుని యున్న నైసర్గిక లక్షణం. లోకంలో వస్త్రధారణ లేని మనుష్యులు లేరు. సారస్వతంలో భాషాచ్ఛాదనం లేని పద్యాలు ఉండవు. అయితే భాషాడంబరం కంటె భావనా సౌందర్యమే గొప్పది. ఆలంకారికులు శ్లేష రచనలను చిత్ర కవిత్వాలను అథమశ్రేణికి చేర్చి అధిక్షేపించారు. ఆహార్య ప్రలోభం - బాల్య చాపల్యమే.

తిక్కన కవితలో ఒక్క చోట గూడ శ్లేష ప్రయోగం కన్పించదు. ఆహార్య ప్రాయమైన భాషాప్రయోగ కౌశల్యం ఎచ్చటా చూపించలేదు తిక్కన. అర్థాంతర సాధన అవసరమైనప్పుడు గూడ తిక్కన నిగ్రహం ప్రదర్శించాడు.

ఉత్తర గోగ్రహణ ఘట్టంలో - అజ్ఞాతవాస దీక్ష పూర్తి కాకుండా అర్జునుడు వచ్చాడా? అన్న సందేహం ద్రోణునికి కలిగింది. అప్పుడు ద్రోణుని నోట తిక్కన పలికించిన పద్యం

"వెరవరి గాక వీడు - కురు వీరులకున్ పొడసూపువాడె - అ
చ్చెరు వొక ధ్రమని పేర ఇట చేరగవచ్చుచు నున్నవా డహం
కరణమ కాని యొండొకటి కానడు - మూర్తి విశేష మారయన్
సురపతి యట్లు - వీని మది చొప్పది యెట్లొ యెరుంగ నయ్యెడిన్"

ఇందు అందరకు గోచరించు అర్థం ఒకటి. 'ఎవడీ దురహంకారి'? అనేదే. భీష్మునకు అర్థాంతరం స్ఫురిస్తుంది. దేవేంద్రునివలె ఉన్నాడు - అర్జునుడా? సమయ భంగానికి

పాల్పడు చున్నాడా దుర్విదగ్ధుడై? భీష్ముడు గూడ రెండర్థాలు – శ్రోత అందరకు ఒకటి ద్రోణునకు ఇంకొకటి – స్ఫురించే సమాధానం ఇచ్చాడు.

"తలపగ రిపులకు ఇమ్మగు
కొలది గడచి వచ్చితిమి, అకుంఠిత బాహా
బలము నెరప తరి యయ్యెను
చలింపవల దింక మనకు శత్రుల వలనన్".

అజ్ఞాత దీక్షా సమయం దాటిన దని ద్రోణుడు తెలుసుకున్నాడు "వచ్చిన వాడు ఫల్గునుడు – అవశ్యము గెల్తు మనంగరాదు" అని బహిరంగ ప్రకటన చేశాడు.

ఇందు రెండు అర్థాలు శ్లేషలోపలె తుల్యోపపన్నాలు గావు. మొదటి అర్థం లేనిదే కథ నడవదు. రెండవ అర్థం అంతకంటె అవసరం. అది గుణీభూతమైనది కాబట్టి గుణీభూతవ్యంగ్యమునకు ఈ పద్యాలు ఉదాహరణలు అయ్యాయి.

అట్లే ద్రౌపది పరాభవం చూచి కీచకునిపై ఆగ్రహోదగ్రుడైనపుడు ధర్మరాజు నోట తిక్కన పలికించిన పద్యం. భీముడు ఒక చెట్టును పెరికి – కీచకునిపైకి ఉరికేందుకు సంసిద్ధుడైనాడు. అప్పుడు ధర్మరాజు అంటాడు –

వలలుం డెక్కడ సూచె – ఒండెడ అసేవ్య క్ష్మాజముల్ గల్గవే
ఫలితంబై వర శాఖ లొప్పుచు అనల్పప్రీతి కావించుచున్
విలసచ్ఛాయ ఉపాశ్రిత ప్రతతికిన్ విశ్రాంతి కావింపగా
గల ఈ భూజము వంట కట్టియలకై ఖండింపగా నేటికిన్.

ఈ పద్యం "ఈ భూజము" వాచ్యార్థం ప్రకారం "చెట్టు" మాత్రమే గాని అసలు అర్థంలో పాండవులకు ఆశ్రయ ప్రదాతయైన విరాట రాజే.

"అస్తమేతి గభస్తిమాన్" (సూర్యుడు అస్తమించాడు). ఆలంకారికులు ఇచ్చే ఉదాహరణ అనుశీలించదగినట్టిది. ఇది సూర్యాస్తమయ వర్ణన అయితే వాచ్యార్థం.

ఆశ్రమవాసియైన బ్రహ్మచారికి సంధ్యావందన సమయం;

దొంగవానికి – వేరే అర్థం స్ఫురిస్తుంది.

నవోఢకు తాను వాసక సజ్జికయై ప్రియ సందర్శనమునకై నిరీక్షించాలని తహతహ స్ఫురిస్తుంది.

అతిథులు ఇంట నున్న ఇల్లాలికి వంట చేయాలని స్ఫురిస్తుంది. ఇన్ని వ్యంజక విశేషాలలో ప్రకరణానుబద్ధమైనది ధ్వని. ధ్వని ప్రధానమైనదే ఉత్తమ కవిత.

ఇక - వాడుక భాషలో ఈ చర్చాసారం సమీక్షించాలంటే భావం - ప్రాణం వంటిది. భాష - శరీరం వంటిది.

ప్రాణం లేని శరీరం - శవం!
శరీరం లేని ప్రాణం - దయ్యం!

కవితలు - శవాలు కాకూడదు. దయ్యాలు కాకూడదు. భాషపై మొగ్గు చూపిస్తే - కవితలు శవప్రాయాలు. భావంపై మొగ్గు చూపిస్తే దయ్యాలుగా తయారవుతాయి.

వాగర్థాల సంయక్ సంయోగం
అర్ధ నారీశ్వర స్వరూపం వలె -
ఆదర్శ కవిత్వం అవుతుంది.

ఇది కవులు అవశ్యం పాటించవలసిన అసిధారా వ్రతం.

## యుగళ కళలో యుగళ కళ

కవిత - ఏ భాషలో అయినా సరే వాగర్థ సాయుజ్యంతో కూడిన యుగళ కళ. ఇక తెలుగు కవిత - యుగళ కళలో అంతర్లీనంగా అవతరించే అంతర్యుగళ కళ. తెలుగు భాష, సంస్కృత పదాలు తెలుగుపదాలు అల్లిబిల్లిగా అల్లుకున్న జిలుగు పందిరి. తెలుగు కవితావధూటి కవలబిడ్డలను కడుపులో పెట్టుకొని కదలాడే గర్భిణీ సవిత్రి. దైనందిన వ్యవహార భాషలో కూడా తెలుగు పదాలు సంస్కృత పదాలు సులువుగా కలవవు. వ్యాకరణ శాస్త్రం - మిశ్రమ సమాసాలను నిషేధించి తలనొప్పిని దించుకొన్నది. అయితే - ఆర్యవ్యవహార దృష్టంబులు - దినవెచ్చము మొదలైన వాటిని - వ్యాకరణం అంగీకరింపక తప్పలేదు. పద్య కవిత, ఎదుర్కొనే సమస్య వేరు; వ్యాకరణ సమస్య వేరు. వ్యాకరణం అంగీకరించే పద్ధతి సరిపోదు. పోతన మహాకవి

"కొందరకు తెలుగు గుణ మగు - కొందరకును సంస్కృతంబు గుణ మగు - నేనందరి మెప్పించెద అయ్యై యెడలన్", అని ప్రతిజ్ఞ చేశాడు. నన్నయ విపుల శబ్దశాసన బిరుదం - ఈ సమన్వయంతోనే సార్థకమని నా అభిప్రాయం.

"నిండు మనంబు - నవ్య నవనీత సమానము - పల్కు దారుణా

ఖండల శస్త్ర తుల్యము" అనే పద్యంలో నిండు–మనంబు అనుమాట మాత్రమే తెలుగు. మనంబు తెలుగు బొట్టుపెట్టుకున్న సంస్కృతపదం. తెలుగు - సంస్కృత పదాలను కలపటంలో వ్యాకరణాతీతమైన ప్రజ్ఞ కావాలి కవికి. అంతేగాక - సంస్కృత భాషను - సర్వస్వామ్య సంకలితం తెలుగు చేసుకున్నట్లు భారతదేశంలో మరే భాష చేసుకోలేదు. ఆదికవి నన్నయ - సుదీర్ఘ సంస్కృత సమాసాలు కుప్ప తిప్పలుగా ప్రయోగించాడు. తిక్కన - ఎక్కువగా తెలుగు మాటలు వాడిన మాట నిజమేగాని తిక్కన పదప్రయోగకోశంలో సంస్కృత పదాలే అధిక సంఖ్యాకములు అని ఖండితంగా చెప్పవచ్చు. శ్రీనాథుని శృంగార నైషధంలో చాలా పద్యాలు తెలుగు వలువలు వేసుకున్న సంస్కృత శ్లోకాలే. జంకు గొంకులు లేకుండా, కవి సార్వ భౌముడు "గమికర్మీకృత నైకనీవృతుడనై వంటి' ప్రయోగాలు నిరాటంకంగా గుప్పించాడు. అతడు శివుని

జయ నీహార ధరా ధరేంద్ర తనయా చారుస్తనద్వంద్వ సం
శ్రీయ సంలగ్న పటీర కుంకుమ రజః సంపన్న బాహాంతరా"

అని సంబోధిస్తే అది తెలుగే. పెద్దన

అట చని కాంచె భూసురు డంబర చుంబి శిరస్సరఝ్ఝరీ
పటల ముహుర్ముహుర్లుఠ దభంగ తరంగ మృదంగ నిస్వన
స్ఫుట నటనానురూప పరిపుల్ల కలాప కలాపి జాలమున్
కటక చరత్ కరేణు కర కంపిత సాలము శీతశైలమున్.

అని వ్రాస్తే - అది చక్కని చిక్కని తెలుగు పద్యమే. సంస్కృతం - తెలుగువారికి వారసత్వంగా సంక్రమించిన తాతల నాటి సొత్తు. అబ్బ గంటు.

దానిని వదలుకోటం అనవసరం. అసాధ్యం. అంతేకాక అవివేకం. కొందరు కవులు అచ్చ తెలుగు కావ్యాలు వ్రాశారు. అచ్చ తెలుగు అందులో తత్సమాలు చేరవు గాని తద్భవాలు చేరుతాయి. ఒక అచ్చతెలు గేమిటి? సరే అచ్చతెలుగు అని

అంగీకరించినా మాట వరుసకు-సుగ్రీవుడు అన్న మాటను "మంచి మెడయెకిమాడు" అని చక్రమునకు "చుట్టు కత్తి" అనీ బ్రహ్మండమునకు బదులు "నలువగ్రుడ్డు" అనే ప్రయోగాలు కర్కశ కఠోరాలు. అచ్చతెలుగు కావ్యాలల్లో తెలుగు లేదు. కవిత లేదు.

అచ్చ తెలుగు కావ్యాలు కృతక కవితా గర్భస్రావాలు. ఆంధ్ర భాష అంటేనే తెలుగు సంస్కృత శబ్ద సమన్వయ సంధానం. ఈ సుకుమార సుందర విద్య - పద్యకవులు అందరికి ఉగ్గుపాలతో అలవడిన ప్రజ్ఞయే.

పోతన - ఈ సామరస్యం - తెలుగు సంస్కృత సమ్మేళనం - ప్రయత్న పూర్వకంగా సాధించాడు - దీనికి భాగవతం అంతా ఉదాహరణ ప్రాయమే.

గజేంద్రుడు మకరికి చిక్కినపుడు పోతన వ్రాసిన సంస్కృత సమాసపూరిత పద్యాలు అన్నీ తెలుగు కవితా శంఖంలో పోసిన తీర్థాలే.

పాద ద్వంద్వము నేల మోపి, పవనున్ బంధించి పంచేంద్రియో
న్మాదమ్మున్ పరిమార్చి, బుద్ధి లతకున్ మారాకు హత్తించి, ని
ష్ఖేదబ్రహ్మ పదావలంబన రతిం గ్రీడించు యోగీంద్రు మ
ర్యాదన్, నక్రము విక్రమించె కరిపాదాక్రాంత నిర్వక్రమై.

ఈ పద్యంలోని నాలుగు పాదాలు సంస్కృత శబ్దమయమయినా సరే పోతన కవితా వధూటి రెండు బాహువులు తెలుగు శంఖచక్రాంకితాలే గదా.

ధర్మరాజుపై తిక్కన - వ్రాసిన సీసపద్యం - శ్రీనాథుని సీసపద్య శిల్పమునకు ఒరవడి కల్పించటం మాత్రమే కాక అందులో జోడు గుఱ్ఱాల స్వారీగా సాగిన భావం భాషల సాయుజ్యం గంగా యమునా సంగమం వలె - భాసిస్తుంది.

ఎవ్వాని వాకిట ఇభమద పంకమ్ము
    రాజ భూష ణరజోరాజి నణగు!
ఎవ్వాని గుణ లత లేడు వారాసుల
    కడపటి కొండపై కలయ బ్రాకు!

ఎవ్వాని చారిత్ర మెల్ల లోకములకు
ఒజ్జయై వినయంబు నొరపు గరపు!
ఎవ్వాని కడ కంట నివ్వటిల్లెడు చూడ్కి
మానిత సంపద లీను చుండు!
అతడు - భూరిప్రతాప మహా ప్రదీప
దూర విఘటిత గర్వాంధకార వైరి
వీర కోటీర మణి ఘృణి వేష్టితాంఘ్రి
తలుడు కేవల మర్త్యుడే ధర్మ సుతుడు?

పెద్దన - వరూధినిచే సంస్కృతం పలికించగలడు. చక్కని చిక్కని తెనుగు మడికారాలు గుప్పించ గలడు. ఆమె

సద్యో వినిర్భిన్న సారంగ నాభికా
హృతమై పిసాళించు మృగ మదంబు"

అని గీర్వాణ సుందరాంగిగా పలికి హొయలు మీరి "ఇంతలలు కన్నులుండ తెరువెవ్వరి వేడెదు భూసురేంద్ర" - అని జాను తెలుగులో సరస సల్లాపాలకు దిగగలడు, పోతన వలే - తెలుగు పద్య శిల్పము - తెలుగు సంస్కృత సాయుజ్యమయమైన యుగళ కళ యని గుర్తించి చాటి చెప్పినవాడు - పెద్దన మహాకవి.

భువన విజయంలో శ్రీకృష్ణదేవరాయలు అయన కాలికి గండపెండేరం తొడిగే ముందు చెప్పిన ఉత్పల మాలిక సుప్రసిద్ధమైనది.

పూత మెరుంగులున్ పసరు పూప బెడంగులు చూపు నట్టివా
కైతలు? జగ్గు నిగ్గు నెనగావలె గమ్మున గమ్మనన్ వలెన్
రాతిరియుం బవల్ మరపురాని హొయల్ చెలి ఆరజంపు ని
ద్దా తరి తీపులంబలెను తారసిలన్ వలె లోదలంచినన్
ప్రాతిగ పైకొనన్ వలెను పైదలి కుత్తుక లోని పల్లటీ
ఌాత లవన్ వలెన్ - సొగసు కోర్కులు రావలె ఆలకించినన్;
చేతి కొలంది కౌగిలిని చేర్చిన కన్నియ చిన్నిపొన్ని మేల్
మూతలి చన్నుదోయి వలె ముచ్చట గావలె పట్టి చూచినన్

దా తొడ నున్న మిన్నుల మిటారపు ముద్దుల గుమ్మ కమ్మనౌ
వాతెఱ దొండ పండు వలె వాచవి గావలె పంట నూదినన్
గాతల తమ్మి చూలి దొర కైవసపుంజవరాలి పిబ్బపున్
మే తెలి యబ్బురంపు జిగి నిబ్బర పుబ్బగు గబ్బి గుబ్బ పొం
బూతల నున్నకాయ  సరిపోడిమి  కిన్నెర మెట్ల బంతి సం
గాతపు సన్న బంతె బయకారపు కన్నడ గౌళ పంతు కా
సాతత తాన తానల హసందివుటా డెడు గోట మీటు బల్
మ్రోతలునుం బలెన్ హరువు మొల్లము గావలె - అచ్చ తెన్గు లీ
రీతిగ - సంస్కృతమ్ము పచరించిన పట్టున - భారతీ వధూ
టీ తపనీయ గర్భ నికటీ భవదానన పర్వ సాహితీ
ధౌతిక నాటక ప్రకర భారత భారత సమ్మత ప్రభా
పాత సుధా ప్రపూర బహుభంగ ఘుమంఘుమ ఘుం ఘుమార్భటీ
జాతక తాళ యుగ్మ లయ సంగతి చుంచు విపంచికా మృదం
గాతత  తేహి తత్తహిత హోధిత దంధణు ధాణు ధింధిమ
వ్రాత లయానుకూల పదవారకుహూద్వహ హారికింకిణీ
నూతన ఘల్ఘలాచరణ నూపుర ఝూళ ఝుళీ మరంజ సం
ఘాత వియద్ధునీ చకచకద్వికచోత్పల సారసంగ్రహో
యాత కుమార గంధవహ హారి సుగంధ విలాసయుక్తమై
చేతము చల్లి చేయ వలె జిల్లున జల్ల వలెన్ మనోహర
ద్యోతక గోస్తనీ ఫల మధుద్రవ గోఘృత పాయస ప్రసా
రాతి రస ప్రసార రుచిర ప్రసరంబుగ సారె సారెకున్.

పెద్దన - వరూధినిని వర్ణిస్తూ

చూచి - ఝుళంఝుళత్ కటక సూచిత వేగ పదారవిందయై
లేచి, కుచంబులున్ తురుము లేనడు మల్లలనాడ అయ్యెడన్
పూచిన ఒక్క పోక నును బోదియ చేరి, విలోకన ప్రభా
వీచికలం దదీయ పదవీ కలశాంబుధి వెల్లిగొల్పుచున్.

అని పద్యం చెక్కాడు బంగారంలో నవరత్నాలు కలిపినట్లు తెలుగు, సంస్కృతం పదాలు కలబోసి.-

"అల్లసాని వాని అల్లిక జిగిబిగి" అనండి - "పాండురంగ విభుని పదగుంఫ నాలు" అనండి "ముక్కుతిమ్మనార్య ముద్దు పలుకు" అనండి - తెలుగు పద్యం - భావం - భాష కలిసిన అంతర్యుగళకళ. తిమ్మన పారిజాతాపహరణం లోని పద్యం -

అంతట ఒక్కనాడు ధవళాంబుజ నేత్రుడు వచ్చి రుక్మిణీ
కాంత గృహమ్ము లోన - శశికాంత శిలాతల వేది మీద, ఏ
కాంతము నందు నున్న చెలికత్తెలు గొల్వగ చేరి - జూద మ
త్యంత వినోద కేళిమెయి నాడుచు నుండగ అద్భుతమ్ముగన్.

ఇందు భావము - ముఖ్యమా;? భాష ముఖ్యమా! ఛందస్సు బిందు పూర్వక తకార ప్రాసయుతము ముఖ్యమా? అన్నీ రసాయనిక మిశ్రముగా కలిసినదే హృద్య పద్యశిల్పము.

తెలుగు పద్య శిల్పనైసర్గిక పటుత్వం - శ్రీనాథమహాకవి తెలిగించిన రెండు సంస్కృత కావ్యాల వల్ల నిరూపించబడింది. గౌడ డిండిమ భట్టు కంచు ఢక్క పగుల గొట్టించిన ఉద్దండ సంస్కృత పండితుడు శ్రీనాథుడు - తెలుగు కవి.

"నైషధం విద్వ దౌషధం
కాశీఖండ మయః పిండం".

ఈ విమర్శ సంస్కృత కావ్యాలకు అన్వయిస్తుంది. ఈ రెండు సంస్కృత ప్రబంధాలలోని సంస్కృత శ్లోకాలు ఇనుప గుగ్గిళ్ళు. తెలుగు పద్య శిల్ప మహిమచే రస గుళికలుగా మారిపోయాయి.

తెలుగు పద్య శిల్ప విలసన్మహిమ చేత
అమృత మయ్యె - విద్యదౌషధమ్ము -
తడిసి తెలుగు పలుకుబడి - అయః పిండమ్ము,
తేనె పట్టు వోలె - తియ్య నయ్యె.

కావ్యపీఠికలలో కృతిపతి ప్రశంసా పద్యాలు కవి పెదవుల నుండి వెలువడునవే గాని ఎడద లోతులనుండి పొంగి పోయేవికావు. అయిన కృతి ప్రధాన పద్యాలు గూడ తెలుగు పద్య శిల్ప వీథులలో జగజ్జేగీయమానంగా వెలుగొందాయి.

తెలుగు పద్యశిల్పము - భావము - బాష - ఛందస్సుకు ముయ్యేల గుట్ట.

తెలుగు పద్య శిల్పం అంటే భాష - భావం - ఛందస్సు సంగమించే త్రిభుజం మాత్రమే కాదు. దానికి గరిమనాభియైన కేంద్ర చైతన్య బిందువు - "రసం". అది భాషకు అగమ్యం. భావానికి అతీతం. ఛందస్సుకు అందని ఆకాశం. ఆ రస సాక్షాత్కార సమయంలో త్రిభుజ బుజా రేఖలు అంతర్ధానం అవుతాయి.

గంగా సంగమ మిచ్చగించునె? మదిన్ కావేరి దేవేరిగా
అంగీకార మొనర్చునే? యమునతో ఆనందమున్ పొందునే?
రంగత్తుంగ తరంగ హస్తముల ఆ రత్నాకరేంద్రుండు నీ
అంగం బంటి సుఖించు నేని గుణభద్రా! తుంగభద్రా నదీ.

ఈ పద్యం పాండురంగ విభుని పదగుంఫనానికి ఉదాహరణ ప్రాయం. అయితే తెనాలి రామకృష్ణకవి వ్రాసిన ఒక చిరు కందపద్యంలోని కేంద్ర చైతన్య బిందువులో రస సాక్షాత్కారం లభిస్తుంది.

భ్రష్టుడైన బ్రాహ్మణుడు నిగమశర్మ - ఒకనాడు చుక్క తెగి పడిన వడువున ఇంటికి వస్తాడు. రాక రాక వచ్చిన భర్తకు అతని భార్య స్వాగతం చెపుతుంది.

'ఆ పైదలి ప్రాణేశ్వరు
శ్రీపాదద్వయి గడిగెను శీతల వారిన్

అందులో విశేషం ఏముందీ? పత్ని, పతి పాదాలు కడిగింది. అయితే ఆ పాదాల మీద తడి ఆరిపోయింది. ఎట్లాగ ? ఎవరు తుడిచారు ?

వ్యాపృత నిజ నిశ్వాసజ
తాపము చేత కొంత కొంత తప్తము కాగన్.

భార్య విడిచిన వేడి వేడి నిట్టూర్పుల గాలివలన, భర్త పాదాలమీది తడి ఆరిపోయినదట!

పద్య శిల్ప సౌష్ఠవరేఖలు - దేవళంలోని ప్రాకారకుడ్యాలపై భాసించే శిల్ప పరంపరలు.

రసం - గర్భగుడిలోని మూలవిరాట్టు.

దేవాలయం చుట్టూ కన్ను చెదిరే శిల్పాలు ఉండవచ్చు. గర్భగుడిలో కన్పించే దేవుని విగ్రహం. అది ఒక రాయి కాదు - రప్ప కాదు.

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకునకు ఒక ప్రతీక. రసం యన్నిష్ఠము? సహృదయ నిష్ఠము. రస సాక్షాత్కారం లభించవచ్చు.

'రసో "వైసః" అది రసద్యః పనిర్వృతి;
వా చామగోచరము
అనుభవైక వేద్యము, అల మతి విస్తరేణ.

తిక్కన - విరాట పర్వాన్ని శిల్పసుందరంగా నిర్మించాడు. ఒక సన్నివేశం.

రాణిగారైన అక్క సుదేష్ణ - తమ్ముడు బలగర్వాంధుడైన కీచకుని అదుపులో పెట్టలేకపోతుంది. అతడు సైరంధ్రిగా నున్న ద్రౌపదిపై మరులు గొని - అక్కగారి తోడ్పాటును అర్థించలేదు - ఆశించాడు. ఆమె ఏమి చేయగలదు? ఆమె మనస్సులో పరిపరి ఆలోచనలు సందడి చేశాయి. అపుడు తిక్కన వ్రాసిన కంద పద్యం -

"అని మనమున తలపోయుచు
తన తమ్ముని నల్ల నెత్తి దందడి దొరగం
జనుదెంచు అశ్రు పూరము
కనుగొనలన్ మ్రింగికొనుచు - కామిని పలికెన్".

నోటిలోని లాలా జలమును మ్రింగటమే కష్టము కదా. గోర్వెచ్చని ఈ బాష్ప బిందువులను కనుగొనలలో మ్రింగటమా?

ఇచట భాష - భావం - ఛందస్సు అన్నీ ఉన్నాయి. ఈ త్రిభుజరేఖలకు అతీతంగా కేంద్ర చైతన్య బిందువు "రససిద్ధి" కన్పించుచున్నది.

తెలుగు పద్య శిల్పము - అని అభివర్ణించేటప్పుడు మరువగూడని సత్యము - ఛందము - భాష - భావము - ఇవి అన్నీ మెట్లు కాని మేడ కాదు. పద్యకవిత అనే పద గుంఫనంలో పద్యశిల్ప రేఖలు సోపాన పరంపరలు. కవిత మేడ. మేడ చేరేందుకు మెట్లు అవసరమే.

తెలుగు కవితకు లోతైన పునాది ఉన్నది. తెలుగునేలలో భారతం అవతరించటానికి పూర్వం - 'కాసట బీసటే చదివి గాథలు త్రవ్వెడివారట' తెలుగువారు. కాసట అంటే గాథా సప్తశతి. బీసట అంటే బృహత్కథ. రెండూ ప్రాకృత గ్రంథాలే. తెలుగు కవితకు పునాది ప్రాకృత కవిత. తెలుగు పద్య శిల్ప రేఖలు ప్రాకృత కవితలో నుంచి ఉదయించినవే. కందం - సీసం - ఆటవెలది - తేటగీతి - మొదలైన ఛందస్సులకు పునాది సంస్కృతంలో వెదకి లాభం లేదు. ఎందుచేతనంటే అవి ప్రాకృతంలో నుండి పుట్టినట్టివి.

వైదిక సంస్కృతం మాట అటుంచి పరిశీలిస్తే "సంస్కృతం" అనే భాష - ప్రాకృతముల నుండి ఏర్పడిన సంస్కారమే కావచ్చు.

గాథా సప్తశతి - రహః ప్రధానమైన కవిత.

ఉదాహరణకు ఒక గాథకు (అనువాదం)

"పాంథ కిశోర! నీ చిరుత ప్రాయము తెల్పెడి మోము; చేతి ఉద్
గ్రంథము చూడ వైద్యుడవు గావలె! జ్యోతిష పండితుండవో!
అంధత మూల్గు అత్త - గృహ మందు; నవోఢను; వార్ధి దాటి, సౌ
గంధిక వర్తకుం డగు మగం డరుదెంచు దినమ్ము తెల్పుమీ."

ఆమె నవయౌవనాంగి, నవోఢ.

లలిత కళ – ఏది అయినా చేసే పని ఒక హృదయం మరో హృదయానికి తన అనుభూతిని అందించటమే. అయితే ఇది సుకుమార సుందరంగా జరగవలసిన ప్రక్రియ. భౌతిక పదార్థాలను ఎంతగా విడిచిపెట్ట గలిగితే ఆ లలిత కళ అంత గొప్పది. శిల్పానికి శిల కావాలి. శిల్పం కంటె చిత్ర లేఖనం స్థాయి ఉన్నతం. చిత్ర లేఖనం కంటె గానం స్థాయి ఉన్నతం. గానం కంటె కవిత స్థాయి గొప్పది. కవిత వాడే భౌతిక పదార్థం ఏది? కవిత–కేవలం హృదయానుభూతి మాత్రమే. విద్యలో మెదడును వాడవచ్చు. ఇక హృదయానుభూతి వెల్లడించడానికి భాష. భాష తెలిపే భావం. అవి భూలోక పరిధిని దాటేకే. ఆ భాషను – భావాలను గూడ దాటగలిగి అనుభూతిని అభివ్యక్తం చేయగలిగితే – అది ధ్వని. రసోపాసన.

ఆంధ్ర శాతవాహన చక్రవర్తి–హాలుడు వ్రాసిన ఒక గాథ. ఈ అనుభూతిని చక్కగా చిక్కగా ప్రస్తావించింది సంస్కృత సారస్వతం–"సంగీత సారస్వత విముఖః పుచ్ఛ విషాణహీనః పశుః" సంగీత సాహిత్యాలపై అభిరుచి లేని వానిని కొమ్ములు – తోక లేని ద్విపాద పశువు అని గట్టిగా తిట్టి వదలి పెట్టింది. షేక్స్పియర్ మహాకవి" సంగీత రసికుడు కాని వానిని సాహిత్య ప్రియుడు కాని వానిని 'ఉరి' తీయమన్నాడు ఛలోక్తిగా. అయితే హాలుని అధిక్షేపణ ఎంత హృదయంగమంగా ఉందో అవధరింప వేడికోలు.

"సరస కవిత యన్న – సంగీత కళ యన్న
వ్యంగ్య మన్న – లలిత హాస్య మన్న
అవని విముఖు లున్న – అదియె వారికి శిక్ష;
వేరు శిక్ష ఇంక వేయ నేల".

'మరణ శిక్ష' కంటె అట్టివారి బ్రదుకు దుర్భర సజీవసమాధి అని అంతరార్థం.

తెలుగు పద్య శిల్ప సౌష్ఠవం – శతకాలలో ప్రత్యేకంగా కనిపిస్తుంది. బిందు పూర్వక 'ద'కార ప్రాసలతో "ఇందూ నందుని మంద నుండి గద నీ వేతెంచుటల్ రాకయుణ్" అనే మకుటంతో శతకం అంతా ఉంది. అనగా బిందుపూర్వక దకార ప్రాసలు నాలుగు వందలు పొందికతో సమకూర్చటం అంటే యావత్ భాషా క్షీర సాగర మథనం చేయటమే. మకుటాన్ని యతికి అనుసంధించిన వారు కొందరు.

ఆ నూతన వధువును విడిచి సుగంధ వర్తకుడైన భర్త - సముద్రాలు దాటి విదేశాలకు వెళ్ళిపోయాడు. ఆ విరహిణికి ఒక మనోహర రూప యౌవనోద్భాసితుడైన విద్వద్యువకుడు తారసిల్లినాడు. ఆ లేత జవరాలు ఆ నవయువకునితో అన్న మాటలు పై పద్యం.

"బాటసారిగ విచ్చేసిన ఓ నవ యువకుడా, నీ మొగము పడుమ పసినిగ్గులు చిమ్ముమన్నది. నీ చేతిలోని పెద్ద పుస్తకం చూస్తే, నీవు నీ వయసుకు మించిన మేటి విద్వాంసుడవు అయినట్లు తోస్తుంది.

"నీవు వైద్యుడవా? జ్యోతిష్కుడవా?" అని అడిగింది.

ఒకవేళ ఆతడు వైద్యుడే అయితే ఆమె ముసలి అత్తగారు అంధత్వంతో మూల్గుచ మూల పడి ఉంది - ఆమెకు అతడు వైద్యం చేయాలట వచ్చి. అత్తగారి మీద ఆ కొత్త కోడలికి ఆహా ఎంతటి ప్రేమ.

ఒకవేళ - ఆతడు జ్యోతిష్కుడే అయితే!

విరహార్త యైన తన్ను విడిచి విదేశాలకు పోయిన తన భర్త - తిరిగి సముద్రాలు దాటి తన దగ్గరకు ఎప్పుడు వస్తాడో చెప్పాలట. ఎక్కడున్నాడో! ద్వీపాంతరగతుడైన భర్త-అంత సులువుగా వస్తాడా? ఆ సంగతి ఆమెకు తెలియదా?

తానా విరహిణి. నవ యౌవనవతి.

ఆతడా విద్వాంసుడు. యువకుడు.

తన ఇంటిలో అత్తగారు ఉన్నది కానీ ఆమె ముసలిది. కన్నులు కన్పించని గ్రుడ్డిది. భర్త ఇంటిలో లేడు. ఊరిలోనే కాదు గదా దేశంలో గూడ లేడు. ఇందు ప్రత్యక్షరము మాటున తొలుకాడే కనువేదురు - అనురాగ గర్భితమైన ఆహ్వానం. సహృదయ హృదయైక వేద్యం.

కవితలో వాచ్యం అయిన భావానికి అతీతమైన 'ధ్వని' ఉండాలని ఆలంకారికుల నిర్దేశం. ఆంధ్ర సాహితీ సంప్రదాయం - 'ధ్వని'.

తెలుగువారు రసోపాసకులు. "ధ్వని" ప్రియులు.

దాశరథీ శతకంలో 'దా' యతిస్థానంలోనిది. 'శ్రీకాళహస్తీశ్వరా' శతకంలో శ్రీకారం యతిస్థానంలో పడింది. ధూర్జటి - ఛందస్సులో శః సాము గరిడీలు అవలీలగా నిర్వహించాడు.

ఏ లీలన్ నుతియింప వచ్చు నిను - ఉపమోత్ప్రేక్షా ధ్వని వ్యంగ్య శ
బ్దాలంకార విశేష భాషల కలభ్యం బైన నీ రూపమున్;
చాలుం జాలు - కవిత్వముల్ నిలుచునే సత్యంబు వర్ణించుచో!
ఛీ! లజ్జింపరు గాక మాదృశ కవుల్ - శ్రీ కాళహస్తీశ్వరా.

భాస్కర శతకంలో అసిధారాప్రాయమైన యతి నియతి లేదు. చిట్టచివరి మకుటం అంత వేధించదు. అయినా సరే ఆ శతక కవి పద్య రచనలో శిల్ప సౌష్ఠవ సౌందర్యం ఎంతగా ఆరాధించాడో చాలా పద్యాలలో కన్పిస్తుంది. బిందుపూర్వక డకారప్రాసలో ఉన్న పద్యం ఉదాహరణకు -

పండితు లైన వారు దిగువం బడి యుండగ అల్పు డొక్కడు
ద్దండత పీఠ మెక్కిన బుధ ప్రకరంబుల కేమి ఎగ్గగున్?
కొండొక కోతి - చెట్టుకొన కొమ్మల నుండగ - క్రింద గండ భే
రుండ మదేభ సింహ నికురుంబము లుండవె చేరి భాస్కరా.

ఏ పద్యంలో అయినా - శిల్ప సౌష్ఠవ సౌందర్యం మాత్రమే ఎత్తిచూపటం అంత సులువైన పని కాదు. ఛందస్సు - రైలు పట్టాల వంటిది. పట్టాలు లేనిది అడుగైన కదలదు ఇంజను. భాష-భావం మాట అటుంచి, పూర్వ తెలుగు కవులు అందరూ ఛందస్సును ఉపాసించినవారే. కేవలం రసైక దృష్టిగలవాడు అనుకొన్న తిక్కన గూడ తెలుగు ఛందస్సుకు ఏకాంత భక్తుడే.

ఈనాడు తెలుగు ఛందస్సును అధిక్షేపించే వచన కవులు అభ్యుదయ దిగంబర కవులు సయితం పలుచోట్ల యతి ప్రాసలు-యమక గమకాలు- తమ రచనలలో ప్రయోగించుచున్నారు.

అరయ వచ్చు - సహజ యతులు ప్రాసలు పెక్కు;
వచన కవుల యందు - వక్త లందు;
"ధ్యాస" కానుపించు - తర చనుప్రాసపై;
జయము జయము తెలుగు ఛందమునకు.

ఇది పరోక్షంగా పలువురు వచనకవులు తెలుగులో ఛందస్సుకు జేజేలు పలికి కప్పం చెల్లించుటయే కద,

తాళ బద్ధ మైన, లాలిత్య గతి గల్గి;
నడక - సొంపు లొలుకు నాట్య మౌను;
శ్రవణ సుభగ మైన - ఛందో నియతి గల్గి;
పలుకుబడుల కూర్పు - పద్య మౌను.

ఛందస్సువల్ల - ఏ ఇతర లాభం లేకపోయినా - పద్యం సలువుగా కంఠస్థం చేయవచ్చును గదా.

నిరక్షరకుక్షులు కూడ తెలుగు నాటకాల లోని పద్యాలు గడగడా రాగ యుక్తంగా చదువగలరు. నాటకాలలోని ప్రతి పద్యంలో కొంతమేరకు శిల్ప సౌష్ఠవం ఉంటుంది. నాటక కవులకు బిందుపూర్వక ప్రాసపై ప్రీతి ఎక్కువ. ధర్మరాజు - ఉద్యోగ విజయాల నాటకంలో

సంధి యొనర్చి మా భరత సంతతి గావుము లేద యేని - గ
ర్వాంధుల ధార్తరాష్ట్రుల సహాయులతో దునిపింపు మో జగద్
బాంధవ - రెండు కర్జముల భారము పెట్టితి మయ్య నీ భుజ
స్కంధము నందు - తారసిలు గావుత మాకు - యశంబొ రాజ్యమో.

బిందుపూర్వక ధకార ప్రాస ముక్తాయింపు ఈ పద్యంలోని శిల్పసౌష్ఠవ రేఖలలో ఒకటి.

అట్లే శ్రీకృష్ణుడు రాయబారంలో

జెండాపై కపి రాజు, ముందు సిత వాజి శ్రేణియున్ బూన్చి - నే
దండంబున్ కొని తోలు స్యందనముపై నారి సారించుచున్
గాండీవమ్ము ధరించి ఫల్గునుడు - మూకన్ చెండుచున్నప్పు డొ
క్కండున్ నీ మొర ఆలకింపడు - కురుక్ష్మానాథ! సంధింపగన్.

ఉద్యోగ విజయములలో తెలుగు పద్యాలు వినటానికి పలుసారులు శ్రోతలు టికెట్లు కొని వెళ్లి చూస్తున్నారు. ఆ ఉద్యోగ విజయాలే - ఆ పద్యాలు వచనాలలో పెట్టి ఆడితే - టిక్కట్లు లేకుండా కూడా ఆడినా సరే ప్రేక్షకులు ఉంటారా?

వచన మందు వ్రాయ - పద్య తాత్పర్యమ్ము;
తొలుత తూగు ఊపు - తొలగిపోయి;
మల్లె పూవు లోని - మంచు బిందువు లేరి
చేత బట్టి నట్లు - చెడును - సొగసు.

తెలుగులో అవతరించిన ప్రబంధాలలో సర్వత్ర శిల్ప సౌష్ఠవం కనిపిస్తుంది. అవతారికలలో అంకితం పద్యాలు కూడ సహృదయులు కంఠస్థం చేయటానికి కారణం ఏమిటి?

ప్రబంధ కవులు అందరు పద్య శిల్ప సౌష్ఠవం కోసం సాహితీ తపస్సు చేసిన వారే. వసుచరిత్రకారుడు రామరాజభూషణుని చేతిలో తెలుగు పద్య సౌష్ఠవం పరాకాష్ఠ చెందింది అని చెప్పవచ్చు. పద్యశిల్పంలో ఛందస్సు ఏకదేశం మాత్రమే. శ్రీకృష్ణదేవరాయలు సాహితీ సమరాంగణ సార్వభౌముడైతే - రామరాజ భూషణుడు సంగీత సాహిత్య చక్రవర్తి అని చెప్పవచ్చు.

ఆంధ్ర కవితా రసధాని - దక్షిణ దేశానికి తరలి వెళ్లినపుడు - తంజావూరు మధుర పుదుక్కోటలలో గూడ పద్య కవితలు అవతరించాయి. ఎన్నో పిల్ల వసు చరిత్రలు ఉద్భవించాయి! ఆంధ్ర వాఙ్మయంలో యుగ యుగాంతరాలలో ఎన్నో మార్పులు వచ్చాయి. అయితే - తెలుగు పద్య సౌష్ఠవం మాత్రం కాల ప్రవాహానికి ఎదురీది నిలిచింది. తెలుగులో అవతరించిన చాటువులు అన్నీ ఛందోబద్ధమైన పద్యాలే. తెలుగు పద్యాలు త్రిగాములు. నేల మీద పరుగెత్తగలవు - గగనంలో ఎగుర గలవు - నీటి మీద ఈదగలవు. తెలుగు పద్యం యొక్క విశిష్టత - ఇంకో విధంగా ఋజువయింది. గణితం, జ్యోతిషం, చరిత్ర శాస్త్రాలు ఛందోబద్ధమైన పద్య కవితలుగా అవతరించటం విశేషం. పావులూరి మల్లన గణితం - పద్య ప్రబంధమే.

## అవధాన కళ

ఆంధ్ర భాష సున్న దష్టావధానమ్ము,
వేరు చోట లేదు వెదికి చూడ;
తెలుగు తళుకు బెళుకు - స్థిర తటిల్లత వోలె
విశ్వ మెల్ల - వెల్లి విరియ చేయు.

అష్టావధానాలు - శతావధానాలు ఆంధ్ర సంస్కృతికి కల్పించిన వైలక్షణ్యం సుప్రసిద్ధం. ప్రస్తుతం ప్రపంచంలో ఏ ఇతర భాషలలోనూ ఈ ప్రక్రియ కన్పించదు.

అవధానం అనే మాటకు అర్థం - ఏకాగ్రత. తదేక నిష్ఠ.. ఛందోబద్ధమైన కవిత్వం-తీరికగా కూర్చుండి వ్రాయటమే కష్టసాధ్యం. ఇక ఆశువుగా-పృచ్ఛకుల దాడిని ఎదుర్కొంటూ చెప్పటం మరీ కష్టం. వాఙ్మయ రంగంలో- అడ్డుకట్టడాలను దూకి దాటుతూ వేగంగా ముందుకు దూసుకుపోయే పరుగు పందెం ఇది.

అద్యతనాంధ్ర కవి ప్రపంచ నిర్మాతలుగా పేరుకెక్కిన తిరుపతి వేంకట కవులు తెలుగు అవధాన ప్రక్రియలో ప్రాతఃస్మరణీయులు. వారి సమకాలీనులు - అర్వాచీనులు సమర్థులైన అవధానులు ఆంధ్రదేశంలో ఎందరో ఉన్నారు. చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు ఆస్థాన కవిగా నియుక్తులైనప్పుడు జరిగిన సన్మాన సభకు అధ్యక్షత వహించినవారు కట్టమంచి రామలింగారెడ్డిగారు. ఆయన ఆనాడు అన్న మాట - "ఇచ్చట విజయవాడలో ఎచ్చట చూచినా కవులే. ఆహా - ఎంతమంది కవులున్నారు ఆంధ్ర సీమలో! ఇప్పుడు ఒక రాయి ఆకాశంలోకి విసిరితే అది ఎవరో ఒక కవి నెత్తి పైనే పడటం తథ్యం". ఆయన విసిరింది రాయి కాదు. ఛలోక్తి మాత్రమే.

అవధానికి ఆయువు పట్టు ఆశు కవిత. శతఘంటకవులు - గంటకు నూరు పద్యాలు ఛందోబద్ధంగా ఆశువుగ చెప్పగల కవులు ఆంధ్ర చరిత్రలో పలువురు. శతావధానం ఆశుకవితా ప్రక్రియ. నూరు మంది పృచ్ఛకులు కోరిన శీర్షికలపై అవధాని ఆశు కవిత చెప్పాలి.

అష్టావధానం శతావధానం కంటె గూడ కష్టమైన ప్రక్రియ అంటారు. అందులో అష్టాంగాలు - 1. సమస్యాపూరణం - 2. ఆశు కవిత 3. లోకాభి రామాయణం 4. చదరంగం లేదా ఘంటా నినాదం 5. నిషేధాక్షరి 6. వ్యస్తాక్షరి 7. దత్తపది 8. గణితం.

సమస్యాపూరణం అష్టావధానంలో హృదయంగమమైన అంశం. ఒక చరణమో - చరణైకదేశమో పృచ్ఛకుడు - "సమస్యగా" అవధానికి ఇస్తాడు. ప్రతి సమస్యలో ఒక వైరుధ్యం - వైచిత్రి అంతర్గర్భితంగా ఉంటుంది. సమస్యాపూరణం ఒక విచిత్ర విరోధాభాసంగా పరిణమిస్తుంది. "సమన్వయ సాధన"- సమస్యకు జీవనాడి. సమస్యాపూరణం - అవధానాలలోనకే గాక సారస్వత సామాజిక జీవితంలో గూడ సమున్మేషం కల్పించటం సహజం. శ్రీకృష్ణదేవరాయల భువన విజయంలో రాయలవారికి వింజామర వీచే రజక మహాశయుడు - వీధిలో తెనాలి రామకృష్ణునకు ఇచ్చిన సమస్య "కుంజర యూథమ్ము దోమ కుత్తుక చొచ్చెన్". తెనాలి రామకృష్ణుని పూరణ

గంజాయి త్రాగి తురకల
సంజాతుల గూర్చి - కల్లు చవి గొన్నావా!
లంజా కొడుకా! ఎక్కడ
కుంజర యూథంబు దోమ కుత్తుక చొచ్చెన్?

ఆ సమస్యనే భువనవిజయ సభలో రాయలవారే రామకృష్ణ కవికి ఇచ్చినప్పుడు అతని పూరణ వేరు -

రంజన చెడి పాండవు లరి
భంజనులై విరటు గొల్వ పాల్పడి రకటా!
సంజయ! విధి నే మందును?
కుంజర యూథమ్ము - దోమ కుత్తుక చొచ్చెన్.

ఈ పూరణలోని ఆశు కవితా ముద్ర వేత్తలకు విదితపూర్వమే. అవధాన పద్యాలలో కవిత్వం పాలు తక్కువ అని నిరసించేవారు సైతం ఈ పూరణ విన్నప్పుడు తల లూపక తప్పదు. అసలు భారతంలో గూడ ఇంత రసవత్ పద్యం ఉన్నదా? అనిపిస్తుంది.

'అరయంగా కర్ణు డీల్గె ఆర్గురి చేతన్' - ఒక సమస్య. ఒక అవధాని - శ్రీకృష్ణుడు ఆ మాట అర్జునునితో అన్నట్లుగా మలచి పూరించాడు.

వర వర! నీ చే, నా చే,
వర మడిగిన కుంతి చేత - వాసవు చేతన్;
గురు చేత; శల్యు చేతను
అరయంగా కర్ణు డీల్గె - అర్గురి చేతన్!

"భల్లూకపు కడుపులోన - భానుడు క్రుంకెన్" - సమస్యకు పూరణ

అల్లింత ప్రొద్దుకాడను
విల్లుం గొని వేటకాడు వేయ దొడంగెన్;
చిల్లంప కోల చిక్కెను
భల్లూకపు కడుపులోన; - భానుడు క్రుంకెన్.

"ఎలుకలు తమ కలుగు లోని కేనుగు నీడ్చెన్".

ఇలలో ఇద్దరు రాజులు
మలియుచు చదరంగ మాడి మాపటి వేళన్;
బల మెత్త మరచి పోయిన
ఎలుకలు తమ కలుగు లోని కేనుగు నీడ్చెన్.

"రావణ కుంభకర్ణులకు రాముడు పుట్టె గుణాభిరాముడై." కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారి పూరణ

చేవ నొసంగ జాతికిని - జీవ మొసంగగ బండ రాతికిన్,
సేవ నొసంగ కోతికిని - శిక్ష నొసంగగ చుప్పనాతికిన్
దేవ మునీంద్ర శాపమును తీరిచి "ముక్తి" నొసంగగా
రావణ కుంభకర్ణులకు;- రాముడు పుట్టె గుణాభిరాముడై.

"రక్తము పీల్చెదన్ - చెలువ - రమ్మని పిల్చె ప్రియుండు ప్రేమతో" - డాక్టరు ప్రసాదరాయ కులపతిగారి పూరణ.

యుక్త వయస్సు గల్గి యువ యొక్కడు ప్రేమను గోర, తద్రతా
సక్త మనస్కయైన అభిసారిక - చీకటి త్రోవ పోవుచో
ప్రాక్తన కర్మచే కరచె పాముట గాటిడి, తద్విషాక్తమౌ
రక్తము పీల్చెదన్-చెలువ! రమ్మని పిల్చె ప్రియుండు ప్రేమతో.

దత్తపది - సమస్య వలెనే జటిలమైనట్టిది. నాలుగు పదాలు పృచ్ఛకుడు ఇస్తాడు. అవధాని వాటిని కథానుగుణంగా సమన్వయించి పద్యం చెప్పాలి. అసందర్భ పదాలకు "సందర్భ శుద్ధి" సమకూర్చాలి ఆశువుగా. ఉదాహరణకు గోలకొండ - మాలముండ - పూలదండ - కొత్తకుండ. సుప్రసిద్ధపూరణ.

ఓయి ధృతరాష్ట్ర! నీ కొడు కుత్త గోల
కొండ, లోక నాశన మాల ముండ నేల?
భండనమున గెలిపింతు పాండు సుతుల,
ఉదరమున పూల దండ - రేకొత్త కుండ.

ఈ మాటలు శ్రీకృష్ణుడు పలికి నట్టి వని సందర్భం.

రండ-ముండ-కుండ-బండ

రామాయణ పరమైన పూరణ.

రండ టు పారిపోవకుడు - ప్రస్తరముల్ గొని తెండటంచు రా
ముండని నంత - వానర సమూహము లెల్లను జంకు గొంకు లే
కుండ గ మోసి తెచ్చి యటు లొయ్యన భారము నెంచకుండ, పెన్
బండ లు చేర్చి కట్టిరి - శుభస్థితి సేతువు - స్వామి మెచ్చగన్.

భారత పర మైన పూరణ.

రండ టు పారిపోవకుడు - రండిటు చావక తప్ప దంచు - భీ
ముండన కీచకానుజ సమూహము లెల్లరు వేగ సిగ్గు లే
కుండ గ పారిపోయి అటు లొయ్యన దాగిరి చెట్టు గుట్ట - పెన్
బండల మాటునన్ బెదరి ప్రాణ భయంబున ఆర్తమూర్తులై.

దోసె - పూరీ - వడ - సాంబారు

పూరణ - శతావధాని శ్రీ మాడుగుల నాగఫణి శర్మ

జడలో దోసెడు మల్లె పూలు తురిమెన్ సౌందర్య మొప్పారగా
నడయాడెన్ ఘలు ఘల్లనన్ హొయలు చిందన్ జాజి పూరీ తి, పా
వడ అట్టిట్టులు చిందులాడి పడగా - భవ్యాత్మ యైనట్టి ఆ
పడతిన్ పార్వతి పెండ్లి యాడితివి! - సాంబా! రుద్ర! నీ సాటియే.

విభవ - విక్రమ - బహుధాన్య - దుందుభి

రావిపాటి లక్ష్మీనారాయణ పూరణ.

అవనిజతో మహా విభవ మారగ విక్రమశాలి యైన రా
ఘవు డభిషిక్తుడయ్యె - పురి గారముతో చతురబ్ధి వారితో
నవ బహు ధాన్య సంపద దలిర్ప - విభీషణ సోదరార్కజుల్
పవన సుతుండు గొల్వగ - దివౌకస దుందుభి మారుమ్రోగగన్.

ఆంధ్రుల వినోద కాలక్షేపాలలో గూడ పద్య కవితలు చోటుచేసుకున్నాయి.

ఒక పొడుపు కథ -

కాలు చేయి లేదు - కడుపు కొంచెము గాదు;
కంట కూడు కుడుచు కలహ కంఠి;
అంటిన మొర వెట్టు - అది ఏమి చోద్యమో!
దీని భావ మేమి? తిరుమలేశ! = [మద్దెల]

వినోద ప్రశ్న

రాము డెవ్వారితో రావణు మర్దించె?
వర వాసుదేవుని పురము దెద్ది?
రాజ మన్నారుచే రంజిల్లు శర మెద్ది?
వెలయ కానుగ వంటి విత్తదెద్ది?
అల రంభ కొప్పులో అలరు మాలిక యేది?
ఏ తోట నరునిచే ఇంపు మాసె?
సీత కుంకువ గాగ చేసిన శర మెద్ది?
సభ వాగి నవ్వించు జాణ ఎవ్వ
డన్నిటికి చూడ ఐదేసి అక్షరమ్ము
లొవర ఇరు దెస చదివిన ఒక్క పేరె!
సమ్మతిగ చెప్ప సర్వజ్ఞ చక్రవర్తి
చెప్ప లేకున్న నగుదు నే చిన్ని నగవు.

సమాధానాలు : 1. లోక మూకతో 2. రంగ నగరం 3. లకోలకోల 4. జంబీర బీజం 5. మందార దామం 6. నంద సదనం 7. పంచాస్య చాపం 8. వికట కవి.

పద్య విద్య – ఆంధ్ర సంస్కృతికి జీవనాడి.

## కవిత్వం – కట్టుకథలు

"కాళ్ళు లేక – కట్టు కథలు – కన్నులు లేక
దెసలు చుట్టి ఎట్లు తిరిగి వచ్చు?
మురిసి పోయి ప్రజలు – ముత్యాల పల్లకీ
పైన–ప్రక్క ఊరు–పంపగలరు. – ప్రగతి గీత

లోకంలో కవితాకళ గూర్చి కొన్ని కట్టు కథలు ప్రచారంలో ఉన్నాయి. అవి తల–తోక లేని కల్పనా కథలు అని అందరకు తెలుసు. అసలు కట్టుకథలు అన్నీ అట్లాంటివే. అయితే కట్టు కథకు "ఆత్మ" ఉంటుంది. అది నిత్య సత్యం.

"కథకు కాళ్ళు లేవు" – అనే సామెత తెలుగులో ఉంది. కాళ్ళే కాదు కన్నులు గూడ ఉండక పోవచ్చు. అయితే ఆ కట్టుకథ పలుమారులు భూ ప్రదిక్షిణాలు చేస్తుంది. ఆ అత్యద్భుత గమన శక్తి కట్టు కథకు ఎట్లా వస్తుంది. కట్టు కథకు ఆత్మ అయిన నిత్యసత్యాన్ని సందర్శించిన ప్రజలు – ఆ కథను ముత్యాల పల్లకీ మీద ప్రక్క ఊరు పంపిస్తారు. ఒక ఊరునుండి మరో ఊరుకు ఆ విధంగా వెళ్లి – భూ ప్రదక్షిణాలు చేయగలదు కట్టు కథ.

కవితా కళను గూర్చి లోకంలో రెండు చక్కని కట్టు కథలు ఉన్నాయి. అనగా అనగా ఒక అమ్మాయి. ఆ అమ్మాయి తల్లి లేని పిల్ల. సవతి తల్లి, కవితా కన్యకను సరీగా చూడక – హింసించి – బాధలు పెట్టి కొట్టుతూ ఉంటుంది. పాపం కవిత ఏడుస్తుంది. అయితే ఆమె కన్నీరు – ముత్యాలుగా మారిపోతూ ఉంటాయి. ముత్యాల విలువ అందరకూ తెలిసిందేగద. సవతి తల్లి – ఆ ముత్యాలు ఏరు కుంటుంది. ఆ అమ్మాయి – ఇంకో చోటికి పోయి ఏడిస్తే – ఎవరు ఓదారుస్తారు? ముత్యాలు ఏరుకుంటారుగాని.

ఈ కట్టి కథ లోని అంతరార్థం –

"కవిత అనిన వేడి కన్నీరు మాత్రమే". రామాయణ పీఠికలోని "తస్య శోకః శ్లోకత్వ మాగతః" అనే మాట జ్ఞాపకం వస్తుంది. అంతేగాక

ఆమె పేరు కవిత - అతిలోక సుకుమారి
సవతి తల్లి - జగతి - చావగొట్టు;
కారు కంటి నీరు - మారు ముత్యాలుగా
కోరి ఏరుకొనని వార లెవరు?

ఉర్వి ఎవ్వ రింక ఓదార్చ గలవారు?
శ్లోక మగును ఆమె శోక మెల్ల!
కానుపించు - కవిత కన్నీటి జల్లులో
ఇంపు గొలుపు నట్టి ఇంద్ర ధనువు. - ప్రగతి గీత

సమకాలీనులు కవిని గుర్తించరు. ప్రాచీన గ్రీకుకవి హోమరు - ముష్టి ఎత్తుకొని బ్రదికినాడట. గ్రీసు దేశంలోని సప్త నగరాలలో. ఆ మహాకవి మరణించిన పిమ్మట ఆ సప్త నగరాలు అతని శవము తమ నగరంలోనే ఖననం చేయాలని యుద్ధానికి దిగాయట.

తిరిగె - తిరిప మెత్తి - పుర సప్తకమ్ములో
హోమరు కవి - బ్రతికి యున్న నాళ్ళు;
హోమరు మరణింప - యుద్ధమ్ము లొనరించె
సప్త పురము లతని శవము కొరకు.

పరిహాస రసికులు - "కవి"కి ఇచ్చే నిర్వచనం.

"బ్రదికియున్న సమయంలో - ప్రతిరోజు చచ్చి - చచ్చిపోయిన పిదప చిరస్థాయిగా బ్రదికే విచిత్ర వ్యక్తి" - అని. కవులు పేదరికంలో బ్రదుకుతారని ప్రతీతి. పోతన - పేదరికం గూర్చి ఎన్నో కథ లున్నాయి. పారశీక కవి పిరదౌసి పేదరికంలో బ్రదికి పేదరికంలో మరణించాడు. ఇటీవలి కాలంలో గాలిబ్ కవి మరియొక

ఉదాహరణ. కీర్తి కాంత - కవులను మరణానంతరమే వరించటం - ప్రపంచ చరిత్రలోని ఒక విచిత్ర విరోధాభాసం. సమకాలీన సంఘం పెట్టే బాధలు భరించలేక కవులు ప్రవాస జీవితాలు గడపిన సన్నివేశాలు అన్ని దేశ చరిత్రలలో ఎన్నో ఉన్నాయి. ఆంధ్రదేశ చరిత్రలో కూడ - రాజ సందర్శనం దొరకక అగచాట్లు పడిన కవులు అనేకులు: పోతనయే గాక - శ్రీనాథుని చాటువు - అతడు పడిన అవస్థలు చాటుతున్నది.

కుల్లా యుంచితి కోక కట్టితి మహా కూర్పాసమున్ తొడ్గితిన్;
చల్లా అంబలి త్రాగితిన్ - రుచుల దోసం బంచు పోనాడితిన్;
వెల్లుల్లిన్ తిలపిష్టమున్ మెసవితిన్ - విశ్వస్త వడ్డింపగా;
తల్లీ! కన్నడ రాజ్య లక్ష్మి! దయ లేదా? నేను శ్రీనాథుడన్.

శ్రీనాథుడు - తన బ్రదుకు మలిసంజకెంజాయలో దుర్భర దారిద్ర్యం అనుభవించినట్లు అతడు వ్రాసిన చాటువుల వల్ల తెలుస్తోంది.

ఇక - కవిత గూర్చిన రెండవ కట్టు కథ. ఒక మహారాజు - తన ముఖ్యమంత్రిని పిలిచి మంచి 'ఆస్థాన కవిని' నియమించాలని అడిగాడు. ముఖ్యమంత్రి ఒక షరతు విధించాడు. "మహారాజుగారు - నా విధానాన్ని మధ్యలో ఆపకూడదు". రాజుగారు సమ్మతించారు. అభ్యర్థులు చాలామంది ముందుకువచ్చారు. మంత్రి, వారిని అందరినీ చెరసాలలో బంధించాడు. ఆరు నెలలు తిరుగకుండా వారిలో నూటికి ఎనభై మంది కవిత్వం వ్రాయటం విరమించుకున్నారు. అప్పుడు మిగిలిన 20% కవులకు రాజభోగాలు సమకూర్చాడు. ఆరునెలలు తిరిగే సరికి వారిలో ఒక్కరు తప్ప మిగిలిన వారందరూ కవితలు వ్రాయడం మానేశారు. అప్పుడు - ఆ ఒక్క కవిని మంత్రిగారు "ఆస్థాన కవి"గా ప్రకటించారు.

ఈ కట్టు కథ లోని ఆంతర్యం. కష్టాలలో కవిత్వం చెప్పటం కష్టం. రాజ భోగాలలో కవిత్వం వ్రాయటం అంతకంటె కష్టం. అచ్చమైన కవి, కష్టసుఖాలు రెండిటిలోగూడా కవితలు వ్రాయటం మానడు.

ఈ దృష్టితో చూస్తే - శ్రీనాథుడు - ఆదర్శ కవి. అతడు - దీనారటంకాల తీర్థ మాడినప్పుడు - ముత్యాల శాలలో కనకాభిషేకం జరిగినప్పుడు కవితలు వ్రాశాడు. రత్నాంబరాలు - కస్తూరీ తాంబూలాలు - హేమ పాత్రాన్నాలు - లభించినపుడు కావ్యాలు వ్రాశాడు. అవసాన కాలంలో దుర్భర దారిద్ర్యంలో కూడా కవితలు వ్రాశాడు.

కవి రాజు కంఠమ్ము కౌగిలించెను గదా
పుర వీథి ఎదురెండ పొగడ దండ!
సార్వభౌముని భుజాస్తంభ మెక్కెను గదా
నగరి వాకిట నుండు నల్ల గుండు!
వీరభద్రారెడ్డి విద్వాంసు ముంజేత
వియ్య మందెను గదా వెదురు గడియ!
ఆంధ్ర నైషధ కర్త అంఘ్రి యుగ్మంబున
తగిలి యుండెను గదా నిగళ యుగము!
బిలబిలాక్షులు గొనిపోయె తిలలు పెసలు,
కృష్ణవేణమ్మ గొనిపోయె ఇంత ఫలము;
బొడ్డుపల్లెను గొడ్డేరి మోసపోతి;
ఎట్లు చెల్లింతు టంకంబు లేడు మార్లు.

ఉత్కళ ప్రభువు - రాజమహేంద్ర రాజ్యాన్ని జయించి - ఆంధ్ర సముద్ర ప్రాంతాన్ని ఆక్రమించినపుడు - శ్రీనాథ మహాకవి పడరాని పాట్లు పడవలసి వచ్చింది. పొగడ దండ - పూల మాల కాదు. పన్నులు చెల్లించనివారి మెడకు వేసే ఇనుప సంకెల. మెడకూ కాళ్లకు ఇనుప గొలుసులు తగిలించినపుడు గూడ - పద్య కవిత చెప్పటం మానలేదు శ్రీనాథుడు.

కష్ట సుఖాలకు - సమంగా - స్పందించే డెందం ఉంటేనే - కవి కాగలడు.

## పద్య శిల్ప సౌష్ఠవ రేఖలు

తెలుగు పద్య రచన అనగానే స్ఫురించేది ఛందోవైవిధ్యం. సంస్కృతంలో గాని ఇతర దేశ భాషలలో గాని (ప్రాచీన కన్నడ కావ్యాలు మినహాయించి) అధ్యాయమునకు ఏదో ఒక ఛందము ఉండటం కద్దు. తెలుగులో వివిధ వృత్తాలు - జాతులు ఉపజాతులకు సంబంధించిన పద్యాలు కలిసిమెలిసిపోయి ఉంటాయి. మొదట కందం తదుపరి ఉత్పలమాల పిదప సీసం తరువాత మత్తేభం తదనంతరం ఆటవెలది ఒకే అధ్యాయంలో లేదా ఒకే శీర్షికలో ఉండవచ్చు. అనగా సందర్భో చితంగా, భావోచితంగా ఛందస్సును ఎన్నుకొని పద్యం కూర్చుకునే సులువు తెలుగు పద్యకవికి ఉంది. ఇది తెలుగు, పద్య రచనకు గల బలం, అంతేగాక - భావానుగుణ మైన భాష, తేట తెనుగు నుడికారాలు వాడవచ్చు. సుదీర్ఘ సంస్కృత సమాసాలు ప్రయోగించవచ్చు. యథోచితంగా తెలుగు పలుకు బడులు సంస్కృత పదగుంఫ నాలు కలబోయవచ్చు. సంస్కృత వ్యాకరణం ప్రకారం నూత్న వినూత్న పద సృష్టి విన్యాసం సుసాధ్యం. ఆ విధంగా సంస్కృత భాషలోని పదజాలం అనంత విస్తరం. సంస్కృత భాష లోని శబ్దజాలాన్ని సమాస సంఘటన ప్రక్రియా వైశిష్ట్యాన్ని - సర్వ స్వామ్య సంకలితంగా స్వాయత్తం చేసుకున్న ఘనత భారతీయ దేశ భాషలలో తెలుగుకే దక్కింది. తెలుగు ప్రత్యయాలు తీసివేస్తే - కొన్ని తెలుగు పద్యాలు సంస్కృత రచనే అనిపిస్తాయి. అయితే అచ్చ తెలుగు కావ్యాలు - వీటికి ప్రతిగా ఉద్భవించాయి. తెలుగు వ్యాకరణం - సంస్కృతం నుంచి ఉద్భవించిన పదాలను "తద్భవాలను" అచ్చతెలుగు గానే పరిగణిస్తుంది. ఇక కేవలం తెలుగు పదాలు ఎన్ని ఉంటాయి? అంతేగాక సుగ్రీవుడు శబ్దాన్ని 'మంచి మెడ యెకిమీడు, అనీ చక్రం అనే పదానికి చుట్టు వాలు అనీ బ్రహ్మాండం అనే దానికి 'సలువ గ్రుడ్డు' అని వాడుకలో లేని కృతకపదాలను సృష్టించినపుడు. అది అసలు తెలుగు అని చెప్పటానికి వీలుండదు. తెలుగు కావ్యాలలో - ఎడనెడ అచ్చ తెలుగు పద్యాలు చక్కని చిక్కని నుడికారపు వంపు సొంపులతో కనిపిస్తాయి. తెలుగు పదాలలో ఏదో కమ్మదనం - సరళ మాధుర్యం తొణికిస లాడుతుంది. సంస్కృత శబ్దాలలో - సమాసాలలో రాజసం గాంభీర్యం ఉంటుంది. తెలుగు పద్యంలో సారళ్య గాంభీర్యాలు గంగా యమునల వలె సంగమించి ప్రవహిస్తాయి.

కల డందురు దీనుల యెడ;
కల డందురు పరమ యోగి గణముల పాలన్;
కల డందు రన్ని దిశలను;
కలడు కలండనువాడు కలడో ! లేడో !

తెలుగు సంస్కృత పద విశిష్టమైన ఈ పోతన పద్యం సారస్వత గంగా యమునా సంగమమే. అసలు సిసలైన అచ్చ తెనుగు అంటే - తెలుగు సంస్కృత పదాలు కలగలుపే. అచ్చ తెలుగు కావ్యం - యయాతి చరిత్ర లోనిది ఒక పద్యం -

"అచ్చ తెలుంగు పద్దె మొక టైనను కబ్బము లోన నుండియున్
హెచ్చని యాడుచుండు రిది యెన్నుచు; నేర్పున పొత్త మెల్ల ని
ట్లచ్చ తెనుంగువన్ నుడువ అందరి చంద మెరుంగు వారెదన్
మెచ్చరొ అబ్బురం బనరొ మే లనరో కొనియాడరో నినున్"

ఇందులో పద్దెము - కబ్బము, పొత్తము మున్నగు శబ్దాలు సంస్కృత భవములే కద.

హరిశ్చంద్ర నలోపాఖ్యానంలో చంద్రోదయ వర్ణన - పద్యంలో అచ్చ తెలుగు పాలు ఎక్కువ. సంస్కృత పదాలు కూడా చక్కగా కలిసిమెలిసి ఉన్నాయి.

కళలకు నిమ్ము; సొమ్ము సెగ కంటికి, మింటికి, చెన్ను; వెన్ను తో
య్యలి సయిదోడు; కూడు దివిజాళికి; హేళికి జంట; తుంట విల్
గల దొర విందు; పొందు విరి కల్వకు; చల్వకు నిక్క; రిక్క రే
వెలదుల నీవి; బావి రుచి వీచికి; ప్రాచికి వచ్చె చెచ్చెరన్.

తియ్యని తేట తెలుగు మడికారాలలోని కమ్మదనము తెలుగు పద్య కవులలో - ఆధునిక కాలంలో కూడా ఉపాసించే వారు ఉన్నారు. జ్యోత్స్నాభిసారిక - నృత్య నాటికలోని పద్యం. అంతా అచ్చ తెలుగే.

తెల్లని చీర గట్టి - వెలదీ - జడ మల్లెల చెండు వెట్టి, వ్రే
పల్లెను వీడినావు ! వల వంతలు - కమ్మని పిల్లి తెమ్మెరల్
పిల్లన గ్రోవి మోవి, కనువేదురు, వెన్నెల పాల వెల్లి - నీ
ఉల్లము లోన ఎట్టి నెఱి ఉప్పెన రేపినదో వచింపవే

జాషువా కవితా శైలి తెలుగు సంస్కృత పదాల సమన్వయ సమ్మేళనం.

నాయకురాలి మాయ కదనమ్మున మా పలనాటి పౌరుష
శ్రీ యడుగంటె - గడ్డి మొలిచెన్ పులి చారల గద్దె మీద - కెం
జాయ మొగాన గ్రమ్మ, జలజప్రమదామణి నాగులేటిపై
వ్రాయుచు నున్న దిప్పటికి బాలుని శౌర్య కథా ప్రబంధముల్.

"ఎచ్చట నుండి వచ్చె తరళేక్షణ కీ నును సిగ్గు దొంతరల్" అని చేమకూర వేంకట కవి వ్రాస్తే అందులో తెలుగు సంస్కృత పదాలు ఏకైక శ్రుతిలో కలిసిపోవటం - తెలిసినవారి తలలు ఊపించే ఉయ్యాల ఊపే. ఛందో వైవిధ్యం - తెలుగు సంస్కృత శబ్ద సమ్మేళనం తెలుగు పద్య శిల్ప సౌష్ఠవంలో అంతర్వాహినులే. ఇవి తెలుగు పద్యరచనా విన్యాసానికి అనన్య సాధారణమైన బలం చేకూర్చిపెట్టాయి.

తెలుగు పద్యం అనగానే - సంప్రదాయ సాహితిలోని ఛందస్సులు మత్తేభ శార్దూలాలు - ఆటవెలది - తేట గీతి సీస పద్యాదులు స్ఫురిస్తాయి. కందంలో ఆటవెలదిలో తెలుగుదనం ఎక్కువ అనే వారు ఉన్నారు. అంతేగాక తిక్కన భాషలో గూడ తెలుగు పాలు ఎక్కువ అనీ కందపద్యం తిక్కన చేతిలో సిద్ధిపొందింది అనే వారు ఉన్నారు. నిజమే గాని తిక్కన భావోచిత భాష వాడాడనీ - అవసరమైన పట్టుల సంస్కృత సమాసాలు గుప్పించటానికి వెనుకాడ లేదని చెప్పవచ్చు.

అలతి అలతి మాటలతో కాహళ సంధించి నట్లు కవిత కూర్చవలెనని తిక్కన చెప్పిన మాట నిజమే. కవిత్వతత్వ విచార కర్త - విమర్శక శిఖామణిగా సుగృహీత నామ్ముడైన కట్టమంచి రామలింగారెడ్డిగారు - సంస్కృత భూయిష్ఠ శైలిని నిరాకరించి తెలుగు పలుకుబడులపై అభిమానం చూపించేవారు. ఆయన దృష్టిలో వేమన గొప్ప కవి. వేమన పద్యాలు కవితకు మేలుబంతులు. శార్దూల మత్తేభాదులకు - ఎంత మేత వేసినా సరిపోదు అనీ సీసం నాల్గు ఆజానుబాహువులు ఎత్తుగీతి భాషాడంబరాన్ని అపేక్షిస్తాయనీ ఛలోక్తులు విసరేవారు ఉన్నారు.

"దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాప స్ఫురత్
గర్వాంధ ప్రతివీర నిర్మదన విద్యా పారగుల్ - మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రిప్పు - నిను దోర్లీలన్ వెసం గిట్టి గం
ధర్వుల్ మానము ప్రాణముల్ గొనుట నిక్కం బెమ్మెయిన్ కీచకా"

తిక్కన వ్రాసిన ఈ పద్యానికి కట్టమంచి రామలింగారెడ్డిగారి వారి సమాధానం –

"ఆహా! ద్రౌపదీ – నీ
ఊపిరి తిత్తు లెంత బలమైనవి ! "

ప్రాచీన కవిత్వం అంతా అతిశయోక్తులతో నిండిన జటిల సంస్కృత సమాస భూయిష్ఠమైన రచన కాదు. పాల్కురికి సోమన పద్యంలో స్వభావోక్తి అనుశీలించ వచ్చు.

తొలు కోడి కను విచ్చి నిలిచె మై పెంచి,
జల జల రెక్కలు సడలించి నీల్గి,
గ్రక్కున కాలార్చి కంఠంబు విచ్చి,
ముక్కున నీకెల జక్కొల్పి కడుపు,
వెక్కించి మెడ సాల నిక్కి మిన్సూచి,
కొక్కురో కుఱ్ఱని కూయక మున్నె;

సూర్యభగవానునకు సహజసుందరంగా కోడిపుంజు సమకూర్చే స్వాగతానికి ఏ సార్వభౌమునకు గూడ ఏ రాజధాని ప్రాసాదంలో నైనా ఏ వైతాళిక బృందంగాని ఏ వందిమాగధులు కూర్చే కైవారాలు సంకీర్తనలు సాటి గావు.

తొలి ఉషస్సులలో వినిపించే కోడి కూత పల్లె పట్లులలో అందరకూ సుపరి చితమే. అయితే కొందరు మాత్రమే గుడిసె కప్పు ఎక్కి నిక్కి గొంతెత్తి కూసే కోడి పుంజును చూచి ఉంటారు. చూచినట్టివారు కూడ కవి వర్ణించినంత నిశిత దృష్టితో చూచి ఉండకపోవచ్చు.

త్రవ్వట బాబా! తలపై
పువ్వట జాబిల్లి! వల్వ బూచట! చే దే
బువ్వట! చూడగ ఉలుకు
క్కవ్వట! అరయంగ అట్టి హరునకు జేజే!!

ఈ పద్యం తెనాలి రామకృష్ణుడు చెప్పిన చాటువు. త్రవ్ – అనగా సాక్షర పదములు గ్రహింపలేని పశువు – వృషభం. బాబా = వాహనం. తలపై జాబిల్లి. బూచి = భయంకరమైనది = (ఏనుగుతోలు) వలువ = పుట్టం. ఉలులుక్ = మాయ (లేనిది)

లోకోత్తరము లైన వృషభ వాహనత్వం - చంద్రశేఖరత్వం కృత్తివాసత్వం - మాయా నియామకత్వం గల ఆ పరమ శివునకు జేజేలు.

ఈ పద్యంలో అంతరార్థం ప్రయత్నించి తరచిచూస్తే - శ్రమకు మించిన ఫలితం చేకూరగలదు. సమన్వయం చేసి - చెప్పాలంటే, తెలుగు పలుకుబడిలో ఉన్న తీపి గొప్పదే. అట్లే సంస్కృత సమాసాల ఠీవి గూడ గొప్పదే. తిక్కన - ఉభయ కవి మిత్రుడు. అట్లే తెలుగు పద్యం కూడ ఉభయ కవిమిత్రము.

కవితకు కావలసింది వ్యుత్పత్తి మాత్రమే కాదు. సుదీర్ఘ సంస్కృత సమాసాలే తెలుగు పద్య విద్య కాదు. మంచి తెలుగు పద్యం వ్రాయటానికి ఉద్దండ సాహిత్యం కాదు కావలసింది కవికి గుండె పండించుకున్న గొప్పదనం.

బలవంతుడ నా కే మని
పలువురతో నిగ్రహించి పలుకుట మేలా?
బలవంత మైన సర్పము
చలి చీమల చేత చిక్కి చావదె! సుమతీ.

వంటి తెలుగు పద్యాలు వ్రాయటానికి పాండిత్యం కావాలా? అనుభవం పంపిన గుండె చాలు.

జొన్న చేని కాడ - చిన్నిదానను చూడ,
నిన్న టేల నుండి నిదుర లేదు;
దాని నన్ను గూర్చి - దయసేయు మాధవా
పొన్న పూల - నిన్ను పూజ సేతు.

ఇట్టి పద్యం వ్రాయటానికి పాండిత్యం ఎందుకు? పండితుడు వేరు. కవి వేరు.

వాచన సోముని పద్యం - సత్యభామ నరకునితో యుద్ధం చేసే సన్నివేశ సందర్భం లోనిది అనుప్రాస విలసితం -

అరి జూచున్, హరి జూచు - చూచుకము లందంద మందార కే
సర మాలా మకరంద బిందు సలిల స్యందంబు లందంబులె
తొరగం బయ్యెద కొంగొకింత తొలగం - దోడ్తో శరాసారమున్
దరహాసామృత పూరమున్ కురియుచున్ - తన్వంగి హేలాగతిన్.

ఈ పద్యంలోని సత్యభామా స్వరూపం – స్థిర భంగిమలో కనిపించే ఛాయా చిత్రపటం కాదు. ఇది చైతన్యపూరితమైన అక్షర చలనచిత్ర పరంపర కన్పించే పద్య మనోనేత్ర నిర్మాణం. శిల్పకళకూ – చిత్రకళకూ లేని ఈ ప్రతిభా వైశిష్ట్యం – కేవలం మానవ సృష్టి అయిన కవితా కళలోని ప్రత్యేకత.

కారయిత్రి – భావయిత్రి సాయుజ్యం – సారస్వత ప్రపంచంలో అధిరోహించిన గౌరీ శంకర శిఖరానికి పై పద్యం ఉదాహరణ ప్రాయం.

"తేనె సోక – నోరు – తీయన యగు రీతి
లోడ అర్థ మెల్ల తోచకుండ;
గూఢ శబ్దములను గూర్చిన కావ్యమ్ము
మూగ చెవిటివారి ముచ్చ టగును".

అని కవయిత్రి మొల్ల చాటి చెప్పినది.

తాను సీతను చూచినట్లు ఆంజనేయుడు రామునకు నివేదించిన (మొల్ల వ్రాసిన) పద్యంలో వాల్మీకి రామాయణ శ్లోకాలలో కనిపించే 'సకారత్రయం' (సౌందర్యం – సారళ్యం – సౌలభ్యం) ప్రతిఫలించింది.

కంటిన్ – జానకి పూర్ణచంద్రవదనన్ – కల్యాణి ఆ లంకలో
కంటిన్ మీ పదపంకజంబులను నే కౌతూహలం బొప్పగా
కంటిన్ – మీ కరుణావలోకనము విఖ్యాతంబుగా కీర్తులన్
కంటిన్ – మా కపివీర బృందములతో గాంభీర్య వారాన్నిధీ.

తెలుగు శతకాల లోని పద్యాలు – చాటువులు – కాల ప్రవాహానికి ఎదురీది కలకాలం నిలిచే చిరంజీవులు.

కనకపు సింహాసనమున
శునకము కూర్చుండ బెట్టి – శుభ లగ్నమునం
దొనరగ పట్టము గట్టిన –
వెనుకటి గుణ మేల మాను వినరా! సుమతీ.

"వెనుకటి గుణము"లో - వాచ్యము చేయని హేయార్థం నిగూఢంగా నిక్షిప్త మైంది. పద్యం అలతి పదాలలో "పొసగ ముత్తెపు సరుల్ పోహళించిన వీల' గ్రుచ్చబడింది.

తెలుగు పద్య కవులు అనుగ్రహించగలరు. ఆగ్రహించగలరు. తిట్టును - మధ్యలో దీవెనగా మార్చిన చాటువు - ఒకటి ప్రచారంలో ఉంది. తిమ్మరసును గూర్చి. శ్రీకృష్ణదేవరాయల కవితాప్రీతి - శ్రుతి మించి నంతగా పరిణమించినట్లు మంత్రి తిమ్మరసు భావించి ఉండవచ్చు. ఒక కవి ఆతనిని -

గుత్తిం బుల్లెలు కుట్టి - చంద్రగిరిలో కూడెత్తి - పెన్గొండలో
హత్తిన్ - సత్రము నందు వేడి - పలు దుర్గాధీప తాంబూల పుం
దిత్తుల్ మోసి - పదస్థులైన ఘనులన్ దీపింప -

అని అధిక్షేపిస్తున్నపుడు - మంత్రి తిమ్మరసు ఆ కవి మెడలో ముత్యాల హారం వేశాడు. వెంటనే ఆ కవి తిట్టును దీవెనగా మార్చి - దీవెంచెదన్

ముత్తారాతి యయాతి నాగమ సుతున్ మంత్రీశ్వరున్ తిమ్మరున్.

అని ఆశు పద్యాన్ని పూరించాడట.

పింగళి సూరన - శిల్పబంధురములైన ఎన్నో పద్యాలు వ్రాశాడు. ద్వర్థి కావ్యం వ్రాసిన పండిత ప్రకాండుడు అతడు. అయితే అతడు వ్రాసిన చిరు కంద పద్యం యుగ యుగాంతరాలు తెలుగు గొంతుకలలో మారుమ్రోగుతూ నిలుస్తుంది.

తమ విద్య వేవ్వ రే మా
త్రము కనజాలుదురు వారి దండను తన్మా
త్రమ ప్రకటింతురు బుధు లు
త్తములి మహిమ - నీరు కొలది తామర సుమ్మీ.

కావ్యం అంతా కంఠస్థం కాకపోయినా అందులో కొన్ని పద్యాలు సహృదయులు హృదాయలలో నిలిచి ఉంటాయి.

ఒక్కొక్కప్పుడు పద్య పంక్తులు నిలువ వచ్చు - "అచ్చపు బుద్ధికి లేవగమ్యమునౌ" సూరన రచన.

"ఏ గతి రచియించి రేని సమకాలమువారలు మెచ్చరే గదా" అన్నాడు వేమకూరి వేంకట కవి.

"అధికారాంతము నందు చూడవలె గాదా ఆ అయ్య సౌభాగ్యముల్"
"మగువల్ నేర్వగ రాని విద్య కలదే ముద్దార నేర్పించినన్"
"బుద్ధి జాడ్యజనితోన్మాదుల్ గదా శ్రోత్రియుల్"
"వృద్ధుల బుద్ధులు సంచలింపవే"
"వనిత తనంత దా వలచి వచ్చిన చుల్కన గాదె ఏరికిన్"
"గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్"
"నిండు మనమ్ము నవ్య నవనీత సమానము
పల్కు దారుణాఖండల శస్త్ర తుల్యము".

"వాక్పారుష్యము సన్నె మహా దారుణ మది విషము కంటె
దహనము కంటెన్"

"కేవలం కల్పనా కథలు కృత్రిమ రత్నములు" ఇట్టి ఉదాహరణలు కొల్లలు.

"కా కేమి తన్ను తిట్టెనె?
కోకిల తన కేమి ధనము కో కొమ్మనెనే?
లోకము పగ యగు పరుసని
వాకున - చుట్ట మగు మధుర వాక్యము వలనన్"

అని సంకుసాల నృసింహకవి ఏనాడో తీర్పు చెప్పియున్నాడు.

ప్రబంధాలలో సూర్యోదయ చంద్రోదయ వర్ణనలు అజాగళస్తనములు నిరర్థకములు అని విమర్శించేవారు ఉన్నారు. కాని - ధూర్జటి వంటి మహాకవులు వ్రాసిన పద్యాలు శిల్ప సౌష్ఠవ పరాకాష్ఠలు.

ఉదయ గ్రావము పానవట్ట మభిషేకోదప్రవాహంబు వా
ర్ధి, దరీ ధ్వాంతము ధూప ధూమము - జ్వలద్దీప ప్రభారాజి - కౌ
ముది, తారా నివహంబు లర్పిత సుమంబుల్గా తమోదూర సా
ఖ్యదమై శీత గభస్తి బింబ శివ లింగం బొప్పె - ప్రాచీ దిశన్.

ఈ పద్యంలోని పరిణామాలంకారము - ఉపమానోపమేయముల తాదాత్మ్యం - చంద్రబింబం శివలింగంగా పరిణమించటం సుగమం. ఇందు శబ్దార్థాల సమ తూకం - శైలి లోని బింకం - పాంకం సహృదయ హృదయ వేద్యం.

క్రాంతదర్శియైన ధూర్జటి మహాకవికి - చంద్రోదయంలో

ఈశ్వర సాక్షాత్కారం లభించింది.

విప్రనారాయణ పాత్ర - యుగ యుగాంతరాల నుండి సహృదయులను ఆకర్షించి సానుభూతిని కలిగిస్తుంది. తన జీవితాన్ని శ్రీరంగనాథునకు అంకితం చేసి - నిష్ఠా గరిష్ఠుడై నిత్య జీవితం నెరపే పరమ భాగవతోత్తముని - పంతం పట్టి సంగీత సాహిత్యాలలో సాటి లేని అభినివేశం ఆర్జించిన ఒక అభినేత్రి - నర్తకీమణి - వేశ్యా సుందరి దేవదేవి తన వలలో వేసుకోగలిగింది. ఈ మహనీయుని శీలంలో చిత్త వృత్తిలో వచ్చిన మార్పు - గణనీయమైన అనురణన క్రమ పరిణామానుక్రమణిక - మాటల పొలిమేరలు దాటి నట్టిది. ఊహలకు అందనట్టిదే గాని సారంగు తమ్మయ్య కవి - వైజయంతీ విలాసంలో ఒక పద్యంలో పొందుపరచాడు. అందుచే ఆ పద్యం ఆంధ్ర వాఙ్మయ జగత్తులో చిరస్థాయిగా నిలిచింది.

"ఆ విప్రోత్తము వజ్ర పంజర నిభంబై నిశ్చలంబైన స
ద్భావం బంగన సాహచర్య గుణ సంపర్కంబునన్, లోహమై,
గ్రావంబై, దృఢదారువై, తరుణ వృక్షంబై, ఫలప్రాయమై.
పువ్వై, తన్మకరందమై - కరగి - పో పో - నీళ్లకుం బల్చనై"

చివరకు చెప్పవలసినట్టిది - ప్రతి మంచి పద్యంలో మాట పరిధిని దాటే మాధుర్యం ఏదో ఉంటుంది.

ఒక పద్యం కాల ప్రవాహానికి ఎదురీది కలకాలం ఎందుకు నిలుస్తుందో చెప్పటం కష్టం. తిరుపతి వేంకట కవులు వ్రాసిన కావ్యాలలో ప్రౌఢ శిల్ప సౌష్ఠవం గల పద్యాలు చాలా ఉన్నాయి. అయితే ఉద్యోగ విజయాల నాటకాలలోని పద్యాలు - సహృదయుల హృదయాలను ఆవేశించి ఊపివేశాయి. శ్రీ కొండేపూడి సుబ్బారావు గారు ప్రౌఢ విద్వత్ కవి - ద్రాక్షాపాకంలో కదళీ పాకంలో వ్రాసిన పద్యాలు ఎన్నో

ఉన్నాయి. ఆవకాయపై ఆయన వ్రాసిన పద్యం ఒక హృదయంగమమైన చాటు పద్యంగా తెలుగు భాషలో చిరస్థాయిగ నిలుస్తుంది.

"నమ్మక మైన నూనె - మలినమ్ము నెరుంగని ఉప్పు - క్రొత్త కా
రమ్మను ఆవ పిండియును రమ్యముగా సరిపాళ్లలో రసా
లమ్ములు చేర్చి కూర్చి రుచులన్ చవు లూరగ చేయగా ఏ మనం
బమ్మడు వోవ దీ కలియుగాద్భుత మాయకు - ఆవకాయకున్".

ఆవకాయ ఆంధ్రుల అభిమాన శాకపాక విశేషం. ఈ పద్యం - ఆంధ్ర శాకపాక విజయ విలాస సంగ్రహం.

కనుపర్తి అబ్బయామాత్యుడు - అనిరుద్ధ చరిత్ర పీఠికలో

చతుర కవిత్వ తత్త్వ పటు సంపద యొక్కని సొమ్ము గాదు; భా
రతి దయ సాధ వార్ధి, కవి రాజుల మానసముల్ ఘటంబు లా
యతము కొలంది లబ్ధ మగు అయ్యమృతంబటుగా తలంచి అ
ద్యతన కవీంద్రులార - కృప తప్పక మత్కృతి ఆదరింపుడీ.

అని ప్రార్థించాడు. నిజమే. "అద్యాపి రత్నాకర ఏవ సింధుః" అన్నాడు ఒక కవి. పూర్వ కవులు సాహితీ సముద్రంలో నుండి కొన్ని రత్నాలు వెలికి తీశారు. నేటి కవులు మరి కొన్ని తీయవచ్చు. సముద్రము నేటికీ రత్నాకరమే. 'ముఖే ముఖే సరస్వతీ' అన్నారు గదా పెద్దలు.

వేష భాష లెరిగి - కాషాయ వస్త్రముల్
కట్ట గానె ముక్తి కలుగ బోదు;
తలలు బోడు లైన - తలపులు బోడులా?
విశ్వ దాభి రామ వినుర వేమ.

అవి అలతి అలతి తేట తెలుగు మాటలు గుది గ్రుచ్చి వ్రాస్తే అది మంచి పద్యమే. ఇక - సంస్కృత సమాసాలు బిగించి వ్రాస్తే - అది ఇంకో రకమైన గొప్ప పద్యం కావచ్చు. అది తెలుగు పద్య శిల్ప సౌష్ఠవం లోని విశేషం.

గ్రాసము లేక స్రుక్కిన - జరాకృశ మైన విశీర్ణ మైన - సా
యాసము నైన, నష్టరుచి యైనను, ప్రాణభయార్త మైన - సం
త్రాస మదేభ కుంభ పిసిత గ్రహ లాలసశీల సాగ్రహా
గ్రేసర భాసమాన మగు కేసరి - జీర్ణ తృణంబు మేయునే?

ఇది భర్తృహరి సుభాషితం - సంస్కృత మూల గ్రంథంలోని శ్లోకానికి ఏనుగు లక్ష్మణ కవి - చేసిన అనువాదం.

"విద్యచే భూషితుండయి వెలయుచున్న
తొడరి వర్జింప దగు చూవె దుర్జనుండు;
చారు మాణిక్య భూషిత శస్త మస్త
కంబయిన పన్నగము భయంకరము గాదె".

మున్నగు తెలుగు అనువాదాలు చదివితే - ఉభయ భాషాకోవిదులు సంస్కృత శ్లోకాలు కంటె అనువాద పద్యాలే మేల్తరము అని సులువుగా గుర్తింపగలరు. శిల్ప సౌష్ఠవంలో - తెలుగు పద్య శ్రేష్ఠతను ఋజువు చేయగలవు ఏనుగు లక్ష్మణ కవి అనువాదాలు.

కందుకము వోలె సుజనుడు
క్రిందం బడి - మరల - మీదికిం జను సుమ్మీ;
మందుడు మృత్ పిండము వలె,
క్రిందం బడి అణగి యుండు - కృపణత్వమునన్.

మూల శ్లోకంలో తెలుగు యతి ప్రాసల అంద చందాలు లేవని వేరే చెప్పాలా?

నిముషం బైనను విశ్రమింప డొకచో నీరేజ మిత్రుండు - సం
ద్రము తానించుక మేర మీరదు - జగత్ ప్రాణుండు వీచున్ సదా,
క్షమ సర్వంబు వహించు - నీరదము వర్షంబిచ్చు కాలాను సా
రముగా - నీ వతి చండశాసనుడ వౌరా! భక్త చింతామణీ.

ఈ పద్యం వసురాయ కవి = వడ్డాది సుబ్బరాయకవి వ్రాసినట్టిది. ఒకనాడు భక్త చింతామణి శతకంలోని పద్యాలు తెలుగు నేల నాలుగు దెసల మారుమ్రోగి పోయాయి. పద్యం చెక్కటంలో సిద్ధహస్తు డైన శిల్పి వసు రాయ కవి.

ద్రష్ట - చండశాసను డట! ఈ శబ్దంలో - పద్యంలో కవి చెప్పక విడిచిపెట్టిన విశ్వ శిల్ప సౌష్ఠవం విశ్వరూప ప్రదర్శనం ఇమిడి ఉంది. ఇచ్చట సాహిత్యంలో సందేశం సాయుజ్యం చెందింది.

ధ్వని ప్రధానమైన కవిత - మేల్‌తర మని లాక్షణికులు పలువురు సాహితీ ప్రియంభావుకులు మురిసిపోయి అభివర్ణించారు. తిరుపతి వేంకట కవుల పాండవో ద్యోగ విజయాల లోని ఒక చూలిక.

ఆరని లోతు నీటి కొలని నక్కట ! పూచిన తమ్మికిన్ - విధి
ప్రేరణ రాలిపోయినవి - రేకులు తొంబది తొమ్మిదింక ఆ
నీరజ మందు తా మిగులునే ఒక రేకటు లుండెబో అలం
కారము లౌనె ఆ కొలను గాని సరోజము గాని భూమికిన్ !

అది లోతైన గొప్ప సరోవరం. అందు శత పత్ర కలితమైన పద్మం పూచింది. కాని - దురదృష్టవశంచే ఆ పద్మం లోని నూరు రేకులలో తొంభై తొమ్మిది రాలిపోయాయి. నేపథ్యంలో వినిపించే ఈ చూళిక శ్రోతలకు భారత యుద్ధానంతరం దుర్యోధనుని దుఃస్థితి జ్ఞాప్తికి తెస్తుంది గద.

ఎప్పుడైన కవిత - ఏకాంత చూళికే;
వాచ్యమోష కాని ధ్వనియె సుమ్ము;
అక్షరాల నడుమ - ఆంతరంగిక మైన
మౌన గాన మధురిమమ్ము - కవిత.

మానవ హృదయాన్ని సమున్మేషం చేసే భావాలలో పరమ పవిత్రమైనది "గురు భక్తి". సనాతనులు గురువును బ్రహ్మగా - విష్ణువుగా - శివునిగా ఉల్లేఖించారు. దేవులపల్లి కృష్ణ శాస్త్రి - తమ గురువు రఘుపతి వేంకటరత్నం నాయుడు గారిపై వ్రాసిన పద్యాలు చిరస్మరణీయాలు. "మా గురుదేవు డేలకో లోచు షరాయితో పగిడితో ఎవరో ఒక పాదుశాహిగా" అని అభివర్ణించి వ్రాసిన మరో పద్యం.

ఈ జడ జీవితమ్ము పలికించితి వీ అఘ పంకమందు అం
భోజము మొల్వ జేసితివి - అపూర్వము నీ దయ - ఈ నిశీధి నీ
రాజన మెత్తినావు - విపులమ్మగు నీ యెద నిండె ఏ శర
ద్రాజిత చంద్రకాంతు లమృతమ్ములు, స్వర్గ లతాంత వాసనల్.

ఈ కోవకు చెందినట్టి కవితయే - శ్రీ నండూరి రామకృష్ణమాచార్యను గూర్చి శనగన నరసింహస్వామి చేసిన గురుస్తుతి

"హృదయ మమృత సముద్రము - వదనము
కవితా లతాంగికి నర్తన శాల;
సదన మతిథి కోటికి నాటి ఋష్యాశ్రమము;
విశాల వసుధా కుటుంబి! నీ సాటి నీవె".

అయితే గురు భక్తికి సాటి యైన సముద్భావన - శిష్య వత్సలత;

అహము కొంత లేక - ఆత్మవంచన లేక,
గొప్ప యెంత యున్న - గురువు కాదు;
శిష్యు డగుట సులువు - జిజ్ఞాస యున్నచో;
చేయ వలయు గురువు - శిష్యపూజ. --- ప్రగతి గీత

రసము యన్నిష్ఠం? అనే ప్రశ్నకు ఆలంకారికులు చెప్పిన సమాధానం - రసము సహృదయ నిష్ఠం అనే. నిజానికి గురుడు నిమిత్తమాత్రుడే.

"కాగి కాగి - పాలు - గడ్డ మీగడ గట్టు;
పిదప మారిపోయి పెరుగు అగును;
చదివి చదివి పడయు - జ్ఞానమ్ము - విద్యార్థి;
గురువు - తోడు చుక్క - పెరుగు నందు. --- కవితా ప్రభాస

సంధేశం అందించని రచన సాహిత్యమే కాదు. అది కాంచన కమలం కావచ్చు. అధవా మాడిన మట్టి చిల్లి పెంకు కావచ్చు.

"బోధ చేయు గురుడు - పాగ గొట్టమా? కాదు;
సుత్తి కాదు - వాడి కత్తి కాదు !
రాపిడులకు వెలుగు రవ్వ లీనెడు రాయి,
జ్ఞాన బీజములకు వాన జల్లు. --- ప్రగతి గీత

గురుశిష్య బంధం - సంఘంలో సారస్వతంలోనూ విశ్వ జనీన మైనది. "గురు దేవో భవ" - "శిష్య దేవో భవ"గా పరిణమించటమే విద్యా పరాకాష్ఠ.

తెలుగులో యుగ యుగాంతరాల నుంచి శతకాలు అవతరిస్తూనే ఉన్నవి. శతకం మాట (యెనిమిది) పద్యాలు మాత్రమే గాదా అని అనుకోరాదు. వాటిలో చక్కని చిక్కని పద్యాలు - శిల్పసౌష్ఠవ పరిపుష్టికి ఆలవాలైనవి ఎన్నో ఉన్నాయి. అంతేగాదు - శ్రీకాళహస్తీశ్వరా - అనే మకుటంలో శ్రీ యతి స్థానంలో పడింది. అంటే నూరు పద్యాలలో సజాతీయపదాలు పడాలి గద. అట్లే - ఇందూ నందుని మందనుంచి గద నీవేతెంచుటల్ రాకలున్ - శతకము నందు వంద పద్యాలలో బిందు పూర్వక దకార ప్రాస ఉండాలి గద

బృందారణ్యము సేమమా? అచటి గోబృందంబుల్ లెస్సలా?<br>
నందుండున్ సతియున్ సుఖాన్వితులె నానాగోపగోపాలికా.<br>
సందోహంబులతో హలాయుధుడు కృష్ణస్వామి క్రీడింతురా?

అట్టిదే మరి యొక పద్యం

ఛందోవీథుల సంచరించు హరి స్వేచ్ఛా క్రీడలన్ మహాగీత గో<br>
విందప్రోక్త కథా ప్రకారముల తన్వుల్ వేడుకొన్నట్టి ఆ<br>
నందాభీర కుమార చేష్టితము లానందమ్ముగా కంటివా?<br>
ఇందూ నందుని మంద నుండి కద నీ వేతెంచుటల్ రాకలున్.

ఆధునికులలో లక్ష్మణయతీంద్ర కవి - తండ్రీ రామచంద్ర ప్రభూ మకుటం స్వీకరించి శతకం వ్రాశాడు. అంటే యతిస్థానంలో "ంద్రీ" ఉన్నది. ఆ శతకంలో వంద పాద్యాలలో సముచిత యతులు పడాలిగా.

ఆచంద్రార్కము నిల్వ దీ తను పటంచాందోళనల్ చెందెదన్<br>
ఆ చంద్రార్కులు నైన శాశ్వతులె - కాలాంభోధి బిందూపముల్!<br>
నీ చిద్రూప మమేయ మెల్లయును తల్లోకమ్ము తల్లద్ది నా<br>
యీ చైతన్యపు పంట యోము, గదె తండ్రీ! రామచంద్ర ప్రభూ!

## సత్యం – శివం – సుందరం

సాహిత్యం సనాతనం. సాహిత్యం నిత్య నూతనం. సాహిత్యం – శబ్ద బ్రహ్మోపాసన. శబ్దమే అర్థ ప్రతిపత్తికి ఆధారం. కరుణశ్రీ – శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు పరవసించి పలికిన మాటలు – "కొన్ని శబ్దాలు వజ్రకఠోరాలు. కొన్ని శబ్దాలు శిరీష కుసుమ పేశలాలు. కొన్ని శబ్దాలు తరంగాల వలె పైకి లేస్తాయి. కొన్ని శబ్దాలు కురంగాల వలె చెంగు చెంగున ముందుకు దూకుతాయి. కిలకిల నవ్వే శబ్దాలు కొన్ని. తళతళ మెరిసే శబ్దాలు మరికొన్ని. మిసమిసలాడేవి కొన్ని. గుసగుసలాడేవి కొన్ని". పింగళి సూరన అన్నాడు – "పొసగ ముత్తెపు సరుల్ పోహళించిన వీల తమలోన దొరయు శబ్దములు గూర్చి" పద్యాలు వ్రాయాలి. అనగా ముందు వెనకల ఉన్న శబ్దాలకు మద్య ఉన్న శబ్దాలు సెలయేటిపై తేలి అలతి అలతి అలల వలె కలిసి మెలసి ఒకే శ్రుతిలో కలకల సవ్వడులు పచరింపచేయాలి. ఇక శబ్ద ఝురికి అర్థ గాంభీర్యం కూడా తోడైతే? అది ఆదర్శ కవిత్వమే. వాగర్థ సమ్మేళనం అవసరం కవితకు. కావ్య మీమాంస వ్రాసిన రాజశేఖరుడు – ప్రేయసి అర్థాంగియైన అవంతీ సుందరికి ఒక పొడుపు కథ వేశాడు. అతడు ఆమెకు పుట్టిన రోజు కానుకగా అందించిన పెట్టెలో ఓ ఉడుగర ఉంది. ఆమె గుర్తించింది. అది కాంచన కమలం. అయితే పసిడికి పరిమళం తోడైతే? అందమైన పద్యంలో సందేశం ఇమిడి ఉంటే సత్యం శివం సుందరం. అందులో "రస స్ఫూర్తి" కలుగుతుంది.

"రసో వై సః"

"కొడుకులు లేని వారలకు – కూరిమి బిడ్డవు – మాతృహీను లౌ
బుడుతల కెల్ల తల్లి వయి పోషణ సేయుము – నా యనంగ లే
కడలెడు దీనులన్ మనుపు మార్తుల కాదరువై భజింపు మీ
పుడమి దివమ్ము సల్పు మిదె పో – పరమార్థము బౌద్ధ జాతికిన్.

సౌందరనందంలోని ఈ పద్యంలో తెలుగు నుడికారపు వంపుసొంపులు తామర తుంపరలు. సాహిత్యానికి సందేశం తోడు కావడటం – బంగారానికి పరిమళం అబ్బటం కంటె గొప్పదైన సన్నివేశం. అన్ని కళలకు అన్ని విద్యలకు అన్ని మతాలకు ఏకైక ధ్యేయం విశ్వశ్రేయమే.

కవి – విశ్వమానవ కల్యాణ వేదాంతి. కవి క్రాంతదర్శి; కవి ఋషి.

కవిత్వం ఏమిటంంటే – కవులు చెప్పే సమష్టి సమాధానం "మా నవత్వం" "మానవత్వం".

సాహితీ సమరాంగణ సార్వభౌముడుగా – అష్టదిగ్గజ కవి పోషకుడుగా – భువన విజయ సభా నిర్మాతగా చరిత్రలో సుప్రసిద్ధుడైన శ్రీకృష్ణదేవరాయలు వ్రాసిన ఆముక్తమాల్యదలో మొట్ట – మొదటి ఆశ్వాసం లోని చిట్ట – చివరి పద్యం

ఇది కర్ణాట ధరాధృతి స్థిరభుజా హేవాక లబ్ధేభ రా
డు దయోర్వీధర తత్ పితృవ్య కృత సవ్యోపాయనోష్ణీష ర
త్న దృగంచత్పద కృష్ణరాయ వసుధాధ్య క్షోదితాముక్త మా
ల్యద ఆశ్వాసము హృద్య పద్యముల నాద్యంబై మహిన్ పొల్పగున్.

రచయిత వ్యక్తిత్వం – శైలిలో ప్రతిబింబించటం సహజం. కటకం నుండీ కన్యాకుమారి వరకు ఎత్తిన కత్తి దించకుండా దిగ్విజయయాత్ర కొనసాగించిన జగదేకవీరుని ఖడ్గ విస్ఫులింగ ధగద్ధగలు – ఈ పద్యంలో వెలుగొందుచున్నాయి.

ఈ పద్యానికి వెనుక ఒక చారిత్రక గాథ ఉంది. శ్రీకృష్ణదేవరాయల సేనలు ఉదయగిరిని ముట్టడించాయి. ఆ దుర్గం ఉత్కళ చక్రవర్తి గజపతి ఆధీనంలో ఉంది. ఆ దుర్గాధిపతి గజపతి పినతండ్రి. చాలకాలం ఆ దుర్గం రాయలసేనలకు లొంగలేదు. మూడు నెలల పిదప రాయలే స్వయంగా అశ్వారూఢుడై సేనలను ఉదయగిరి దుర్గంపైకి నడిపించాడు. నాలుగు ప్రాకారాలు పడిపోగానే – అపజయం తప్పదని తెలుసుకొని దుర్గాధిపతి, రాయల శరణు వేడాడు. అంతకు ముందే ఆనాడు దుర్గాధిపతి – తల నరికి గాని స్నానం చేయనని ప్రతిజ్ఞ చేసిన రాయలు – ద్వాపరంలో చిక్కుకున్నాడు. ఇటు ప్రతిజ్ఞ – అటు శరణాగతుని తల నరకటం – ఎల్లాగ? అప్పుడు తిమ్మరుసు మంత్రి సూచించిన తీర్పు – శ్రీ కృష్ణదేవరాయలు – దుర్గాధిపతి శిరస్సును నరకటానికి బదులుగా అతని కిరీటాన్ని తన్ని తన ప్రతిజ్ఞ నెరవేర్చుకో వచ్చు. శ్రీ కృష్ణదేవరాయలు ఆ విధంగా చేశాడు. ఈ పద్యంలో ఆ అద్భుత చారిత్రక సన్నివేశం ప్రతిఫలించటం మాత్రమే గాక ఓజః ప్రధానమైన శైలి – ప్రౌఢ సంస్కృత సమాస ప్రయోగంలో శ్రీకృష్ణదేవరాయల పరాక్రమ వ్యక్తిత్వాన్ని స్వయంవ్యక్తం చేస్తున్నది.

తెలుగ దేల యన్న - దేశంబు తెలు గేను
తెలుగు వల్లభుండ - తెలుగొ కండ;
ఎల్ల నృపులు గొలువ - ఎరుగవే బాసాడి;
దేశ భాష లందు తెలుగు లెస్స.

అని కవికి కలలో సాక్షాత్కరించిన శ్రీకాకుళేశ్వరుడు - తెలుగు విష్ణువు అంటాడు. "దేశ భాష లందు తెలుగు లెస్స" - మొదట పలుకుడి. తదుపరి క్రీడాభిరామంలోని రాయలవారి మాట తెలుగువారి ఆత్మాభి మానానికి సదా మేలుకొలుపు పాట అయింది.

## వర్ధిష్ణు పద్య కవులకు సూచనలు

ఇది ప్రజాస్వామిక యుగం.

1960 నాటికి స్వతంత్ర భారతదేశంలో అక్షరాస్యత - నూరు శాతం సాధింపవలెనని రాజ్యాంగ నిర్దేశం. లక్ష్యసిద్ధి - ఆలస్యం అయింది కాని - సమీప భవిష్యత్తులో యావత్ భారతదేశం నూరుపాళ్ల అక్షరాస్యత సాధించక తప్పదు.

అక్షరాస్యత పెరిగిన పిమ్మట విద్యావైభవ ప్రాభవాలు పెరగటం తథ్యం. పద్య విద్యను ఆరాధించేవారి సంఖ్య - అభిమానించే వారి సంఖ్య - బాగా పెరుగుతుంది. ఇప్పటికే జనసంఖ్య బాగా పెరిగింది గదా. పూర్వకాలంలో ప్రభువులు సారస్వత పోషణ చేశారు. ఇక ఆ కర్తవ్యం ప్రజలు పెద్ద యెత్తున నిర్వహిస్తారు. పద్య కవులకు పరపతి పెరుగుతుంది.

అయితే - కవులు కాలానుగుణంగా మారాలి గదా. ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో పౌరాణిక యుగం గడిచింది. కవిత్రయం వారిది. తదుపరి శ్రీనాథుడు మున్నగువారు క్షేత్ర మాహాత్మ్యములు కాశీఖండం - భీమఖండం మొదలైనవి రాశారు. రాయల యుగం ప్రబంధ కవితకు శ్రీకారం చుట్టింది. పిదప కొన్ని ప్రబంధాలు ఏర్పడ్డాయి. నవ్యయుగంలో ఖండకావ్యములు అవతరించాయి. అవశ్య చారిత్రక భవితవ్యం - ఇక ముక్తకాలు అవతరించటం. ఒకొక్కప్పుడు - ప్రౌఢ సంస్కృత సమాసాలు పద్య కవితకు గౌరవం తెచ్చిపెట్టాయి. మనలో మనమాట - ఇతః పూర్వం - "నాకీ పద్యం అర్థం కాలేదు" అని బాహాటంగా చెప్పటానికి

శ్రోతలు సిగ్గుపడేవారు. కవి వ్రాసిన పద్యం అర్థంకాకపోతే అది ఆనాడు శ్రోతలదే లోటు. ఈనాడు కవి వ్రాసిన పద్యం అర్థం కాకపోతే అది వ్రాసిన కవిదే లోటు అంటున్నారు. అందుచే కవులు – ప్రజల స్థాయికి దిగాలి. ప్రజలకు అర్థమయ్యే భాషలో వ్రాయాలి. నేడు పాషాణ పాకంలో రాస్తే విశ్వనాథ సత్యనారాయణగారిని వలె – కవిసమ్రాట్టుగా ఆ కవిని ఆరాధించరు. ఇప్పుడు అపర వేమనలే ఆదర్శ కవులు. అందుచే ఈ క్రింది కావ్యాలలో అర్థశతాబ్ది కవితా వ్యవసాయం చేసిన అనుభవముతో పద్యకవులకు ఒక సూచన చేయ సాహిస్తున్నాను. నా ఆంతర్యంలో విశ్వనాథ సత్యనారాయణగారు ఒక మహాకవి. ప్రౌఢ సంస్కృత సమాసాలు తెలుగు కవిత కట్టుకున్న కోటలు. ప్రాచీనులు కోటలు కట్టారు. నవీనులు కట్టవలసింది పేటలు. ప్రగతి ఎప్పుడూ ప్రాతదనానికి క్రొత్తదనానికి సామరస్యం కలవటమే కావలసింది గురజాడ అప్పారావుగారి మాటలలో చెప్పాలంటే,

"కొత్త పాతల మేలి కలయిక".

ఈ సంఘర్షణ ప్రతి కవీ యెదుర్కొనక తప్పదు. కాళిదాసు – "పురాణ మిత్యేవ న సాధు సర్వం న చాపి కావ్యం నవమిత్యవద్యం" అని చెప్పాడు. కాళిదాసు అభిప్రాయం. తెలుగులో వెల్లడించాలి అంటే

పాత దయిన దెల్ల బంగారమా ఏమి?
కొత్త యైన దెల్ల చెత్త గాదు;
మంచి యెచట నున్న – ఎంచి గైకోదగు;
ప్రాజ్ఞు డైన యెడల – పండితుండు.

ఆ అభిప్రాయాన్ని ఈనాడు త్రోసించి చెప్పాలి.

కొత్త దయిన దెల్ల గొప్పదే అనరాదు;
పాత దైన దెల్ల రోత కాదు;
మంచి ఎచట నున్న పొంచి గైకోదగు
ఉండు గొప్పదనము రెండు చోట్ల.

జగత్తు అంటేనే మారే ప్రపంచం.

కొత్తదనమును కనలేక కుమిలి క్రుంగి
ప్రసవ వేదన పడుచుండు – ప్రాతదనము;

విశ్వ విప్లవ ప్రస్థాన వేధ నుండి,
ఉద్భవించుత నూత్న యుగోదయమ్ము.

ఇప్పుడు నవ్య కవులు కాలపర్యాయ వేత్తలు కావాలి.

1. ఇతివృత్తం :- ఇతివృత్తంలో నవ్యత గోచరించాలి. తిరిగి రామాయణం - పురాణాలు తెలిగించటం ఎందుకు? నేడుగూడ తెలుగులో లెక్కకుమిక్కిలి అనువాదాలు సంస్కృత రచనలకు అవతరించుచున్నాయి. తెలుగులో కొన్ని వందల పద్య అనువాదాలు భగవద్గీతకు ఉన్నాయి.

అనువాదం మంచిది కాదని నా అభిప్రాయం కాదు. సాంస్కృతిక పర పరాగ సమ్మేళనమే ప్రగతి. ఆ పని అనువాదం మాత్రమే చేయగలదు. తెలుగులో ఉమర్ ఖయ్యాంకు శతాధిక భాషాంతరీకరణాలు ఉన్నాయి.

అరయ - వధువు వంటి దనువాద కళ యన్న
సుందరాంగి కాదు సుగుణ యైన;
అందకత్తె యైన - అవిధేయురాలౌను
సొంత రచన మేలు - సులువు - శుభము.

2. శైలి ద్రాక్షాపాకంలో ఉండటం మంచిది.

అంటే కదళీపాకం - నారికేళ పాకాలు మంచివి గావు అని కాదు. సన్నివేశాన్ని బట్టి - రసాన్ని బట్టి శైలి మార్చక తప్పదు. రచన నవ రస రుచిరంగా ఉండాలి. ఏకైక శైలి మంచిది కాదు. తిక్కన భావానుగుణంగా శైలిని మార్చటం కద్దు. మాతృదేశ సంరక్షణార్థం ఆత్మాహుతికి - సిద్ధపడి నిలిచి - శత్రుసేనలను ఎదుర్కొని సహప్రతులైన శివాజీ ప్రభృతులను తప్పించుకొని పొమ్మని చెప్పే - వీరుని నోట, ఓజఃప్రధానమైన శైలి వెలువడక తప్పదు.

"చంచత్ ఘోర శతఘ్ని గోళ నివహ జ్వాలావలాభీలమై
పంచారించు మొగల్ చమూ బలము గెల్వం జాల మెట్టైన యత్
కించిత్ కాలము లోయలో నిలిపెదన్ - క్షేమంబుగా రక్షణో
దంచద్ రాజ గడంబు చేరు డిదె కర్తవ్యమ్ము వీరాగ్రణీ"

- ఛత్రపతి శివాజీ (నాటకం)

శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు విజయశ్రీ రాసేటప్పుడు - ద్రాక్షాపాకంలో మాత్రమేగాక - ఓజః ప్రధానమైన శైలిని యథోచితంగా వాడమని చెప్పి "రాజ్యము వీర భోజ్యము" అని పద్యం అందించాను.

3. శీర్షికలు : శీర్షికలు సమకాలీనతకు ప్రాధాన్యం ఇవ్వవలెను; అనగా సామాజిక స్పృహ - కవులు ప్రజాస్వామిక యుగంలో ప్రతిబింబించాలి.

4. వ్యాకరణం

వ్యావహారిక భాషలో వ్రాయబడే రచనలు వ్యాకరణాన్ని బాహాటంగా ఉల్లంఘిస్తున్నాయి. పద్య కవులకు వ్యాకరణ పక్షపాతం ఉండటం మంచిదే. అయితే వ్యాకరణాన్ని పద్యకవులు పాదరక్షల వలె ఉపయోగించుకోవాలి గాని శిరస్సుపై కిరీటం లాగ ధరించరాదు.

5. నిర్వచన పద్య నాటికలు వ్రాయవచ్చు ఆధునిక కవులు.

6. నిఘంటు సాయం లేకుండా పద్యకవిత చదివేందుకు వీలుగా ఉంటే ఎంతో బాగుంటుంది.

7. బరువు తక్కువ-బలం ఎక్కువ గల పదజాలం-సజీవ శబ్దాలు - సమాజంలో. ప్రజల నాలుకలపై నలిగే శబ్దాలు వాడటం మంచిది. ఉదాహరణ వేమన పద్యాలు.

## ఛందస్సు

చిట్టచివరగ చెప్పదగి నట్టిది ఛందస్సు. ప్రపంచ భాషలలో ఒక అధ్యాయం ఒకే ఛందస్సులో ఉంటుంది. కాని తెలుగు పద్య కవితా శిల్పం లోని ప్రత్యేక విశిష్టత - ఛందో వైవిధ్యం. మొదటి పద్యం చంపకమాల ద్వితీయపద్యం కందం తృతీయం సీసం ... కావచ్చు.

భావానుగుణంగా రచనలలో భాష - శైలి మార్చటం మంచిది అని ఆలంకారికులు అందరూ అంగీకరించిన అంశమే. ఇక ఛందస్సు? తెలుగు ఛందస్సు కూడ యథోచితంగా మార్చవచ్చు. ఇది తెలుగు పద్య కవులకు పట్టిన అదృష్ట విశేషం.

ఇక తెలుగులో వృత్తాలకు యతిప్రాసలతోపాటు అదనంగా మరికొన్ని యతి ప్రాసలు ఐచ్ఛికంగా కూర్చుకోటం మంచిది. ఉదాహరణకు శ్రీ పాపయ్య శాస్త్రిగారు వ్రాసిన ఒక పద్యం - శ్రీనివాసోదాహరణంలో

విరికై తుమ్మెద లీల నా హృదయ ముప్పిళ్లూరు, వెల్లప్పుడున్
హరికై - సత్కరుణా సుధా లహరికై - ఆనంద మందాకినీ
ఝరికై - నిత్యనివాస శేషగిరికై - సందృప్త దైత్యేంద్ర కే
సరికై - సుందర మందహాస సుషమా సౌభాగ్య సంచారికై.

వేయి సంవత్సరాలుగా నన్నయ నుండి నేటివరకు వందలు వేల కవులు ఛందస్సుతోపాటు అదనంగా మరికొన్ని అందచందాలు పద్యరచనలో కూర్చుకున్న వారే.

ఇక కందంలోని గణాలన్నీ చతుర్మాత్రా గణములే. అయితే - సీసం - తేటగీతి - ఆటవెలది ద్విపదలలో వాడదగినవి - ఇంద్రగణాలు - సూర్యగణాలు. సూర్యగణాలు రెండే III, నగణం UI మూడు మాత్రలు గలం. ఇంద్రగణాలు ఆరు UUI, = తగణం UII; భగణం, UIU రగణం. IIII = నల IIIU నగం. IIUI = సల. ఆరింటిలో 4 పంచమాత్రాకములు 2 భ. నలలు చతుర్మాత్రాకములు. చతుర్మాత్రాకములైన ఈ UII, IIII గణాలను వాడకుండా ఉంటే ఆటవెలది ``ద్యం నడక కుంటుపడదు.

ఆటవెలది:

ఇది సీసం - తేటగీతి - పద్యాలలో ఆచరణ సాధ్యంకాకపోవచ్చు ఆటవెలది లో నాలుగు గణాలు UUI త, UIU ర, IIUI సల, IIIU నగలు మాత్రమే. ఇంద్రగణాలలో వాడటం అవసరం. అప్పుడు ఆటవెలది తాళం తప్పదు. నా యీ సూచనలు ఛందస్సు లోపలి కూర్పులేగాని మార్పులు కావు. లాక్షణికులు ఆరు గణాలను అంగీకరిస్తే - నా సూచన ప్రకారం నాలుగు గణాలు మాత్రమే వాడాలి. సీసపద్యంలో - లాక్షణికులు సర్వ లఘు సీసానికి గణములు అయిదు లఘువులు నిర్దేశించారు కాబట్టి నా సూచనలోని వినుమ పూర్వ లాక్షణికుల గుర్తించినదే. అయితే - తెలుగు అజంత భాష కాబట్టి చదివేటప్పుడు లఘువు గురువు చేసి, ద్విపదలను తాళానికి సరిపెట్టగలుగుచున్నారు పాడేవారు. మరికొన్ని సూచనలు -

ద్విపదలో విధిగా యతిప్రాసలు పాటించాలి. వీలైతే అంత్యానుప్రాస చేర్చాలి.

ఇక గురజాడ అప్పారావుగారు వ్రాసిన క్రొత్త పేరు పెట్టిన ముత్యాల సరాలు పాత ఛందస్సుకు కొత్త పేరు పెట్టటమే.

ముత్యాల సరాలలో ఒక చోట యతి ఒక చోట ప్రాస కాకుండగా యతి ప్రాసలు నియతం చేయాలి.

ఇప్పటికే తెలుగు ఛందస్సు దేశ భాష లందు బహుశః ప్రపంచ బాషలందు సాటి లేని సంగీత సాధ్వనం గలది. ఈ చిరు కూర్పులు చేర్పులు ఆ సంగీత సాధ్వానికి పరాకాష్ఠ కల్పించువట్టివే –

కవుల కంటె తుహిన కర్పూర నిభ కీర్తి
తెచ్చి దెవరు నీకు తెలుగు తల్లి?
సాహితీ తరంగ సంగీత రస ధుని!
దేశ భాష లందు – తెలుగు లెస్స.

## పద్య కవిత – భవిష్యత్ ప్రస్థానం

పూర్వకవులు వ్రాసిన పద్యాలు ఎన్నో కాలగర్భంలో మరుగువడి పోయాయి. నన్నయ – మహాభారతం రచనకు పూర్వం ఎన్నో పద్యాలు వ్రాసియుండాలి. అట్లే తిక్కన ఎఱ్ఱన పోతన మొదలైన కవులు. అవి అన్నీ కాల మహాప్రవంతిలో కొట్టుకొనిపోయాయి. ఎఱ్ఱన వ్రాసిన రామాయణం కను పించటం లేదు. అట్లే సప్తశతికి శ్రీనాథుడు చేసిన అనువాదం. అంతేగాక – ఆధునిక యుగంలో కవిత్వంపై అభిమానం సన్నగిల్లింది. పూర్వకాలంలో వలె మహాభారతం రామాయణాదుల వంటి బృహద్గ్రంథాలు ఆధునిక యుగంలో అవతరించే అవకాశం తక్కువ. ప్రబంధ కవులు – పురాణాలనుండి ఇతివృత్తాలు ఏరుకున్నారు. భావ కవితా యుగంలో ఖండకావ్యాలు ఉదయించాయి. ఇక ఆధునిక కవులు – చిరు కవితలు – ఎన్నుకొని చాటువులు ముక్తకాలు వ్రాయవలసి ఉంటుంది. యుగ ధర్మం అనుసరించి – ఈ నవ నాగరిక

ప్రపంచంలో - బృహద్ గ్రంథాలు చదివే అభిరుచి-అభినివేశం సహృదయులకు గూడ లభించటం కష్టం. అంతేగాక వైజ్ఞానిక విప్లవం వెల్లివిరిసిన ఆధునిక కాలంలో దిగంబర కవులు - అభ్యుదయ కవిత్వములు మినీ కవితలు ఆవిర్భవించటంలో ఆశ్చర్యం లేదు.

హేతువాద నిత్య చైతన్య జగతిలో
శ్రోత్రియత్వమునకు చోటు లేదు;
వాలఖిల్యుల కిక - కాలదోషము పట్టె
వెల్లి విరిసె - జ్ఞాన విప్లవమ్ము.

సంప్రదాయ పరాయణులు మారే జగత్తులో మారరు. అంతేగాక, సంప్రదాయం శ్రోతియుల చేతిలోనే దెబ్బతింటుంది.

సత్య మెపుడు - ఓడి - సంగ్రామ రంగాన
శాత్రవులకు చిక్కి - చావ లేదు !
సంహరింపబడెను - సంరక్షకుల చేత
భక్తి తోడ - యజ్ఞ పశువు పోలె.

అభ్యుదయ కవులు - దిగంబర కవులు - ఛందోబద్ధమైన పద్యకవితం రూపంలోనే వారి భావాలు వెల్లివిరియచేస్తే ఎంత బాగుంటుంది! అట్లే - పద్య కవులు అభ్యుదయ దిగంబర శీర్షికలు స్వీకరిస్తే ఎంత బాగుంటుంది?

అసలు - ఆంధ్ర కవితా సంప్రదాయం - జగద్ధితారాధన. ఆ సంప్ర దాయాన్నే అభ్యుదయ కవులు దిగంబర కవులు - ఛందస్సు లేకుండా పాటించారు. కవితకు అంతరాత్మ విశ్వ శ్రేయస్సు.

ఛందస్సు - ఆహార్యం మాత్రమే. ఆహార్యం విడనాడిన ఆధునిక కవులు "దిగంబర కవులం" అని చెప్పుకోటం సమంజసమే అయితే - దుష్టత్వాన్ని ఖండించటమే దిగంబర కవిత్వం అయితే వాల్మీకి దిగంబర కవి. వేమన అక్షరాలా దిగంబర కవి. కవి సమాజానికి బహిరంతరాత్మ.

ప్రతి కవీశ్వరుండు - పైగంబరుడు సదా,
ధర - నిరుక్త వక్త; ద్రష్ట - స్రష్ట;
ప్రతి కవీశ్వరుండు - వసుధైక పౌరుండు;
అంతరాత్మలో - దిగంబరుండు.

కాలానుగుణంగా విలువలు మారటం సహజం.

"తాజమహలు కట్టటానికి రాళ్లెత్తిన కూలీ లెవరోయ్?
ముంతాజ్ ఎక్కిన పల్లకి మోసిన బోయీ లెవరోయ్?"

ఈ ప్రశ్నతో సాహితీప్రియంభావుకుడు - శ్రీశ్రీ కవి - సహృదయుల హృదయాలలో సరిక్రొత్త విలువలు పండించగలడు.

"శ్రమకు ఓర్చి - ఎవరు - రాళ్ల నెత్తిరి చెప్పు
తాజ మహలు కట్టు తరుణ మందు ?
మోసినట్టి దెవరు - ముంతాజు పల్లకీ?
మాయదారి చరిత - మరచిపోయె".

అవి - ఛందోబద్ధంగా ఆ భావం పద్యంలో పెట్టవచ్చు.

ఎప్పు డైన కవిత - ఏకాంత చూళికే;
గుండె లోని అగ్గికొండ - కవిత;
ప్రౌఢ పద నిరూఢి - పై పచ్చ గడ్డియే;
అచ్చ మైన కవి - దిగంబరుండు.

కాలం తెచ్చిన మార్పు - ఛందస్సు మాత్రమే కాదు. విలువలలో మార్పు వచ్చింది. వ్యవధానంలోనూ మార్పు వచ్చింది. ఇప్పుడు - పెద్ద పెద్ద కావ్యాలు వ్రాసేవారు లేరు. ఉన్నా చదివే వ్యవధి ఎవరికి ఉంటుంది?

వేయి మంది - అపర వేమనల్ తెలుగులో
అవతరింప వచ్చు - నవ యుగాన;
ఉద్భవింప లేడు - ఒక్క తిక్కన యైన
తెలుగు భూమి మీద తిరిగి నేడు.

ఆధునిక యుగంలో పద్య కవితలు - వెన్నెల వడగళ్ల వంటివి ముక్తకాలో - చాటువులు ఇక మీద అవతరించాలి. అంతే.

అన్ని రోగములకు - ఔషధమ్ములు వచ్చె;
సగటు వయసు పెరిగె జగతి యందు;
జబ్బు చేసి యింక - చావ నక్కర లేదు
మందు వలన తప్ప - మనుజు లెవరు ! --- ప్రగతి గీత

నేడు - హృదయంగమములైన వచన మినీ కవితలు తామరతంపరగా వెల్లివిరుస్తున్నాయి. మఖలో పుట్టి నట్టివి పుబ్బలో గిట్టునట్టివి కొన్ని ఉన్నాయి. ఇవి ఏ నక్షత్రంలో పుట్టినా - బాలారిష్టానికి గురియై గాలిలో తేలి ధూళిలో కలిసి పోయే ప్రమాదం ఉంది. ఛందస్సు - కవితకు కవచం వంటిది.

విషయ సంకలనము - విజ్ఞానమా? కాదు;
ఇటుక ఆము వేరు - ఇల్లు వేరు;
అస్థిపంజరమ్ము - అసలు దేహము కాదు;
ప్రత్తి వేరు - నేత బట్ట వేరు.

వాన చినుకు తోడ - పచియించె సెలయేరు;
"రమ్ము - స్వాగతమ్ము - నమ్ము నన్ను,
అడుగ వద్దు దారి - కడలి చేర్చెద నిన్ను;
కదలి పోదు ఎడద కమల తోడ"

"ఇది వైజ్ఞానిక యుగం. కవితకు కాలదోషం పట్టింది" అనేవారు ఉన్నారు. నవ నాగరకత - తలకాయలు పెంచుకుంటున్నది. పది తలల రావణాసురులు - వంద తలల మైరావణులు - వేయి తలల హైరావణులు ఉద్భవించవచ్చు.

ఎగురు మానవుండు - గగనాన విహగమై,
గండు చేప రీతి - కడలి ఈదు;
పుడమి మనిషి వోలె - నడువ లేడేలకో!
ఇంతకంటె - వేరు వింత కలదె?

గ్రహాంతర యాత్రలు ప్రారంభించిన విజ్ఞానం - దూరాలను నిర్మూలించి మానవులను ఇరుగుపొరుగు వారిగా చేయగలిగిందిగాని సోదరులుగా స్నేహితులుగా

చేయలేక పోయింది. ఇంకో ప్రపంచ యుద్ధం వస్తే - ఉదజని బాంబులతో సంగ్రామం జరుగుతే - ఈ భూలోకంలో మానవుడే అంతరించవచ్చు. అప్పుడు ఏ చలి చీమలో మానవునిపై స్మారక గీతాలు వాటి వాఙ్మయంలో వ్రాసుకోవాలేమో.

"ఈ పెను మంటి దిబ్బ వసియించి రాకాపోక నాడు మానవుల్ !
పాపము శేయుచీ విభవ పొరగులై - ప్రకృతిన్ జయించి, వి
శ్వాపర సృష్టి చేసి ప్రళయాంతక బుద్ధిని గుండె లేక - ఆ
త్మోపహతిన్ వినాశనము నొందిరి అందరు జ్ఞాన శూన్యులై.
అనుచు హతశేషమై అవని మిగులు
ఏ పిపీలికలో రచియించు కొనును
కరుణ గీతులను తమ వాఙ్మయము లోన !
ఇది నర చరిత్ర భవితవ్య మేమొ తుదకు".

కవిత కర్తవ్యం - నరుల గుండెలు కరగించటమే - పండించటమే. కవిత - మానవుడు సృష్టించుకున్న కళలలో ఉజ్జ్వలము ఉదాత్తము. నింగిని నేలను - హిమవన్నగాన్ని సముద్రాన్ని - మెదడును హృదయాన్ని అనుసంధించే అమృత మందాకినీ తరంగిణి - కవిత్వం.

సృష్టిలో క్రమపరిణామ వికాసంలో వానరుడు నరుడుగా - రూపొందినట్లు శాస్త్రజ్ఞుల వాదం. మానవుడు మరి అధి మానవుడుగా ప్రగతిపథంలో రూపాంతరం చెందాలంటే - దోహదం చేయగల శక్తి సామర్థ్యాలు - అమృత రస తరంగిణియైన కవితకే కలవు.

వానరుండు - మారి - పరిణామ సృష్టిలో
పెరిగి మెదడు, ఎడద - నరుడు అయ్యె;
అధిగమింప - కవిత - ఆ సహస్రారమ్ము
అవతరించుగాత - "అధినరుండు".

## ఆంధ్ర నాటక రంగం

ఆంధ్ర సారస్వతంలో కేవలం ఆధునిక యుగంలో అవతరించిన క్రొంగొత్త ప్రక్రియ - "నాటకం". ఆంధ్రదేశంలో చతుర్విధాభినయమయ పదాలు కోకొల్లలు. యక్షగానాలు - వీధి భాగవతాలు యుగయుగాంతరాలుగా కనిపిస్తు న్నాయి కాని - "నాటకాలు" - ఇదివరకు లేవు. సంస్కృత సాహిత్యం - నాటకాన్ని ఉపాసించింది సంస్కృత సాహిత్యాన్ని తెలుగులోనికి అనువదించారు గాని పూర్వకవులు నాటకాలను - 'దృశ్య కావ్యాలను' శ్రవ్యకావ్యాలుగానే తెలిగించారు. "కావ్యేషు నాటకం రమ్యం, నాటకేషు శకుంతలా" అని పేరు కెక్కిన శాకుంతలం గూడ తెనుగులో శృంగార శాకుంతల ప్రబంధంగానే అవతరించింది.

సంస్కృత ఆలంకారికులు - "నాటకాంతం హి సాహిత్యం" అన్నారు. పాశ్చాత్యుల విద్యాగురువులు ప్రాచీన గ్రీకులు కూడా - విషాదాంత నాటకాలకే అగ్ర తాంబూలం సమకూర్చారు. ఆగ్లంలో విశ్వవిఖ్యాతిని ఆర్జించిన కవి - షేక్స్పియరు - నాటక రచయితయే.

ఆంగ్ల సంపర్కం వల్ల ఆంధ్రదేశంలో నాటకం - దృశ్యకావ్యం అవతరించింది. ఆదిలో తెలుగు నాటకాలకు మాతృకలు మాత్రము - సంస్కృత నాటకాలే. నాటకం సమాహార కళ. సంయుక్త సమగ్ర కళ. ప్రాక్తన మానవుని హృదయం రస తరంగిత మైనప్పుడు అతడు ఆడాడు - పాడాడు. ఆ ఆటవిక తాండవాన్ని ప్రస్తరిస్తే - తాళ లయాన్వితమైన వాదం - విన్యాస విక్షేపాత్మకమైన నృత్తం - అర్థ భావ సమన్విత మైన శబ్దంగా సాక్షాత్కరిస్తాయి. ఇవి -, యుగ యుగాంతరాల పిమ్మట గానం - నృత్యం - కవిత్వం అనే పరిణామరమణీయమైన గొప్ప కళలుగా మారి చిట్ట చివరకు నాటకంలో సంగమించాయి. అందుచే "కావ్యేషు నాటకం రమ్యం - నాటకాంతం హి సాహిత్యం" - సార్థక సూక్తులు.

ఆధునిక యుగంలో నాటకాలు తామరతంపరగా అవతరించాయి. వీరేశ లింగం అనువదించిన అభిజ్ఞాన శకుంతలం ఉదాహరణగా పేర్కొనవచ్చు. అభిజ్ఞాన శాకుంతల నాటకానికి - ఆధునిక యుగంలో శతాధికంగా అనువాదాలు ఉద్భవించాయి. ఆంధ్రనాటక రంగస్థలాన్ని - ఉఱ్ఱూత లూపిన నాటకాలు ఎన్నో

ఉన్నాయి. అభిజ్ఞాన శాకుంతలం = వీరేశలింగంగారి అనువాదం. చిలకమర్తి వారి గయోపాఖ్యానం - ధర్మవరం రామకృష్ణమాచార్యుల వారి నాటకాలు - పానుగంటి వారి నాటకాలు - శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి బొబ్బిలి - వేదం వేంకటశాస్త్రిగారి ప్రతాపరుద్రీయం - బలిజేపల్లి లక్ష్మీకాంతంగారి సత్యహరిశ్చంద్ర - కాళ్లకూరి నారాయణరావు చింతామణి - వరవిక్రయం శ్రీరాములు సచ్చిదానంద శాస్త్రి - సావిత్రి అన్నిటినీ మించి వేలకొలది సార్లు ప్రదర్శింపబడిన ఉద్యోగ విజయాలు తిరుపతి వేంకట కవుల రచనలు.

ఆంధ్ర దేశంలో - నాటక పద్యాలు - రంగస్థలం పైననే గాక దిన్ దిగంతరాలు మారుమ్రోగాయి. ఇప్పటికీ ఆంధ్రుల హృదయాంతరాళాలలో ఆ ప్రతి ధ్వనులు వినిపిస్తూనే ఉంటాయి. బహుశః ఆచంద్రంతారార్కం ఆ పద్యాలే సహృదయుల హృదయాలలో చిరంజీవాలుగా నిలిచి ఉంటాయి. మచ్చుకు కొన్ని -

గయోపాఖ్యానంలో శ్రీకృష్ణుని శపథం

జలనిధు లింకు గాక - కుల శైలము లేడును గ్రుంకు గాక - ఆ
జ్వలనుడు వేడిమిన్ విడిచి చల్లదనంబును దాల్చు గాక - ఈ
జలజహితుండు పశ్చిమ దిశన్ జనియించెడు గాక - ఇంక ఆ
ఖలు గయు ఉత్తమాంగమును ఖండన చేసెద చక్రధారలన్.

నారదుని ఉపదేశం ప్రకారం గయుడు అర్జునుని శరణు వేడి అభయ ప్రదానం పొందాడు.

అప్పుడు అర్జునుడు చేసిన శపథం

నిటలాక్షుం డి పుడెత్తి వచ్చినను రానీ అన్నయుండమ్ము లుబ్
విట తాటంబున బాసిపోయినను పోనీ, కృష్ణుడే వచ్చి వ
ద్దిటు పార్థా యననీ మరేమయిన గానీ లోకముల్ బెగ్గిలం
బటు దర్పంబున నిర్చి ఈ గయుని ప్రాణం బేను రక్షించెదన్.

పాపం - సుభద్ర పుట్టినింటి వారి మధ్య మెట్టినింటివారి మధ్య పడి నలిగిపోతుంది. ఆమె అచ్చ తెలుగు ఆడబడుచు -

శ్రీ కృష్ణుడు సుభద్రతో :

వంత యొకింత లేనటుల బాల్యము నుండియు పుట్టినింటి వా
రెంతటి భాగ్య మిచ్చినను ఏ విధి చూచిన గాని కాంతకున్
సుంతయు ప్రేమ యుండ దిక సోదరు లాదిగ బంధు కోటిపై !
కాంతలు మధ్య వచ్చిన మగం డనినన్ పడి చత్తు రెంతయున్.

శ్రీ కృష్ణుడు అర్జునునితో

పేరు ధర్మరాజు - పెను వేప విత్తంద్రు;
మాట తేనె తేట - మనసు విసము;
నేతి బీరకాయ నీ యుధిష్ఠిరు శబ్ద
మెరుక లేని వాని యెదుట పొగడు !

సత్యహరిశ్చంద్ర నాటకంలో నుండి

మరణించిన పుత్రుని - వల్లకాటికి తీసికొని వచ్చిన చంద్రమతిని - కాటి సుంకం చెల్లించమని అడుగుతాడు కాటి కాపరియైన హరిశ్చంద్రుడు. ఆమె తన వద్ద ఏమీ లేదని వాపోతుంది. అప్పుడు హరిశ్చంద్రుని పద్యం

దళమౌ పయ్యెదలో నణంగియు సముద్యత్ కాంతు లీరెండలన్
మలయింపన్ దెసలన్ త్వదీయ గళసీమన్ బాలసూర్య ప్రభా
కలితంబై వెలుగొందు చున్నయది -'మాంగల్యంబు కాబోలు! ఏ
వెల కైనన్ తెగనమ్మి - నీ సుతునికై - వెచ్చించినన్ చెల్లదే !!

ఈ పద్యం - విన్న ప్రేక్షకులు వెనువెంటనే 'ఒన్స్ మోర్' నినాదాలు - చేసేవారు మిన్ను ముట్టేటట్లు !

కాశీరాజు - చంద్రమతిని శిశుహంత్రి యని నిందమోపి ఆమెను వధించ మని ఆజ్ఞాపిస్తాడు. ఆ కర్తవ్యం కాటి కాపరియైన హరిశ్చంద్రుని పై పడింది. అప్పుడు హరిశ్చంద్రుని పద్యం

హృదయమా ! సతికి నీ ఋణ మెల్ల సరిపోయె
నీ కేటి ఆస ఈ నెలత పైన ?
మోహమా ! నీ కాలము గతించె మా చెంత,
బ్రతుకు మెందేని దంపతుల పొంత !

దుఃఖమా ! నీ వున్న దొసగు తప్పదు మాకు
తొలగి పొమ్మింక మా తలపు వీడి;
ఖడ్గమా ! మానినీ కంఠ రక్తము గూడ
చవి చూడ గలవు ! విశ్చలత గొనుము,
సత్యమున కయి ఈ హరిశ్చంద్రు వంశ
మంతరించెడు గాక శ్రీహరుని మీద
మనసు గురి చేసి, హా చంద్రమతీ! త్వదీయ
కంఠ మర్పింపు నీ పతి ఖడ్గమునకు !!

కాటి కాపరియైన హరిశ్చంద్రుడు చితిలో కాలే శవాన్ని చూచినప్పుడు :

మాయామేయ జగంబె నిత్య మని సంభావించి మోహంబునన్
నా యిల్లాలని నాదు పుత్త్రు డని ప్రాణం బుండు నందాక ఎం
తో యాల్లాడిన ఈ శరీర మిపు డిందున్ కట్టెలన్ కాలుచో
ఆ యిల్లాలును రాదు ఆ సుతులు తోడై రారు తప్పింపగన్.

బళ్లారి కె. సుబ్రమ్మణ్య శాస్త్రి రచించిన లవకుశ నుంచి సీత - తన్ను అరణ్యంలో దించి మౌనంగా నిలిచిన లక్ష్మణునితో చెప్పిన పద్యం

ము న్నారావణు ఘోర శక్తిని ధరన్ మూర్ఛిల్లుచో ఆజిలో
సన్నాహంబున ఇంద్రజిత్తును వడిన్ జక్కాడుచో దైత్యులన్
ఛిన్నాభిన్నము చేయుచో అరయగా చింతింపవే లక్ష్మణా
కన్నీరేటికి గల్గె తండ్రి చెపుమా కల్యాణమే రాముకున్.

చింతామణి నాటకం నుంచి

భవానీ శంకరుడు చింతామణితో చెప్పిన పద్యం

తాతల నాటి క్షేత్రము లెల్ల తెగ నమ్మి
దోసిళ్లతో తెచ్చి పోసినాను;
తండ్రి కట్టిన యిల్లు దాయాదులకు విక్ర
యించి వస్తువులు చేయించినాను;
అత్తవా రిచ్చిన అంటు మామిడి తోట
ఈవు కోరగ వ్రాసి ఇచ్చినాను;

కులసతి మేని సొమ్ములు పుస్తెతో గూడ
కొనివచ్చి నీ యింట గుప్పినాను;
కులము వారెల్ల నీ కిది కూడ దనిన;
భార్య నూతికి గోతికి పరుగు లిడిన;
లెక్క సేయక నీ యిల్లు కుక్క వోలె
కాచుకొని యిట్టు లున్నాడ కవిని నేను.

బిల్వమంగళుని తీసికొని రమ్మన్న చింతామణితో భావాని శంకరుడు - పరస్త్రీ పరాఙ్ముఖుడు బిల్వమంగళుడు అని సమాధానం చెపుతాడు - చింతామణి అప్పుడు చెప్పిన పద్యం

ఇంతులు తారసిల్లు వరకే - పురుషాగ్రణు లెంత లేసి సా
మంతము లాడినన్ బిగువు మాటలు పల్కిన - కామినీ మణీ
కాంత దృగంచలాగ్ని కలికాలవ మించుక పాటి సోకనే?
ఎంతటి పండితుండ యిన ఇట్టే కరుంగడె వెన్న పోలికన్.

చింతామణికి స్వప్నంలో శ్రీకృష్ణ సాక్షాత్కారం లభించినపుడు మేల్కొని చెప్పిన పద్యం

పాపిని భ్రష్టురాల అతి బానిసనై బహుసీచ వృత్తి లో
రేవులు మాపులం బడి చరించిన మాటయె నిక్క మింక ఆ
పాపపు దారి త్రొక్కను - భవచ్చరణాబ్జయుగంబు సాక్షిగా;
నా పయి ప్రేమ నిల్పి యదునందన కృష్ణ తరింప చేయవే.

జ్ఞానోదయమైన పిదప బిల్వమంగళుడు చెప్పిన పద్యం. ఒకనాడు తనకు ప్రేయసియైన చింతామణిని తల్లిగా సంబోధిస్తాడు.

తల్లిరో ! నీదు వాగమృత ధారలు తేరి కొనంగ జేసె - మూ
ర్ఛిల్లిన అంతరాత్మను - నశించెను కన్నుల లోని కావరం
బెల్ల, శమించె నిక్కముగ ఇంద్రియ వాంఛలు - మేలుకాంచె - నా
ఉల్లము దుష్ట మైన కలనుండి - ఎరింగితి ఎల్ల దోషముల్.

శ్రీముత్తరాజు సుబ్బారావు వ్రాసిన శ్రీకృష్ణతులాభారం నుండి

ఇక నీ గీచిన గీటు దాట వని ఎన్నో సార్లు నా దండ ఇ
చ్చకముల్ నచ్చగ బల్కి పల్కి తుదకా చందాన స్వస్త్రీలలో
ఏకసక్కెంబుల పాలు చేసి ఇటు రావేలా ఒకేసారి కు
త్తుక ఖండించి సపత్నులం గలిసి సంతోషింపగా రాదొకో!

నారదుడుః శ్రీకృష్ణుని దానంగా పరిగ్రహించినప్పుడు -

ఏమి తపంబొనర్చి జనియించిన వాడనొ నేడు సత్య భా
మా మహిళా వ్రతంబున సమంచిత రీతి పరిగ్రహించితిన్
కామిత సిద్ధి దాయకుని ఖండిత దుష్ట నిశాటు, సర్వ మ;
ర్త్యామల పూజితాంఘ్రుఁ, నభిలాష విదూరు అనంతు అచ్యుతున్.

తులాభార సమయంలో నారదుడు ః సత్యభామ ప్రశ్నకు సమాధానంగా

అండ పిండ వేధొండ సంహతుల నెల్ల
సుప్త గతి బొజ్జలో నుంచుకొన్న యట్టి
తోయజాక్షుని తుల దూయగలవె నీవు?
ధనముల ధనేతరములను తరళ నయన !

పానుగంటి లక్ష్మీనరసింహరావుగారి

పాదుకాపట్టాభిషేకమునుండి దశరథుడు - మునులతో

కొడుకు లెంద రున్న పెద్ద కొడుకు తన ము
ఖాగ్ర మున నున్నపుడె తండ్రి అలరు మిగుల
ముండులను పెద్ద ముల్లు పండ్రెండ్రు చేరి
నపుడె గంట గొట్టెడు గడియార మటుల.

పద్యాల పుట్ట - పాండవ ఉద్యోగ విజయాల నాటకాలు.

తిరుపతి వేంకట కవులు వ్రాసినట్టి నాటకాలు విద్యావంతుల మాట అటుంచి - నిరక్షర కుక్షులైన జానపదులు కూడ ఉద్యోగ విజయాలలోని పద్యాలు - రాగం తప్పకుండ చదివేవారు ఎందరో ఉన్నారు.

అర్జునుడు ః ద్వారకా నగరం ప్రవేశిస్తూ చెప్పిన పద్యం

అదిగో ! ద్వారక, ఆల మంద లవిగో! అందందు గోరాడు, అ
య్యదియే అగడ్త - అవె రథ్యల్! వారలే యాదవుల్ !
యదు సింహుండు వసించు మేడ అదిగో! అలాన దంతావళా
భ్యుదయంబై వరమందిరాంతర తురంగోచ్ఛ్రండమై పర్వెడున్.

ధర్మరాజు : శ్రీ కృష్ణునితో సంధికి అతనిని రాయబారిగా పంపే ముందు

తమ్ముని బిడ్డ లంచు మది దల్పడు; పుత్త్రుల లోన గూడె, రా
జ్యమ్మున మాకు పాలొసగ డంధ నృపాలు డటంచు మొన్న నీ
సమ్ముఖ మందె తెల్చె గద సంజయు డా కురురాజు లుబ్ద చి
త్తమ్మున కన్ను గాన డిక తప్పదు యుద్ధము బంధు నాశమున్.

సంధి యొనర్చి మా భరత సంతతి కావుము లేద యేని గ
ర్వాంధుల ధార్తరాష్ట్రుల సహాయులతో దునిపింపు మో జగద్
బాంధవ రెండు కర్జముల భారము పెట్టితి మయ్య నీ భుజ
స్కంధము నందు; తారసిలు గావుత మాకు యశంబొ రాజ్యమో !

సహదేవుడు : శ్రీకృష్ణునితో

పోరికి సిద్ధమై అడుగ బోయిన వారము గాన - వారు మా
దారికి రాకపోవుట విదారిత కౌరవ కంఠలుంఠ రక్త ధా
రా రమణీయ రక్తిమ మరాళకరాళ కృపా కుమార సే
వారతి దోగియున్న కరవాలమునంబడు యోగ ముండినన్

శ్రీకృష్ణుడు : రాయబారిగా కౌరవ సభలో

అలుగుటయే యెరుంగని మహామహితాత్ముడజాత శత్రువే
అలిగిన నాడు - సాగరము లన్నియు ఏకము కాకపోవు - క
ర్ణులు పదివేవు రైన అని వొత్తురు చత్తురు రాజరాజ ! నా
పలుకులు విశ్వసింపుము విపన్నుల లోకుల గావు మెల్లరన్.

కర్ణుడు : శ్రీకృష్ణునితో (రహస్య సమావేశంలో)

సూతుని చేతికిన్ దొరికి - సూత కళత్రము పాలు త్రావి - ఆ
సూతుని అన్నమున్ గుడిచి సూత కులాంగన యందు నందన
వ్రాతము గాంచి నేటి కొక రాజ కుమారుడ నంచు తెల్ప - నా
చేతము సమ్మతించునె, ఇసీ ఎవరేగతి సిగ్గు మాలినన్.

అర్జునుడు - చేసిన ప్రతిజ్ఞ - సైంధవ వధకు ముందు శ్రీకృష్ణునితో

కావు మటంచు ధర్మజుని కాళ్లపయిన్ పడకున్న పేర్మిమై
ఈవె భరింతు నంచభయ మీయక యున్న - గురుండు కాడు - గౌ
రీ విభు డడ్డమై నిలువరించును గాక - అని వెన్ను చూపుచున్
పోవక యున్న - సైంధవుని పోకడతున్ - రవి గ్రుంకు నంతకున్.

యుద్ధ మధ్యంలో - అర్జునుని అధిక్షేపిస్తూ - కర్ణుని చేతిలో ఓడిపోయిన ధర్మరాజు . శ్రీ కృష్ణునితో

అని యొనరింప బోవు సమయమ్మున- కర్ణుని గెల్చు వార లీ
మొన నెవరంచు నే నడుగ - మోసము చేసె నితండు నేను నే
నని నను; లేక యున్న - విపినాంతర భూమికి వచ్చి తాకనే
ర్చునె నిశితాంబకంబులును సూత కుమారుని పోటు మాటలున్.

ధర్మరాజు అర్జునునితో :

రథియై తామరసాక్షుడు
ప్రథనము గావించు గాండివం బాసగుము - సా
రథివై తేరు నడుపుము - ఈ
విధమున కర్ణుండు గ్రుంకు - వీరమ్మన్యా.

హ్రదంలో దాగుకొనిన దుర్యోధనునితో ధర్మరాజు :

చచ్చిరి సోదరుల్ సుతులు చచ్చిరి - చచ్చిరి రాజు లెల్ల; ఈ
కచ్చెకు మూల కంద మగు కర్ణుడు మామయు చచ్చి రీ గతిన్
పచ్చని కొంప మాపితివి ! బాపురె కౌరవ నాథ, నీ సగం
బిచ్చెద జీవితేచ్ఛ గల దేని బయల్పడు మయ్య గ్రక్కునన్.

భీముడు - దుర్యోధనుని శిరస్సు తన్నినపుడు - ధర్మరాజు

చతురంభోధి పరీతమైన ధరణీ చక్రంబు శాసించి భూ
పతివర్గం బరిగాపులై కొలువ సేవాసక్త రాజేంద్ర మౌ
ళితలాలంకృత రత్నదీధితి సరోలీనుండవై యుండు, నీ
స్థితి ఈ రీతిగ నేటికిన్ పరిణమించెన్ గాదె దుర్యోధనా !

## నాటకం - దృశ్యకావ్యం

శ్రోతలను పద్యాలు సులభంగా అర్థం కావాలి వినీవినగానే - అప్పుడు విఘంటువులు చూచే వ్యవధి శ్రోతలకు ఉండదు గదా. అంతేగాక - నాటకం రక్తికట్టాలంటే నవరసభరితంగా ఉండాలి. 'ఏకో రసః హాస్య ఏవ' అనే వారు ఉన్నారు. ధర్మచక్ర నాటకంలో హాస్యరస ప్రధానమైన ఒక పద్యం

కాలము మారిపోయినది - కంచర గాడిద చక్రవర్తి - గు
ఱ్ఱాలకు సార్వభౌముడయి రాజ్యము చేయుచు నున్నవాడు - దీ
పాలను ఆర్పుచున్న వెధవాయియె బల్ మొనగాడు నేడు; మా
ర్జాలము వ్యాఘ్రరాజ మొక జాతికి చేరెను - దండుకేశ్వరా.

## ఏది మంచి పద్యం ?

ఒక నటశేఖరుని తీర్పు ఇది. "ఒక సారి వినగానే ఆ పద్యం మళ్లీ వినాలనిపించాలి. రెండవ సారి వినగానే ఆ పద్యం శ్రోతకు కంఠస్థం కావాలి. కాకపోతే - మూడవసారి వినాలి. విన్నప్పుడు ఆ పద్యం కంఠస్థం అవుతే అది మంచి పద్యం. అంతే". సంగీతం ఆపాత మధురమే గాని సాహిత్యం ఆలోచనామృతం అని సహృదయుల తీర్పు. మూడు సారులు వినగానే కంఠస్థమయ్యే పద్యం మంచిదే. గొప్పదే. అయితే మూడు సారులు విన్నంత మాత్రాన కంఠస్థం కాని పద్యాలు అన్నీ తీసివేయదగినవి కావు. తీరికగా చదివి అర్థం చేసుకొని కంఠస్థం చేయదగిన పద్యాలు ఎన్నో ఉంటాయి. అవి ఆలోచనామృతాలు.

# ఆంధ్ర పద్య కవితా సదస్సు

అధ్యక్షుడు
డాక్టరు. నందూరి రామకృష్ణమాచార్య
1-8-76 పెండరు గాస్టు రోడ్డు
35 జవాహరునగరు, సికింద్రాబాదు-3.

ప్రధాన కార్యదర్శి
శ్రీ శిష్ట్లా వెంకట్రావు
27-96 (2) గాంధీ నగరు,
యలమంచిలి - 531 055

గౌరవ అధ్యక్షులు
శ్రీ కొండేపూడి సుబ్బారావు (విశాఖపట్టణం)
డా. కొర్లపాటి శ్రీరామమూర్తి (విశాఖపట్టణం)

సహ అధ్యక్షులు
డాక్టరు కోవెల సంపత్కుమారాచార్య (వరంగల్)

ఉపాధ్యక్షులు
డా. ఎస్.వి. రామారావు (హైదరాబాద్)
మేజర్. ఎస్.టి.పి. రాధాకృష్ణమాచార్య (కైకలూరు)

కార్యదర్శులు
శ్రీ ఆశావాది ప్రకాశరావు (పెనుకొండ)
శ్రీ కేసాప్రగడ సత్యనారాయణ (కిర్లంపూడి)

కోశాధికారి
డాక్టరు గరికపాటి నరసింహారావు (కాకినాడ)

గచ్ఛల్ కార్యదర్శి
శ్రీ మల్లాది శివరామశాస్త్రి (విజయవాడ)

1994-95

# తెలుగు పద్య శిల్పం

రచయిత : నండూరి రామ కృష్ణమాచార్య

ఎవ్వాని గళములో నవ్వుకొన్నది నంద
నారామ మధుర మందార వల్లి
ఎవ్వాని కలములో నివ్వటిల్లెను విశ్వ
భారతీ మంజు మంజీర రవము
ఎవ్వాని చెలిమిలో నివ్వాళులెత్తెను
పర్దాలు లేని సౌహార్ద లక్ష్మి
ఎవ్వాని కలిమిలో పవ్వళించెను సుప్త
గుప్త దాన వ్రత ప్రాప్త తృప్తి
అతడు నండూరి వంశ పయః పయోధి
చంద్రముడు రామ కృష్ణమాచార్య సుకవి
గద్య పద్య తారాతోరణాద్యనేక
కావ్య నిర్మాణ చాతురీ సవ్యసాచి.

కరుణశ్రీ

– శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి

పద్య శిల్ప మందు పరిమళించుచు నుండు
రామణీయకతలు రాశిపోసి
నాణె మందు చున్న నండూరి సత్కవీ
అచి తూచి నిన్ను అభినుతింతు.

– శ్రీ మల్లెమాల కవి ( M.S. రెడ్డిగారు)